నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

మంగళవారం | 22 ఆగస్టు 2017 | విజయవాడ

సంపుటి 10 | సంచిక 293
| పేజీలు 12+12 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష రుతువు, భాద్రపద మాసం, శుక్ల, తిథి : పాడ్యమి రా. 10.55, నక్షత్రం : మఖ సా. 4.14, వర్జ్యం ఉ. 6.08 వరకు తిరిగి రా.12.07 నుంచి 1.42 వరకు, రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుంచి 9.08 వరకు, తిరిగి రా.11.00 నుంచి 11.45 వరకు సూర్యోదయం: ఉ. 6.04 గం; సూర్యాస్తమయం: సా. 6.34 గం.

ఎదిగి ఒదిగిన వెంకయ్య



ఉప రాష్ట్రపతికి ఆత్మీయ సన్మానం

- తెలుగువారికి గుర్తింపు తెచ్చింది ఎన్టీఆర్
- వెంకయ్య ఎదుగుదలలో కఠోర కృషి ఉంది
- దేశంలోనే వెంకయ్య అద్భుతమైన వక్త
- ఆయన తెలుగువాడిగా ఉండటం ప్రతి ఒక్కరికీ గర్వకారణం
- పేదలు, రైతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయం
- మాటల చతురత ఆయనకు వెన్నతో పెట్టిన విద్య
- ఉప రాష్ట్రపతి వెంకయ్యకు ఆత్మీయ సన్మానంలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాకముందు తెలుగువారు ఢిల్లీకి వెళితే మద్రాసీలు అని పిలిచేవారని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం తెలుగు బిడ్డ, భారత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తెలుగువారు ఉన్నారని, వారికొక ప్రత్యేకత ఉందని చెప్పి... తెలుగు జాతికి గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. ఇవాళ తెలుగుబిడ్డ వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవి అలంకరించడంతో తెలుగువాళ్లకి, తెలుగు భాషకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని కేసీఆర్ అన్నారు. తెలుగు ప్రత్యేకత నిలబెట్టడంలో వెంకయ్య దిట్టని అన్నారు. వెంకయ్యను అద్భుతమైన వక్త అని అంతా పొగుడుతారని తెలిపారు. వెంకయ్య అద్భుతంగా మాట్లాడటం వెనుక ఎంతో కృషి ఉందని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: వెంకయ్య బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా...కేంద్రమంత్రిగా పనిచేశారని చెప్పారు. 1980లో తొలిసారి వెంకయ్యను సిద్దిపేటలో చూశానని సీఎం కేసీఆర్ అన్నారు. ఎమర్జెన్సీ తర్వాత జైలు నుంచి విడుదలై వచ్చారని తెలిపారు. వెంకయ్య ప్రసంగానికి మైమరచిపోయానని ఆయన వెల్లడించారు. ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్యనాయుడుకు సన్మానం చేయడం తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వానికి దక్కడం సంతోషంగా ఉందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇవాళ వెంకయ్య అత్యున్నతమైన శిఖరాన్ని అధిరోహించడం గొప్పగా ఉందన్నారు. అందుకు మనందరం గర్వించాలి అని సీఎం అన్నారు. భారతదేశంలోనే వెంకయ్య అద్భుతమైన వక్త అని కొనియాడారు. తన మాటలతో వెంకయ్య అందరిని అబ్బురపరుస్తారు. ఉపన్యాసాన్ని పండించడంలో వెంకయ్యనాయుడు దిట్ట అని ప్రశంసించారు. వ్యంగ్యం, హాస్యం, రౌద్రం అన్నీ కలిస్తేనే పరిపూర్ణమైన ఉపన్యాసం అన్న కేసీఆర్.. ఇవన్నీ వెంకయ్య ఉపన్యాసంలో కనిపిస్తాయన్నారు. తెలుగు ఒక్కటే కాదు.. ఇంగ్లీష్, హిందీ అనర్గళంగా మాట్లాడే వ్యక్తి వెంకయ్య అని తెలిపారు. ఉపరాష్ట్రపతి పదవికి వెంకయ్య వన్నె మిగతా 6లో

హైదరాబాద్ అంటే మినీ భారత్: వెంకయ్య

- తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తూనే ఉంటా
- రెండు రాష్ట్రాలూ రెండు కళ్లే
- స్పష్టం చేసిన వెంకయ్యనాయుడు

6లో

చర్చలకు చైనా సిద్ధం

ఉద్రిక్తతలు తొలగిపోతాయన్న రాజ్‌నాథ్ సింగ్

- చర్చించేందుకు చైనా ముందడుగు వేసింది
- డోక్లామ్‌లో ప్రతిష్టంభన సమసిపోతుంది
- యుద్ధం వస్తుందన్న వార్తలు ఊహాగానాలే
- హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆశాభావం



న్యూఢిల్లీ : రెండు నెలలకు పైగా డోక్లామ్‌లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర హోమ్ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. రాజ్‌నాథ్ సింగ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ, చైనా, భారత్ మధ్య ఏర్పడిన ఈ సమస్య పరిష్కారం కోసం చైనా చర్చలకు సిద్ధమవుతుందని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డోక్లామ్‌లో ప్రతిష్టంభన ఏర్పడిందని, త్వరలోనే అది తొలగిపోతుందన్న నమ్మకం తనకు ఉందని వ్యాఖ్యానించారు. కాగా, చైనా, భూటాన్, భారత్ సరిహద్దుల్లోని డోక్లామ్‌లో చైనా అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాన్ని ఇండియన్ ఆర్మీ అడ్డుకున్న విషయం తెలిసిందే. దీనితో భారత్‌పై చైనా మండిపడుతోంది. దీనిపై అమెరికా కూడా స్పందించి చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. అయితే, చైనా మాత్రం మొదట భారత ఆర్మీ వెనక్కి వెళ్లిపోవాలని వ్యాఖ్యానిస్తోంది. చైనా చర్చలకు అంగీకరించకపోతుండడంతో భారత్.. చైనా సరిహద్దుల గుండా భద్రతను మరింత పెంచింది.

పారిపోయేందుకు సిద్ధం



- చైనాలో తల దాచుకోనున్న కింగ్ జాంగ్ ఉన్
- సురక్షితమైన బంకర్లను ఏర్పాటు చేసుకున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు

6లో

నేడు పీఎస్‌యూ బ్యాంకుల బంద్

- డిమాండ్ల సాధనే లక్ష్యంగా ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగుల నిరసన
- బ్యాంకు సేవలకు విఘాతం కలిగే అవకాశం

వివరాలు 5లో

జలసిరికి హారతి


- రాష్ట్రంలోని అన్ని జల వనరులను ఒకేసారి పూజించుకొనే కార్యక్రమానికి శ్రీకారం
- ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కార్యక్రమం
- పోలవరం ప్రాజెక్టుపై సీఎం సమీక్ష
- స్పిల్ చానల్ కాంక్రీట్ పనుల పురోగతిపై అసంతృప్తి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచన
- మట్టి తవ్వకం, కాంక్రీట్ పనుల పనులను వేగవంతం చేయాలని అధికార్లకు సిఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి, మేజర్‌న్యూస్ : అన్ని జల వనరులను ఒకేసారి పూజించుకునే సరికొత్త ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. నదులు, వాగులు, నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల దగ్గర నుంచి పంటకుంటల వరకు ప్రతి జలవనరుకు ప్రణమిల్లే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జలసిరికి హారతి పేరుతో ఈ కార్యక్రమాన్ని నెలాఖర్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని సూచించారు. గోదావరి, కృష్ణా పుష్కరాల సమయంలో నదులకు హారతి ఇవ్వడం మొదలుపెట్టామని, ప్రకృతితో ప్రతి ఒక్కరు మమేకం కావాలన్నదే తమ ఆకాంక్షని చెప్పారు. అందుకే ఏరువాక, వనం-మనం, తాజాగా జలసిరికి హారతి వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. జలసిరికి హారతి జరిగినన్ని రోజులు ఆయా ప్రాంతాల్లో మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్



పశ్చిమాన కనువిందు చేసిన సంపూర్ణ సూర్యగ్రహణం

- వీక్షించేందుకు ఆసక్తి చూపిన ఆఫ్రికా, అమెరికా ప్రజలు
- పరిశీలించిన నాసా

6లో



రేపే ఉప పోరు





- ఇరు పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ?
- ముగిసిన ప్రచారం
- రెండు వారాల తరువాత నంద్యలను వీడిన జగన్
- ఎక్కడి నేతలు అక్కడికి పయనం
- నెల రోజుల నుంచి ఉద్ధృతంగా సాగిన ప్రచారం
- ఓటరు నాడి ఎటు అన్న ఆందోళనలో ప్రధాన పార్టీలు
- రేపటి ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు: ఈసీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : వచ్చే సాధారణ ఎన్నికలకు రెఫరాండంగా భావిస్తున్న తరుణంలో నువ్వానేనా అన్నట్లుగా సాగిన ప్రచారం ఘట్టం ముగియగా నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలు బుధవారంనాడు జరగనున్నాయి. సోమవారంనాటు సాయంత్రం ఈప్రచారానికి అన్ని పార్టీలు ముగ్గింపు పలికాయి. నంద్యాల ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నంద్యాల ఉప ఎన్ని కల ప్రచారం ఊపందుకొంది. ఈ నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే నంద్యాల ఉప ఎన్నికల అం శంను దృష్టిని ఉంచుకొని టీడీపీ, వైసీపీ పార్టీలు తమ రాజకీయ వ్యూహాలను పదునుపెడుతూ వచ్చాయి. ఈ ప్రచారం సమయం ముగిశాక నంద్యాలలో బయటి నేత లెవరూ ఉండకూడదని రిటర్నింగ్ అధికారి ఆదేశాలు చేశారు. ప్రచారానికి సమయం ముగియడంతో టీడీపీ, వైసీపీ ముఖ్య నేతలు తమ ప్రచారాన్ని ముగించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. ఈనెల 23న నంద్యాల ఉపఎన్నికకు పోలింగ్ జరగనుండగా, 28వ తేదీన ఫలితాలు వెల్లడించనున్నారు. నంద్యాల నియోజకవర్గంలో మొత్తం- 2,19,108 లక్షల ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు- 1,07,778 కాగా, మహిళా ఓటర్లు- 1,11,018 మంది ఉన్నారు. ఇతరులు- 62 మంది, సర్వీసు ఓటర్లు-250 మంది ఉన్నారు. నంద్యాల పట్టణంలో మున్సిపల్ మిగతా 6లో

అంతే ఇంతే!



ఇంతవరకు ఈయన మాటలతోనే జనాల కడుపు నింపేవారు ఇక నుండి ఆయన నింపుతారేమో

ఉప ముఖ్యమంత్రిగా పన్నీర్

- తమిళనాట మారిన రాజకీయం
- ప్రమాణ స్వీకారం చేసిన సెల్వం
- పన్నీర్, పళని చేతులు కలిపిన ఇన్‌చార్జ్ గవర్నర్ విద్యాసాగర్ రావు
- పన్నీర్‌కు ఆర్థిక శాఖ అప్పగింత
- పాండ్యరాజన్‌కు భాషాభివృద్ధి శాఖ
- శశికల బహిష్కరణకు రంగం సిద్ధం
- పంతం నెగ్గించుకున్న పన్నీర్‌సెల్వం
- దినకరన్ వర్గంకూడా పళని వెంటే



చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గం, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం వర్గం సోమవారం తిరిగి ఒక్కటైన విషయం తెలిసిందే. దీంతో పన్నీర్‌సెల్వంతో పాటు పాండ్య రాజన్... పళనిస్వామి మంత్రివర్గంలో చేరుతూ ప్రమాణ స్వీకారం చేశారు. పన్నీర్‌సెల్వంకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. పాండ్యరాజన్‌కు తమిళ భాషాభివృద్ధి శాఖ బాధ్యతలు ఇచ్చారు. అలాగే అన్నా డీఎంకే మార్గదర్శక కమిటీకి కన్వీనర్‌గా పన్నీర్‌సెల్వం వ్యవహరించనున్నారు. ఇదే కమిటీ సహ కన్వీనర్ బాధ్యతలను పళనిస్వామి నిర్వర్తించనున్నారు.

పంతం నెగ్గించుకున్న పన్నీర్‌సెల్వం : తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా ఓ పన్నీర్ సెల్వం ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం మిగతా 6లో

నవరత్నాలకు నంద్యాలే నాంది

- చివరి రోజు ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు
- నాపై మీ ఆదరణ చూసి బాబు వెన్నులో వణుకు పుడుతోంది
- నంద్యాలను జిల్లా కేంద్రం చేస్తాం, ఇక్కడి అభివృద్ధి బాధ్యత నాది
- సీఎంగా ప్రజల్లో తిరగాల్సిన చంద్రబాబు... నేను నంద్యాలలో ఉంటే పనిలేకుండా ఉన్నానని విమర్శిస్తున్నాడు
- నందిగామ ఉప ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు అక్కడ ముఖం కూడా చూపడం లేదు
- నంద్యాల ఎన్నికల అనంతరం అదే పనిచేస్తాడు చంద్రబాబు
- నంద్యాల ఉప ఎన్నిక చరిత్రాత్మకమైంది : వైఎస్ జగన్



నంద్యాల, మేజర్‌న్యూస్ : ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి రాబోయే రోజుల్లో నవరత్నాల వెలుగులకు నంద్యాల నుంచే నాంది పలకండి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో ఆయన మాట్లాడారు. నంద్యాల ప్రజలు తనపై చూపిస్తోన్న ప్రేమానురాగాలను చూసి చంద్రబాబు వెన్నులో భయంపుట్టిందని, అందుకే అడ్డదారుల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని గుర్తుచేశారు. నంద్యాల అభివృద్ధి బాధ్యతను తనపై మోపి నీతిని, ధర్మాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. ఇంకా ఆయన ఇలా అన్నారు. "మీరంతా నాకోసం వచ్చి ఎండలో నిల్చున్నారు. చిరునవ్వుతోనే ఆత్మీయతలను మిగతా 6లో

నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌ః నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్‌కు సర్వంసిద్ధంచేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ వెల్లడించారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం ముగిసిన నేపథ్యంలో సోమవారంనాడు మీడియయా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. మొత్తం 255 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 6 కంపెనీ పారా మిలటరీ బలగాలతో భద్రతా ఏర్పాటు చేశామని, 82 ఫ్లైయింగ్ స్క్వాడ్ లు క్షేత్రస్థాయిలో ఎన్నికలను పరిశీలిస్తాయని ఆయన అన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూలో ఉన్నవారంతా ఓటేయొచ్చని తెలిపారు. 23వ తేదీ వరకు మద్యం పాపులు బంద్ చేయాలని, బల్క్ ఎస్సెమ్మెస్‌లపై నిషేధం విధించినట్లు తెలిపారు. ఎలాంటి ఒపీనియన్ పోల్స్, సర్వేలు నిర్వహించకూడదన్న ఆదేశాలు ఇప్పటికే జారీ చేశామన్నారు. సోషల్ మీడియాలో కూడా ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో స్పందించేలా ఏర్పాట్లు చేశామని భన్వర్‌లాల్ వెల్లడించారు.



తెలుగు రాష్ట్రాలకు సహకరిస్తూనే ఉంటా

- హైదరాబాద్ మినీ భారత్
- తెలంగాణాతో విడదీయని బంధం నాది
- రాజకీయంగా పెరిగింది హైదరాబాద్‌లోనే
- రాష్ట్రం విడిపోయింది ఎవరిపైనో కోపంతో కాదు
- ఎవరి ప్రాంతాన్ని వారు పాలించుకునేందుకు
- ఇద్దరు సీఎంలు అభివృద్ధిలో సహకరించుకోవాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- వెంకయ్యకు రాజ్ భవన్‌లో ఘనంగా పౌర సన్మానం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ నేల సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో ఆయనకు ఘనంగా పౌరసన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ.. సన్మానం తర్వాత విందు ఏర్పాటు చేసినట్లు సీఎం కేసీఆర్ చెప్పారు. కానీ ఆయన ప్రసంగం విన్నాక కడుపు నిండిపోయిందన్నారు. తెలంగాణతో నాకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. నేను రాజకీయంగా పెరిగింది.. ఎదిగింది.. ఒదిగింది తెలంగాణలోనే అని అన్నారు. హైదరాబాద్ బిర్యానీ, హలీం ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. ప్రపంచ అభివృద్ధి పటంలో హైదరాబాద్ ప్రత్యేకస్థానం సంపాదించుకుందన్నారు.

తెలుగు భాషలో గ్రామరే కాదు గ్లామర్ ఉంది

తెలుగుభాషలో గ్రామరే కాదు.. గ్లామర్ కూడా ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్య అన్నారు. అంటువ్యాధిలా మారిన ఇంగ్లీష్‌ను వదిలించే బాధ్యతను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీసుకోవాలని కోరారు. కన్నతల్లిని, మాతృభాషను, మాతృదేశాన్ని పట్టించుకోని వాడు మనిషే కాదని వెంకయ్య తెలిపారు. ఆంగ్లానికి నేను వ్యతిరేకం కాదు.. తెలుగు భాషాభిమానిని. రాజకీయంగా ఎదిగిన హైదరాబాద్ నుంచే నా అధికారిక పర్యటనను ప్రారంభించాలని అనుకున్నా. ఆకలి లేని, అవినీతి, అక్రమాలకు తావులేని దేశాన్ని మనం నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం కల్పించాలి. రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటానని ప్రకటించారు. అవసరం అయితే మంత్రులు, ప్రధానితో సహా మాట్లాడుతానన్నారు. ప్రజలతో మమేకమై ఎదిగిన నాకు ఉపరాష్ట్రపతి ప్రొటోకాల్ కొత్తగా ఉంది. దానికి క్రమంగా అలవాటు పడుతున్నాం. అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సన్మానం తర్వాత విందు ఏర్పాటు చేశామని కేసీఆర్ తెలిపారని, అయితే ఆయన ప్రసంగం విన్నతర్వాత తనకు కడుపునిండిపోయిందని వెంకయ్య తెలిపారు. కేసీఆర్ సాహిత్యం, భాషలోని మాధుర్యం అద్భుతమని ఆయన పొగిడారు. తెలంగాణ నేల సాహిత్యానికి నెలవన్నారు. తెలంగాణ సంస్కృతి విశిష్టమైనది...తెలంగాణ రుచులు భిన్నమని పెర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రంగానే రాజకీయాల్లో ఎదిగానని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తనకు పౌరసన్మానం చేయడం గొప్పగా ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ కు ధన్యవాదాలు చెప్పారు వెంకయ్య. తాను పుట్టింది నెల్లూరు.. చదివింది విశాఖలో.. రాజకీయంగా పెరిగింది.. ఒదిగింది.. ఎదిగింది మాత్రం హైదరాబాద్ లోనే అని వెంకయ్యానాయుడు చెప్పారు. తెలంగాణాలో అనేక పర్యాయాలు నేను పర్యటించాను. విభిన్న మతాలు, విభిన్న సంప్రదాయాలు, విభిన్న ప్రజల మేలు కలయిక తెలంగాణ. హైదరాబాద్ ను ఒక మినీ భారత్ అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హైదరాబాద్ అంటే ఉత్తరాది వాళ్లకి దక్షిణాది.. దక్షిణాది వాళ్లకి ఉత్తరాది అని తెలిపారు వెంకయ్య. హైదరాబాద్ బిర్యానీ, హలీంకు ప్రత్యేకత ఉందన్నారు. తాను మంచి భోజనప్రియుడిని.. భాషా ప్రియుడిని అని పేర్కొన్నారు. తెలంగాణలో తాను పర్యటించని ప్రాంతం లేదు. అన్ని తాలుకాలు తిరిగాను. హైదరాబాద్ అన్న.. తెలంగాణ అన్న తనకెంతో ఇష్టమన్నారు.

విడిపోయి సహకరించుకోవాలి

తెలంగాణకు హైదరాబాద్ నగరమే బ్రాండ్ అని చెప్పారు. రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కలిసి కలహించుకోవడం కన్నా.. విడిపోయి సహకరించుకోవడం మిన్నా అని గతంలో తాను చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.

'మనమందరం తెలుగువాళ్లమే. తెలుగువాళ్లంతా కలిసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉభయకుశలోపరిగా పనిచేయాలి. కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నా.. వాటిని కూర్చోని సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి. ఇద్దరు సీఎంలు కలిసి ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం కృషి చేయాలి' అని అన్నారు. ఈ సందర్భంగా దివంగత ప్రముఖ కవి సీ నారాయణరెడ్డిని వెంకయ్యానాయుడు స్మరించుకున్నారు. తెలుగు సంప్రదాయం, కట్టుబొట్టు, భాష, యాస, గోస గురించి సీనారే చెప్పిన పద్యాన్ని ఉటంకించారు.

దేశాభివృద్ధికోసం పాటుపడ్డారుః బండారు దత్తాత్రేయ

వెంకయ్యానాయుడు తెలుగు ప్రజలకు ఆత్మీయులు. ఆయన సమాజం కోసం ఎంతో పాటుపడ్డారని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా దేశంలో అందరికీ ఇళ్ల కోసం కృషిచేశారన్నారు. సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారన్నారు. ఆయన ఉపరాష్ట్రపతి కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని, ఆయన అసాధారణ ప్రతిభ కలిగిన రాజకీయ నేత అని కొనియాడారు. .

మనవాళ్లతో ఒకరు : గవర్నర్

మనవాళ్లలో ఒకరైన వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతి అయ్యారని గవర్నర్ నరసింహన్ అన్నారు. మొదట ఉషాపతిగానే ఉంటా.. ఉపరాష్ట్రపతిగా ఉండనని వెంకయ్య చెప్పారన్నారు. ఇవాళ ఉపరాష్ట్రపతిగా.. ఉషాపతిగా ఉన్నారు. ఇటీవల వెంకయ్యతో చేసిన విందు గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా సభను సమర్థంగా నిర్వహిస్తారని నమ్ముతున్నానని నరసింహన్ అన్నారు. తెలుగు వ్యక్తి ఉప రాష్ట్రపతి కావడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. వెంకయ్య ఎదుగుతూ...ఒదుగుతూ ఉన్నత స్థానానికి చేరారని ఆయన కొనియాడారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఘన సన్మానం




ఉప రాష్ట్రపతి పదవిప్రమాణంచేసిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన వెంకయ్యానాయుడుకు ప్రభుత్వం ఘన పౌరసన్మానం చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పట్లు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం నిలువెత్తు మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వచనాలు పలికి.. ఉపరాష్ట్రపతిని ఆశీర్వదించారు. రాజ్ భవన్ లో జరిగిన ఈ వేడుకకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీలు కేశవరావు, జితేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలువురు సినీ ప్రముఖులు ఐఏఎస్ అధికారులు, సినీప్రముఖులు, బీజేపీ నేతలు, పారిశ్రామిక వేత్తలు తదితరులు ప్రముఖులు హాజరయ్యారు.

ఉపరాష్ట్రపతికి బేగంపేటలో ఘనస్వాగతం


హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఒక రోజు పర్యటన నిమిత్తం హైదరాబాదుకు విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు గారికి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుతో పాటు మంత్రులు సోమవారం ఘనస్వాగతం పలికారు. ఉదయం సుమారు 11 గంటలకు హైదరాబాదుకు చేరుకున్న ఆయన బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర పోలీసు బృందాలచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఉపరాష్ట్రపతి రాజ్ భవన్ కు బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణా రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ కె. స్వామిగౌడ్, రాష్ట్ర శాసన సభ స్పీకర్ ఎస్. మధుసూధనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు మహమ్మద్ మహమూద్ అలీ, కడియం శ్రీహరి, రాష్ట్ర మంత్రులు నాయిని నంసింహారెడ్డి, ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కె. తారక రామారావు, లక్ష్మా రెడ్డి, హరీష్ రావు, మహేందర్ రెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస యాదవ్, జోగు రామన్న, జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు జితేందర్ రెడ్డి, కె. కేశవరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.పి. సింగ్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంతటి అజ్ఞాని మంత్రిగా ఉండటం దురదృష్టం'



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలకు అబద్దాలు చెబుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీ ప్రాంగణంలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు చేస్తే మంత్రి తోక ముడిచారని, సవాలు స్వీకరించలేక తన అనుచరులతో మాట్లాడించారని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 62 వేల ఎకరాల నుంచి 37 వేల ఎకరాలకు కుదించారని, ఈ ప్రాజెక్టు విస్తీర్ణం తగ్గించారని తాను అంటుంటే తగ్గించలేదని జూపల్లి అంటున్నారని, జీవోలో మార్పులు చేసి చేయలేదని అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఇంతటి అజ్ఞాని మంత్రిగా ఉండటం జిల్లా చేసుకున్న దురదృష్టమన్నారు. ఆయనకు మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. డిండికి నీళ్లు తీసుకుపోవడానికి తాము వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. డిండికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నీళ్లు తీసుకుపోవద్దని సీఎంకు లేఖ రాసింది జూపల్లి కాదా? అని నిలదీశారు. డిండికి నీళ్లు తీసుకుపోతున్నా ఎందుకు సైలెంటుగా ఉంటున్నారని ప్రశ్నించారు. కల్వకుర్తి కాలువలు, టన్నెల్ సైజులు తగ్గించడంలో జూపల్లి పాత్ర ఉందని, ఈ వ్యవహారంలో కోట్లు దండుకున్నది జూపల్లి కాదా అని నిలదీశారు. తాను అడిగిన ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానం చెప్పకపోతే మంత్రి పదవికి రాజీనామా చేసి పాలమూరు జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వంశీచంద్‌రెడ్డి డిమాండ్ చేశారు.

స్థానికులు ఎవరో స్థానికేతరులు ఎవరో ప్రజలకు తెలుసు



కర్నూలు,సూర్యప్రతినిధి: నంద్యాలలో స్థానికులు ఎవరో స్థానికేతరులు ఎవరో ప్రజలకు బాగా తెలుసునని మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం మంత్రి అఖిల ప్రియ మీడియాతో మాట్లాడుతూ శిల్పా మోహన్‌రెడ్డి తరపున జగనే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 12 ఏళ్లుగా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, అందుకే శిల్పా మోహన్‌రెడ్డి మాట్లాడటం లేదని మంత్రి భూమా అఖిలప్రియ ఎద్దేవా చేశారు. కాగా సోమవారం సాయంత్రంతో ఉపఎన్నికల ప్రచారం ముగియనుంది. స్థానికులు తప్ప ఇతరులు ఎవరూ నంద్యాలలో ఉండరాదని, ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇప్పటికే ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

ప్రకటనల్లోనే టీఆర్ఎస్ పాలన : రావుల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీఆర్ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక.. పాలన అంతా ప్రకటనలతోనే నడుస్తోందని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన పథకాలు ప్రవేశపెడుతున్నామంటూ వూహాచిత్రాలు విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. ప్రాజెక్టులకు సంబంధించి వూహాచిత్రాల విడుదలే తప్ప నిర్మాణాలు జరగడం లేదని చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. సర్కారు అలసత్వంతో పంచాయతీరాజ్, స్థానిక సంస్థలు నిర్వీర్యమైపోయాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం తన ఫాంహౌస్ మార్గంలోని గ్రామాలకే కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తూ.. మిగతా గ్రామాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమగ్ర సర్వే నిర్వహించి చాలా రోజులు అయినప్పటికీ ఇంకా వివరాలు ఎందుకు బయట పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. జిల్లాల పునర్విభజన తరువాత జిల్లా పరిషత్‌లు త్రిశంకు స్వర్గంలోకి పెట్టేశారన్నారు. రాష్ట్రంలో 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా... కేసీఆర్‌కు రైతు అవార్డు ఎలా ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

శిల్పా కుటుంబాన్ని ఏమీ చేయలేరు



- మా కుటుంబంపై ఎన్నడూ అవినీతి ఆరోపణలు లేవు
- నీతి నిజాయతీలే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చాం
- వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి
- టీడీపీ బెదరింపులకు భయపడొద్దు

నంద్యాల, మేజర్‌న్యూస్‌ః ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శిల్పా సహకార సొసైటీపై చేసిన ఆరోపణలను వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ఖండించారు. సోమవారం ఉదయం శిల్పా మోహన్ రెడ్డి నంద్యాలలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం విమర్శలు, ఆరోపణలపై ఆయన వివరణ ఇచ్చారు. శిల్పా కుటుంబంపై ఎన్నడూ అవినీతి ఆరోపణలు లేవని, తాము ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టం చేశారు. తమ కుటుంబానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారాలు, తాజా పరిణామాలు చాలా బాధపెడుతు న్నాయన్నారు. తనపై ఇప్పటివరకూ చిన్నకేసు కూడా లేదని శిల్పా మోహన్ రెడ్డి తెలిపారు. తాము ఎన్నడూ సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడలేదన్నారు. పదిమందికి సహాయం చేయాలని ఆశించామని, నీతి నిజాయితీలే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చామన్నారు. బెదిరింపులతో భయపడేది లేదని శిల్పా మోహన్ రెడ్డి అన్నారు. నంద్యాల ఎన్నికల్లో టీడీపీ పెద్ద ఎత్తున అక్రమాలు చేస్తోందని, టీడీపీకే ఓట్లు వేయాలంటూ అన్నివర్గాలను బెదిరింపులకు గురి చేస్తున్నారని, కోట్ల రూపాయిలు టీడీపీ నేతలు వెదజల్లుతున్నారని శిల్పా మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. అధికార బలంతో టీడీపీ నేతలు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రలోభపెట్టి కౌన్సిలర్లను, నాయకులను తీసుకున్నారన్నారు. అర్ధరాత్రి తమ కార్యకర్తలు, అనుచరులపై పోలీసులు దాడి చేశారని ఆయన తెలిపారు. ప్రజల అండ ఉన్నంతవరకూ శిల్పా కుటుంబాన్నిఎవరూ ఏమీ చేయలేరని అన్నారు.

ఆరోపణలు బాధాకరం..

శిల్పా సహకార బ్యాంకుపై చంద్రబాబు ఆరోపణలు చేయడం బాధాకరం. శిల్పా సహకార సొసైటీ చట్ట వ్యతిరేకమని సీఎం ఆరోపించారు. చంద్రబాబు చేసిన ఆరోపణలపై వివరణ ఇవాల్సిన అవసరం ఉంది. శిల్పా సహకార సొసైటీ రిజిస్ట్రర్ అయింది. ఏ విచారణకు అయినా మేం సిద్ధం. ఎప్పుడు సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదు. ఈ రోజు వరకూ మేం నిజాయితీగా ఉన్నాం. మానవ సేవే మాధవ సేవగా నమ్మి రాజకీయాల్లోకి వచ్చాం. పేద కుటుంబంలో పుట్టి పదిమందికి సేవ చేయాలని ఆశించా. శిల్పా కుటుంబంపై ఎప్పుడు అవనీతి ఆరోపణలు లేవు.

తెలుగుదేశం పార్టీ బెదిరింపులకు నంద్యాల వాసులు భయపడాల్సిన అవసరం లేదని వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆఖరి రోజు గాంధీ చౌక్ లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన రోడ్ షోలో శిల్పా మోహన్ రెడ్డి ప్రసంగించారు. చంద్రబాబు ఇళ్లు కట్టిస్తామన్న మాట పచ్చి అబద్ధమని ఈ సందర్భంగా శిల్పా తెలిపారు. భూమా నాగిరెడ్డి బతికున్న సమయంలో పదివేల ఇండ్లు ఫ్రీగా కట్టిస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం డబ్బులు అడుగుతూ ఆ మాట నిలబెట్టుకోలేకపోయిందన్నారు. వైఎస్ జగన్ సీఎం కావటం ఖాయమని, ఆయన అధికారంలోకి రాగానే మూడు సెంట్ల స్థలం, ఉచిత ఇళ్లు మంజూరు చేస్తామని శిల్పా హామీ ఇచ్చారు. ఓట్లు వేయకపోతే రేషన్ కార్డులు తొలగిస్తామని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారని, ఒక్క రేషన్ కార్డు పోనివ్వకుండా చూసుకునే బాధ్యత తమదేనని ఆయన తెలిపారు. రౌడీయిజంను అదుపు చేసే చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వైఫై సదుపాయం ఇలాంటివన్నీ నెరవేర్చలేదని శిల్పా పేర్కొన్నారు. అభివృద్ధి అంటే బిల్డింగ్‌లు కూలగొట్టడం, రోడ్లువేయటం కాదని, పరిశ్రమలు, విద్యాలయాలు రావాల్సిన అవసరం ఉందని శిల్పా అభిప్రాయపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణానికి తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకున్నానని, శిల్పా కేబుల్ పేరిట తక్కువ నగదుకే సదుపాయాన్ని కల్పించానని ఆయన పేర్కొన్నారు. మీకు ఆళ్లగడ్డ రాజకీయాలు కావాలో నంద్యాల రాజకీయాలు కావాలో నిర్ణయించుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఓటేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన మద్యం పాలసీపై సమీక్ష



హైదరాబాద్, సూర్య ప్రధాన ప్రతనిధిః నూతన మద్యం పాలసీ పైన త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్దం చేసి ముఖ్య మంత్రి అనుమతితో ప్రకటించ బోతున్నట్లు రాష్ట్ర ఆబ్కారిశాఖ మంత్రి టి.పద్మారావు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు బడుగు, బలహీన వర్గాలకు ఆత్మ గౌరవం పెరిగిందని మంత్రి అన్నారు. ఉమ్మడి రాష్ట్రం లో హైదరాబాద్ లో కల్లు దుకాణాలు మూసి వేసి గౌడ కులస్తుల పొట్ట కొట్టిన ఘనత వారికే దక్కిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి హైదరాబాద్ లో కల్లు దుకాణాలు తెరిచి కొన్ని వేలమందికి ఉపాధి కల్పించారన్నారు. అదే విదంగా చెట్టుపై నుండి క్రిందపడి చనిపోయిన గీత కార్మికుడికి పరిహారంగా రూ. 2 లక్షల నుండి రూ. 5 లక్షలకు, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ. 50 వేల నుండి రూ.5 లక్షల వరకు పెంచినట్లు మంత్రి తెలిపారు. గీత కార్మికుల అభివృద్ధి కి తోడ్పాటు అందిస్తున్నామని మంత్రి అన్నారు. గీత కార్మికుల మరణాలను పూర్తి గా తగ్గించడానికి సులభంగా తాటి / ఈత చెట్లు ఎక్కే యంత్రాలను ఉచితంగా అందిస్తామని మంత్రి అన్నారు. లైసెన్సులు కలిగిన వారందరితో ఒక సమావేశం పెట్టి, డ్రాఫ్ట్ పాలసీ ని తొందరగా తయారుచేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. డినోటిఫికేషన్ ఆఫ్ స్టేట్ హైవేస్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు, చివరిగా ఎన్ని దుకాణాలు వుంటాయి, ఎన్ని దుకాణాలు షిఫ్టింగ్ చేయవలసి వుంటుంది, ఈ ప్రక్రియను త్వరితగతిగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.

వై.ఎస్.వేయించిన రోడ్లపై నీవెలా పాదయాత్ర చేశావ్ బాబు

- నంద్యాల ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే రోజా ఫైర్
- శిల్పా లోకల్ ఎన్నికల తరువాత టీడీపీ అభ్యర్థి కనపడరు
- ఫ్యాన్ ఇంట్లో ఉంటుంది సైకిల్ బయట




నంద్యాల, మేజర్‌న్యూస్‌ః మేము నిర్మించిన రోడ్లపై నడుస్తూ మాకు ఓటేయరా? అని చంద్రబాబు అడుగుతున్నారు. మరి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిగారు వేయించిన రోడ్లపై నువ్వు పాదయాత్ర ఎలా చేశావ్ అని చంద్రబాబును వైసీపీ ఎమ్మెల్యే రోజా ప్రశ్నించారు. వై.ఎస్. నుంచి ఎన్నో మేళ్లు పొందిన రైతులు, మహిళలు, విద్యార్థులను ఓట్లు ఎలా అడిగావ్? అని ముఖ్యమంత్రిని నిలదీశారు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా. సోమవారం నంద్యాలలోని యాళ్లూరులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో చంద్రబాబుకు బుద్ధి చెప్పకుంటే.. వచ్చే రెండేళ్లలో టీడీపీ భరించలేని స్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని రోజా గుర్తుచేశారు. అసెంబ్లీ టైగర్, ఆంధ్రా ఫ్యూచర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరుస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. మీరు ఓటు ఎవరికి వేశారో తెలిసిపోతుంది, ప్రభుత్వ పథకాలు తొలగిస్తామని టీడీపీ వాళ్లు ఓటర్లను బెదిరిస్తున్నారు. కానీ, మనం వేసే ఓటు ఎప్పటికీ సీక్రెట్‌గానే ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది. కాబట్టి మీరు భయపడాల్సిన పనిలేదు. ధైర్యంగా మూడేళ్లుగా ప్రజలను మోసం చేస్తోన్న చంద్రబాబుకు దిమ్మతిరిగి బొమ్మ కనపడేలా ఓటు వేయండి. స్మశానానికి ముగ్గుండదు.. చంద్రబాబుకు సిగ్గుండదు. గతంలో భూమా నాగిరెడ్డిని దొంగ, విషపక్షం అని తిట్టిపోసి ఇప్పుడు దేవుడని పొగుడుతున్నారు. మైనారిటీలు పక్కన కూర్చునేందుకు అర్హతలేదన్న విధంగా ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వని చంద్రబాబు పనికిరాని వాళ్లకు, దద్దమ్మ లోకేశ్‌కు మాత్రం ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టారు. తీరా నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థిని నిలబెట్టిన తర్వాతగానీ ఫరూఖ్‌గారికి పదవి ఇవ్వలేదు. అంటే ఎన్నికలు రాకపోతే ఆ పదవి కూడా ఇవ్వకపోయేవారు. అదే, మహానేత వైఎస్సార్ మైనారిటీలను కుటుంబసభ్యులుగా చూసుకున్నారు. నలుగురికి మంత్రి పదవులు, మండలి డిప్యూటీ చైర్మన్ పదవి, ముస్లిం విద్యార్థినులకు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఇప్పుడు జగనన్న.. నలుగురు మైనారిటీ ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారు అని రోజా గుర్తుచేశారు.

అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు పెంచాలి



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌ః అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు ఒక లేఖ రాశారు. కార్మికుల సంక్షేమం ఏ ప్రభుత్వా నికైనా ఒక ప్రాధన్యంగా నిలుస్తుందని, అందులో అసంఘటిత కార్మికుల సంక్షేమం అత్యంత ప్రాధాన్యమైన అంశం అని తెలిపారు. కార్మిక సంక్షేమంలో కనీస వేతన ప్రకటన ఒక ముఖ్యమైన ప్రక్రియ అని, స్వతంత్ర్య భారత దేశంలో ఎప్పుడూ లేని విధంగా ప్రధాని నరేంద్రమోదీ కనీస వేతనాల్ని 42శాతం పెంచా రని పేర్కొన్నారు. ఈ పెంపుతో కేంద్రం ప్రకటించేదాని కంటే ఎప్పుడూ ఎక్కు వగా ఉండే రాష్ట్రాల కనీస వేతనాలు మొదటిసారి కేంద్రం నిర్ణయించిన దాని కంటే తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కనీస వేతనాల కోసం రెండు కమిటీలు వేశారని, ఆ కమిటీలు 43 షెడ్యూళ్లపైన వేత నాలు పెంచుతూ ప్రభుత్వానికి సిఫారసు చేసినా.. ఇంతవరకు ప్రభుత్వం ఆమోదించలేదని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

26న అమరావతికి ఉపరాష్ట్రపతి వెంకయ్య



అమరావతి,సూర్యప్రతినిధి: ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత వెంకయ్య నాయుడు తొలిసారి నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను సోమవారం అధికారులు ఖరారు చేశారు. ఈనెల 26న అమరావతికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రానున్నట్లు కలెక్టర్ కోన శశిధర్ వెల్లడించారు. ఆయన రాకను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున వెంకయ్యకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర అర్బన్ హౌసింగ్ కార్యక్రమంలో వెంకయ్య పాల్గొంటారన్నారు.

జగన్ సమక్షంలో రోజా పెళ్లి వార్షికోత్సవం

నంద్యాల, మేజర్‌న్యూస్‌ః నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో చాలా బిజీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యే, ప్రముఖ నటి రోజా వార్షికోత్సవ వేడుక వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ రోజా, సెల్వమణి దంపతులు తమ 15వ వివాహ వార్షికోత్సవం వేడుకను నంద్యాలలో జరుపుకొన్నారు.

బాసర అమ్మవారి విగ్రహం దొరికింది

ప్రధాన అర్చకుని బీరువాలో లభ్యం

నిజామాబాద్,మేజర్‌న్యూస్: గత కొంతకాలంగా కనిపించకుండా పోయిన బాసర సరస్వతీ దేవీ ఉత్సవ విగ్రహం దొరికింది. అది కూడా ఆలయ ప్రధాన అర్చకుడి బీరువాలో లభ్యమైంది. వివరాల్లోకెళితే.. బాసర ఆలయంలో కనిపించకుండా పోయిన సరస్వతీ దేవి ఉత్సవ విగ్రహాన్ని.. దేవరకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమానికి తరలించారన్న విషయాన్ని మీడియా వెలుగులోకి తెచ్చింది. అప్పటి నుంచి ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో దేవాదాయ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రధాన అర్చకుడు సంజీవ్ బీరువాలను పోలీసుల సమక్షంలో తెరిచారు. దేవాదాయ శాఖ సంజీవ్‌కు అధికారికంగా కేటాయించిన ఒక బీరువాలో పూజకు సంబంధించిన సామాగ్రి, ఇతర్రతా వస్తువులు ఉండగా, ఆయన వ్యక్తిగత బీరువా అయిన మరొకదాంట్లో ఉత్సవ మూర్తి విగ్రహం లభ్యమైంది. అయితే నేడు లభించిన విగ్రహం.. గత నెల 28న శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం జరిగిన రోజున నల్గొండ జిల్లా దేవరకొండలో పూజలు నిర్వహించిన విగ్రహం ఒకటేనని దేవాదాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ ఘటనకు ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌ను బాధ్యుడిగా గుర్తించిన అధికారులు.. అతనితో పాటు మరొకరిని విధుల్లోంచి తొలగించారు. కాగా, ఈ వివాదంలో తమ తప్పేమీ లేదని, తాము తీసుకెళ్లింది ఉత్సవ విగ్రహం కాదని, ఆలయానికి భక్తులు కానుకగా ఇచ్చిన విగ్రహాన్నే తాము తరలించామని ప్రధాన అర్చకుడు సంజీవ్ తాను చేసిన పనిని సమర్థించుకుంటున్నాడు. అయితే ఆలయానికి సంబంధించిన ఏ చిన్న వస్తువుపైనా వారికి అధికారం లేదని, వారు చేసింది ముమ్మాటికీ తప్పేనని, శిక్షార్హులని దేవాదాయ శాఖ అధికారులు తేల్చి చెబుతున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఆలయ ఈవో.. వివాదం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువగా స్పందించబోనన్నారు. ఘటనపై పూర్తి నివేదికను తయారుచేసి కోర్టుకు నివేదిస్తామని, కోర్టు ఆదేశాల ప్రకారం.. తదుపరి చర్యలు ఉంటాయన్నారు. మరోవైపు ఆలయంలో జరుగుతున్న వ్యవహారంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెడ్డి హాస్టల్ మాదిరిగా...
బీసీ కులాలకు కేటాయించాలి : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి హాస్టల్ కు 10ఎకరాలస్థలం ,10కోట్ల రూపాయలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని, అదే విధంగా 112 బీసీ కులాలకు స్థలం, నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ర్యాగ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీసీ నేతలు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణతో కలిసి సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. బ్రాహ్మణ సదన్ కు కూడా ఎకరాల స్థలం, కోట్ల రూపాయాలు కేటాయించడాన్ని స్వాగతీస్తున్నామని, ఇదే రీతిలో బ.సి జాబితాలో ఉన్న కులాలకు కూడా వారి వారి జనభా నిష్పత్తిలో స్థలాలు మరియు బడ్జెట్ కేటాయిస్తే హాస్టళ్ళు కమ్యునిటీ హాళ్ళు నిర్మించుకునే అవకాశం ఉంటుందని, ఈ కులాలు విద్య,ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందుతాయని అన్నారు. ముఖ్యంగా బి.సి జాబితాలో 112 కులాలు ఉన్నప్పటికి ప్రధానంగా 64 కులాలు వివిద వృత్తులు,సేవలు చేస్తూ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, ముదిరాజ్ లు, మున్నూరు కాపులు, గౌడ, గొల్ల, కురుమ, యాదవ, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, చాకలి, మంగలి, గంగపుత్ర, కుమ్మరి, కమ్మరి, వండ్రంగి, ఉప్పరి, మేదరి, జంగం, లింగాయత్, వడ్డెర, అరెకటిక, గాడ్ల, పేరిక, మేరు, వంజరి, వంశీరాజ్, గంగిరెద్దుల తదితర కులాలకు జనాభా నిష్పత్తిలో ఒక ఎకరం నుంచి 20ఎకరాల వరకు స్థలం, 5 కోట్ల నుంచి 20 కోట్ల వరకు బడ్జెట్ కేటాయిస్తే అన్ని సౌకర్యాలతో హాస్టల్ అలాగే కమ్యూనిటి హాల్ నిర్మాణం చేసుకుంటారు. అలాగే ప్రభుత్వ అద్వర్యంలో నడిచే 250 బి.సి,170 యస్.సి, 102 యస్.టి కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని, కోట్ల అద్దె చెల్లిస్తున్న ఈ భవనాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. రెడ్డి హాస్టల్ కు, బ్రాహ్మణ సదన్ కు ఇచ్చిన మాదిరిగా అత్యంత వెనుకబడిన కులాలకు సంచార జాతులకు ఇస్తే తమపేరు చారిత్రాత్మకంగా నిలుస్తుందని లేఖలో పేర్కొన్నారు.



నంద్యాలలో అభివృద్ధి జగన్‌కు కనపడటం లేదా?

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



కర్నూలు,సూర్యప్రతినిధి: నంద్యాలలో అభివృద్ధి జగన్‌కు కనపడటం లేదా అని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిలదీశారు. నంద్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన జగన్‌పై మండిపడ్డారు. ఉర్దూ వర్సిటీని ఎప్పుడో ప్రారంభించామని, ఆ విషయం జగన్‌కు తెలియదా అని మంత్రి ప్రశ్నించారు. విదేశాల నుంచి జగన్ మనుషులు ఫోన్‌లు చేసి బెదిరిస్తున్నారని, దమ్ముంటే నేరుగా వచ్చి మాట్లాడాలని మంత్రి సోమిరెడ్డి సవాల్ విసిరారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని తమను విమర్శించారని, వైసీపీ వైఖరి ఏంటో నంద్యాల ప్రజలకు చెప్పాలని సోమిరెడ్డి ప్రశ్నించారు. మైనార్టీలను జగన్ మభ్యపెడుతున్నారని మంత్రి సోమిరెడ్డి ఆరోపించారు.

పేదలను ఖాళీ చేయించడం సరికాదు

ఏపీ ప్రభుత్వానికి చిరంజీవి లేఖ



విజయవాడ, మేజర్‌న్యూస్: తిరుపతి పట్టణంలోని 18వ వార్డులోని పేదల ఇళ్లను ప్రభుత్వం ఖాళీ చేయడాన్ని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభసభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నేత చిరంజీవి ఖండించారు. ఈ మేరకు సోమవారంనాడు ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. తిరుపతి 18వ వార్డులోని స్కావెంజర్స్ కాలనీని ఖాళీ చేయించడాన్ని ప్రశ్నిస్తూ ఆయన లేఖ రాశారు. 70 ఏళ్లుగా నివాసముంటున్న ప్రజల్ని ఖాళీచేయించటం సరికాదంటూ చిరంజీవి తన లేఖలో పేర్కొన్నారు. తిరుపతి నగరం మధ్యలో ఈ కాలనీ ఉండటం ఇష్టం లేకే మున్సిపల్ శాఖ ఈ పని చేస్తోందని ఆయన తన లేఖలో ఆరోపించారు. స్థానికులను ఖాళీ చేయించి ప్రైవేటు వ్యక్తులకు స్థలాన్ని కట్టబెట్టటంపై చిరంజీవి తన లేఖలో ఆక్షేపించారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని చిరంజీవి స్పష్టం చేశారు. ప్రభుత్వం బలప్రయోగంతో పారిశుద్ధ్యకార్మికుల కుటుంబాలను, యానాది కుటుంబాలను తరలించాలని చూడటం శోచనీయమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

పివిఆర్‌కే ప్రసాద్ అంత్యక్రియలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఈవో, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్(77) కన్నుమూశారు. శనివారం అర్ధరాత్రి గుండెనొప్పి తో బంజారాహిల్స్ కేర్ అస్పత్రిలో చేరిన ఆయన సోమవారం తెల్లవారు జామున రెండు గంటలకు తుదిశ్వాస విడిచారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పీవీఆర్కే ప్రసాద్ మృతికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్ సంతాపం తెలిపారు.

రఘువీరారెడ్డి ప్రగాడ సతాపం

విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పివిఆర్‌కే ప్రసాద్ (77) మృతి పట్ల ఏపీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరా రెడ్డి సంతాపం ప్రకటించారు.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారంనాడొక ప్రకటనను విడుదల చేశారు. మరో ప్రకటనలో విశాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.వి.ఆర్ కె.ప్రసాద్ మృతి పట్ల కాంగ్రెస్ సీనియర్ నేతలు మదాస్ గంగాధర్, సూర్యనాయక్ సంతాపం తెలిపారు.

27న నల్లగొండలో టీఎస్ఆర్టీసీ
కార్మిక సంఘ్ 2వ రాష్ట్ర మహాసభలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఈ నెల 27న నల్లగొండలో టీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘ్ తెలంగాణ 2వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయబద్ధమైన సమస్యల సాధనలో చిత్తశుద్ధితో పరిష్కారాలు ఆలోచిస్తూ నిజమైన ట్రేడ్ యూనియన్ కార్మికుల పక్షపాతిగా టీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘ్ కృషి చేస్తుందని తెలిపారు. సంస్థలో ఎన్నో అవకతవకలతో నష్టాలు వస్తున్నాయని, దీనికి ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ అనాలోచిత విధానాలే కారణమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం, మేనేజ్‌మెంట్‌తో ఎదురయ్యే సవాళ్లను, సమస్యలను ఎదుర్కోవడానికి బలమైన హక్కుల ఉద్యమాన్ని నిర్మించడానికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించి పోరాటాలు అమలు చేయడానికి ఈ మహాసభ సన్నద్ధమవుతుందని తెలిపారు. ఈ సభలకు జాతీయ బియంఎస్ కార్యదర్శి రాజ్ బిహారీ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

నెరవేరిన పన్నీర్ పంతం

“ముఖ్యమంత్రి జయలలిత మరణం తరువాత తమిళ నాట రాజకీయాల్లో అనేక కీలక పరిణామాలు సంభవిస్తున్నాయి. తాజాగా మరొక కీలక మార్పునకు నాంది పడింది. రాష్ట్ర రాజకీయాల్లో ఎలా అయినా పాగా వేయాలని భావించిన జయలలిత అనుంగు నెచ్చెలిగా చక్రం తిప్పిన శశికళ ‘చిన్నమ్మ’ వరుస చిక్కుల్లో చిక్కుకుంటుండగా తాజా పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఎఐఎడిఎంకె)లోని రెండు వర్గాలు ఎట్టకేలకు విలీనమయ్యాయి. ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఒ పన్నీర్‌సెల్వం సోమవారం సమావేశమై తమ మధ్య గల విభేదాలకు స్వస్తి పలికి తమ తమ నేతృత్వంలోని రెండు వర్గాలను విలీనం చేయాలని ఒప్పందానికి వచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం పన్నీర్‌సెల్వం తిరిగి ప్రభుత్వంలో స్థానం పొందారు. ఉప ముఖ్యమంత్రిగా పన్నీర్ సెల్వం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. పన్నీర్ వర్గంలోని ఒక ముఖ్య నేత కె పాండ్యరాజన్ కూడా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.”

ముఖ్యమంత్రి జయలలిత మరణం తరువాత తమిళ నాట రాజకీయాల్లో అనేక కీలక పరిణామాలు సంభవిస్తున్నాయి. తాజాగా మరొక కీలక మార్పునకు నాంది పడింది. రాష్ట్ర రాజకీయాల్లో ఎలా అయినా పాగా వేయాలని భావించిన జయలలిత అనుంగు నెచ్చెలిగా చక్రం తిప్పిన శశికళ ‘చిన్నమ్మ’ వరుస చిక్కుల్లో చిక్కుకుంటుండగా తాజా పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఎఐఎడిఎంకె)లోని రెండు వర్గాలు ఎట్టకేలకు విలీనమయ్యాయి. ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఒ పన్నీర్‌సెల్వం సోమవారం సమావేశమై తమ మధ్య గల విభేదాలకు స్వస్తి పలికి తమ తమ నేతృత్వంలోని రెండు వర్గాలను విలీనం చేయాలని ఒప్పందానికి వచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం పన్నీర్‌సెల్వం తిరిగి ప్రభుత్వంలో స్థానం పొందారు. ఉప ముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. పన్నీర్‌సెల్వం వర్గంలోని ఒక ముఖ్య నేత కె పాండ్యరాజన్ కూడా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పాండ్యరాజన్‌కు తమిళ భాష, సాంస్కృతిక శాఖ కేటాయించారు. పన్నీర్‌సెల్వం గతంలో వలె ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వహించనున్నారు. ఆయన అటు పార్టీ సారథ్య బాధ్యతలను కూడా స్వీకరించారు. పన్నీర్‌సెల్వం అన్నా డిఎంకె మార్గదర్శక కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఇదే కమిటీ సహ కన్వీనర్ బాధ్యతలను పళనిస్వామి నిర్వర్తించనున్నారు. ప్రమాణ స్వీకారం ముగిసిన తరువాత గవర్నర్ సమక్షంలో పళనిస్వామి, పన్నీర్‌సెల్వం చేతులు కలిపారు. అయితే, పన్నీర్ వర్గానికి మూడు మంత్రి పదవులు ఇస్తారని అంతకు ముందు వార్తలు వచ్చాయి. పన్నీర్‌సెల్వం తన వర్గాన్ని విలీనం చేసిన సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో అన్నా డిఎంకె నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసంగించిన పళనిస్వామి మరికొన్ని విషయాలు స్పష్టం చేశారు. తాను, కెపి మునుస్వామి సహ కన్వీనర్లు ఉంటామని ఆయన చెప్పారు. 11 మంది సభ్యులు సమన్వయ కమిటీ పార్టీని నడుపుతుందని సిఎం వెల్లడించారు. రెండాకుల గుర్తును నిలబెట్టుకోవడమే ప్రస్తుతం తమ మొదటి ప్రాధాన్యమని పళనిస్వామి సుస్పష్టం చేశారు. ‘అమ్మ’ ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆయన ప్రకటించారు. తాను చనిపోయిన తరువాత కూడా పార్టీ వందేళ్లు పైగా వర్ధిల్లాలని జయలలిత ఆకాంక్షించారని, అమ్మ ఆశయాలకు అనుగుణంగా పార్టీని నడుపుతామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికీ పార్టీలో భేదాభిప్రాయాలు ఉన్నాయని, కలసికట్టుగా వీటిని పరిష్కరించుకుంటామన్న విశ్వాసాన్ని పళనిస్వామి వ్యక్తం చేశారు. మరొక వైపు త్వరలోనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. కాగా, ప్రభుత్వం, పార్టీలో పదవులు అందుకోవడం ద్వారా పన్నీర్‌సెల్వం పంతం నెగ్గినట్లు అయింది. శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలన్న పన్నీర్ వర్గం డిమాండ్ ఇంకా నెరవేరలేదు. పార్టీ కార్యవర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని పన్నీర్‌సెల్వం చెప్పారు. చిన్నమ్మ భవితవ్యంపై పార్టీ ఎటువంటి వైఖరి అవలంబిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జయలలిత ప్రభుత్వం 2011లో తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పన్నీర్‌సెల్వం ఆర్థిక శాఖను నిర్వహించారు. ఎఐఎడిఎంకె అధ్యక్షురాలు శశికళకు మార్గం సుగమం చేయడం కోసం గత ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేంత వరకు పన్నీర్‌సెల్వం ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. ఎఐఎడిఎంకె శాసనసభా పక్షం నాయకురాలిగా నియుక్తురాలైనప్పటికీ శశికళ ముఖ్యమంత్రి కాలేక పోయారు. అక్రమ ఆస్తుల కేసులో శశికళను సుప్రీం కోర్టు దోషిగా నిర్ధారించి బెంగళూరు జైలులో శిక్ష అనుభవించాలని ఆదేశించడంతో సిఎం కావాలన్న శశికళ ఆకాంక్ష భగ్నమైంది. ఆమె ప్రస్తుతం బెంగళూరులోని పరప్పణ అగ్రహార జైలులో ఉన్న విషయం విదితమే. అక్రమ ఆస్తుల కేసులో 2014లో దోషిగా జయలలిత నిర్ధారితురాలైన దృష్ట్యా ఆమె స్థానంలో సిఎం పదవిని నిర్వహించినప్పుడు కూడా పన్నీర్‌సెల్వం ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్నారు. 2016లో జయలలిత మృతి అనంతరం కూడా ఆయన ఆర్థిక శాఖనే నిర్వహించారు. కాగా, తమిళనాడులో అధికార అన్నా డిఎంకె పార్టీలో పన్నీర్ సెల్వం వర్గం విలీనం పూర్తయిన నేపథ్యంలో శశికళ, దినకరన్ భవితవ్యంపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. వారిద్దరినీ పార్టీ నుంచి గెంటివేయాలని విలీన చర్చల సందర్భంగా పన్నీర్ వర్గం గట్టిగా పట్టుబట్టింది. అయితే, దినకరన్‌ను పార్టీ నుంచి వెలి వేయకూడదన్న ఆలోచనలో ముఖ్యమంత్రి పళనిస్వామి ఉన్నట్లు తెలుస్తోంది. దినకరన్‌పై వేటు వేస్తే తన పదవికి ముప్పు వచ్చే అవకాశం ఉన్నందున ఈ విషయంలో ఆయన ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒపిఎస్, ఇపిఎస్ వర్గాల మధ్య విలీన చర్చలు తుది దశకు వచ్చినప్పుడు దినకరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనను పార్టీ నుంచి గెంటివేస్తే పళనిస్వామి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు వెనుకాడబోనని ఆయన పరోక్షంగా బెదరించారు. అంతే కాదు. తనకు మద్దతుగా ఉన్న 20 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపిలతో మదురైలో ర్యాలీ కూడా నిర్వహించారు. ఒకవేళ దినకరన్‌పై వేటు వేస్తే అన్నా డిఎంకె 20 మంది ఎమ్మెల్యేల మద్దతు కోల్పోయే అవకాశం ఉంది. 235 మంది స్థానాలు ఉన్న తమిళనాడు అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118. ఒపిఎస్ వర్గం నుంచి 12 మంది ఎమ్మెల్యేలు పళనిస్వామి సర్కార్‌కు మద్దతు ఇచ్చినా మేజిక్ ఫిగర్‌కు 3 సీట్లు తగ్గుతాయి. మరొక వైపు ఏ చిన్న అవకాశం దొరికినా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రతిపక్ష డిఎంకె నాయకుడు ఎంకె స్టాలిన్ ఎదురు చూస్తున్నారు. తమిళనాడు అసెంబ్లీలో డిఎంకెకు 89 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు 9 మంది శాసనసభ్యులు ఉన్నారు. వారంతా కలిస్తే ప్రతిపక్ష బలం 98కి చేరుతుంది. వారికి దినకరన్ దగ్గర ఉన్న 20 మంది ఎమ్మెల్యేలు కలిస్తే పళనిస్వామి ప్రభుత్వం కూలడం ఖాయం. అందుకే దినకరన్‌పై వేటు వేయాలని పన్నీర్‌సెల్వం వర్గం ఎంత ఒత్తిడి చేస్తున్నా పళనిస్వామి ముందడుగు వేయడం లేదని విశ్లేషకుల అంచనా. అయితే, ప్రభుత్వం, పార్టీలో తన పంతం నెగ్గించుకున్న పన్నీర్‌సెల్వం ఏమి చేస్తారనే దానిపై తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

దేశమంతా మళ్లీ నమోనమో

–తిప్పినేని రామదాసప్ప నాయుడు : 99898 18212

- **సుస్థిరపాలన అందిస్తున్న మోడీ**
- **వచ్చే ఎన్నికల్లో కూడా మోడీకే అవకాశం**
- **అనేక పథకాలతో ఆకట్టుకుంటున్న పాలన**
- **విఫలమవుతున్న కొన్ని పథకాలు**
- **సర్జికల్ దాడుల మూలంగా ప్రపంచ గుర్తింపు**

ప్రధాని నరేంద్రమోదీ పాలనకు చూస్తుండగానే మూడున్నరేళ్ళు నిండాయి. 25 సంవత్సరాల తరువాత మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ మెజారిటీతో సుస్థిర ప్రభుత్వం ఏర్పడింది. 1989 నుంచి 2014 వరకు కొనసాగిన ప్రభుత్వాలన్నీ సంకీర్ణ ప్రభుత్వాలే. సుస్థిర ప్రభుత్వాలకు కాలం చెల్లిందనే ప్రచారం అప్పుడు జోరుగా సాగింది. ప్రస్తుతం మోదీ పాలనను చూస్తుంటే... సుస్థిర ప్రభుత్వాల యుగం వచ్చిందనే చెప్పాలి.... కాంగ్రెస్ పార్టీ ‘కోమా’ లో నుంచి బయటపడటానికి చాలా కాలం పట్టే అవకాశం కనిపిస్తోంది. మిగతా రెండు, మూడు జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీల స్థాయిలో బిక్కు బిక్కుమంటున్నాయి. అనేక రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలన్నీ ఒక గూటికి చేరే అవకాశాలు ఎలాగూ లేవు. ఏ విధంగా చూసినా వచ్చే రెండేళ్ల నాటికి మళ్లీ ప్రధానిగా మోదీనే ఎన్నికయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మూడేళ్ల కాలంలో జన్‌ధన్ యోజన, “స్వచ్ఛభారత్”, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి ముద్రయోజన, జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, సంసద్ ఆదర్శ్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, గరీబ్ క ళ్యాణ్ యోజన, గ్రామ్ సంచాయ్ యోజన, జన ఆసాది యోజన, మేక్ ఇన్ ఇండియా, కిసాన్ వికాసపత్ర, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, ‘బేటీ బచావో–బేటీ పడావో, మిషన్ ఇంద్రధనుష్, దీనదయాళ్, ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, స్వదేశీ దర్శన్ యోజన, వన్ ర్యాంక్–వన్ పెన్షన్, స్మార్ట్ సిటీ మిషన్, కళ్యాణ యోజన, ఉజ్వల యోజన, స్వరాజ్ అభియాన్, నమామి గంగ ప్రాజెక్ట్, నదుల అనుసంధాన ప్రాజెక్ట్ వంటి అనేక పథకాలు సరాసరిన 60 వరకు తీసుకొచ్చినప్పటికీ వీటిలో కొన్ని మాత్రమే జనంలో ప్రాచుర్యం పొందాయి... చాలా వాటి గురించి ప్రజలకు ఏ మాత్రం అవగాహన లేదు. కొన్ని ఆచరణలో విఫలమవుతున్నాయి. ఆవాస్ యోజన, ఫసల్ బీమా పథకాలు అత్యుత్తమ పథకాలు. అయినా... వీటి గురించి ప్రజలకు, రైతులకు, గ్రామీణులకు సరైన అవగాహన లేదు. పెద్ద నోట్ల రద్దు, సర్జికల్ దాడులు, ట్రిపుల్ తలాక్ వ్యవస్థకు స్వస్తి చెప్పడం వంటి సంచలన నిర్ణయాల ద్వారా ప్రపంచ స్థాయిలో మోదీ గుర్తింపు పొంది అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. అయితే...రైతుల



ఆత్మహత్యలను నివారించడంలో విఫలమయ్యారు. ఈ రోజు దేశ వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడానికి గ్రామీణ వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లడమే ముఖ్య కారణం. రైతులకు ఎంత చేసినా తక్కువే. గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యం ఆవిర్భవించాలంటే కొత్త రైతాంగ వ్యవస్థను తీసుకురావాలి. నేటికీ భారతదేశంలో 70% ప్రజలు గ్రామాలలో జీవిస్తున్నారు. 50% వ్యవసాయ మీదనే ఆధారపడ్డారు. నదుల అనుసంధాన ప్రక్రియను వెంటనే పూర్తి చేసి ‘ఒకే దేశం–ఒకే నీటి వ్యవస్థ’ అనే నినాదాన్ని అమలు చేసి రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించి రైతులకు వ్యాపారులకు మధ్య దళారీ వ్యవస్థను రూపుమాపాలి. మొత్తం రైతు ఉత్పత్తులను ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్కెటింగ్ జరిగే విధంగా ప్రణాళిక రూపొందించాలి. దేశంలోని అన్ని బ్యాంకులూ తమ వాణిజ్య ఆర్థిక సంపత్తిలో 18 శాతం వ్యవసాయ రంగానికి రుణ సౌకర్యం కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు జారీ చేసింది.


ఈ విషయాన్ని అన్ని బ్యాంకులూ తుంగలో తొక్కి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. 65 శాతం రుణాలు ఐదెకరాల లోపు ఉన్న రైతాంగానికి, 15 శాతం దళిత, గిరిజనులకు స్కిల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వాలని కూడా రిజర్వ్ బ్యాంక్ చెప్పింది. 2016–17 లో 60 వేల కోట్లు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ 6 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. నాబార్డ్ సబ్సిడీలు, స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం సంస్థ సబ్సిడీలను కూడా బ్యాంకులు బినామీల ద్వారా తప్పుదోవ పట్టిస్తున్నారు. సాక్షాత్తు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ గంగ్వార్ దేశంలో కెల్లా తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణులే అత్యధికంగా రుణ ఊబిలో కూరుకుపోయినట్లు ఈ మధ్య రాజ్యసభలో తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల నందు ఉచిత విద్యుత్ విధానం అమలులో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో రైతుల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడలేదు. ఈ ఉచిత విద్యుత్ విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తే నేరుగా లబ్ధిదారులకు అందజేయాలని సంకల్పించింది. ఇలాగే ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా ఎరువులను సరఫరా చేయాలని కూడా భావించింది. ఈ విధానాలను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తే తప్పకుండా ప్రధాని మోదీ రైతు బాంధవునిగా కీర్తించబడతారు. ఇలాగే మోదీ ఈ మధ్య తరచూ చెబుతున్న జాతీయ ఏకీకృత మార్కెట్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తే ‘రైతు భారతం’ ఆవిష్కృతమవుతుంది.

ప్రతి ఉద్యోగానికి అర్హత పరీక్షలుండాలి

కందగట్ల శ్రవణ్ కుమార్

- **స్థానికతకు ప్రమాదముందని వ్యతిరేకించడం సరికాదు**
- **బోధన సామర్థ్య నైపుణ్యాల ద్వారానే నియామకాలు**
- **నచ్చినచోట చదువుకునే, ఉద్యోగం చేసే స్వేచ్ఛ ఉండాలి**
- **యుజిసి నిబంధనలు పాటించాలి**
- **అర్హత పరీక్షద్వారానే మెరిట్ బయటకు వస్తుంది**

ఏ అడ్మిషన్ కయినా ప్రవేశపరీక్షలుం టాయి. ఏ ఉద్యోగానికి కైడా అర్హత పరీ క్షలుంటాయి.అలా ఉండాలి కూడా. అలా లేక పోతే అర్హులైన వారు ఇబ్బందులపాలై అనర్హులు అందల మెక్కే అవకాశాలుంటాయి. అందుకే చదువుకు నేందుకు ఉండే అర్హతా పరీక్షలే ఉద్యోగాలకు కూడా ఉంటే మంచింది. దేశంలో పదవ తరగతి నుండి పి.హెచ్.డి వరకు వివిధ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ ప్రవేశాలు మరియు నియామకాలు జరువుతుంటే అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలకి జాతీయ అర్హత పరీక్ష లేదా సంభదిత స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించటం తప్పా? ఈ మధ్య కాలంలో తెలంగాణా రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలకి అర్హత పరీక్ష జరపాలని త్రిసభ్య కమిటి ఇచ్చిన ప్రతిపాదనలు ప్రతిభకి నిదర్శనం. ఈ మధ్య కాలంలో కేంద్రమానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కూడా జాతీయ స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలకి సంభదించిన నిబంధనల గురించి ప్రొఫెసర్ సునీల్ కుమార్ గుప్తా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటి వేసింది. అర్హత పరీక్ష ద్వారా మెరిట్ అభ్యర్దులు వచ్చే అవకాశం ఉంది. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్దుల స్థానికతకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని వ్యతిరేఖించటం సరికాదు ఎందుకంటె అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలలో కేవలం ఒక అర్హత పరీక్షనే ప్రామాణికం కాదు ఇది కేవలం స్క్రీనింగ్ టెస్ట్ అభ్యర్థి విద్యా, పరిశోధన , భోధన సామర్ధ్యాలను , నైపుణ్యాలను పరిగణలో తీసుకుని అన్ని అంశాల ద్వారా నియామకాలు జరువుతారు. అంతేకాని స్థానికత, తెలంగాణా ఉద్యమ స్పూర్తి అంశాల్ని పరిగణలో తీసుకోని సెట్, నెట్ , పి.హెచ్.డి అంశాల అర్హత పరీక్షలను తప్పు పట్టటం సరికాదు. ఇంత ప్రాముఖ్యం, ఆవశ్యకత లేనిదే ఎందుకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు నెట్ , సెట్ పరీక్షలను నిర్వహిస్తున్నారు? స్థానికత, తెలంగాణా ఉద్యమ స్పూర్తి అంశాల్ని కొన్ని అంశాలలో తీసుకోవచ్చు కానీ దానికి పరిధి ఉంటుంది. స్థానిక అభ్యర్దులకు విశ్వవిద్యాలయం స్థానిక సమస్యలపై అవగాహన ఉంటుంది కానీ ఈ స్థానికత విషయంలో ఒకే రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయలకి చెందిన అభ్యర్దులు స్థానికత సమస్యలు ఎదుర్కొంటున్నారు ,కాకతీయ విశ్వవిద్యాలయంలో చదివిన అభ్యర్దులు ఉస్మానియా విశ్వవిద్యాలయం వెళితే అంతర్గత స్థానికత సమస్యలను ఎదుర్కొంటున్నారు, స్థానికత అనేది ఒక యూనివర్సిటీకి పరిమితం కాకూడదు అది రాష్ట్రానికి, దేశానికి సంభదించిన సున్నిత అంశం. కేవలం ఒక రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయల పి.హెచ్.డి నుండి నియామకాలు వరకు స్థానికత లేవదీస్తే మిగతా రాష్ట్రాల యూనివర్సిటీ అభ్యర్దుల పరిస్థితి ఏమిటి వారికి దేశంలో నచ్చిన చోట ఉన్నత విద్య , ఉద్యోగం చేసే స్వేచ్ఛ, సమానత్వం లేదా? మన రాష్ట్రం చెందిన విద్యార్దులు విదేశాలలో విద్యనబ్యిస్తూ ఉంటె మన వాళ్లు ఇంకా స్థానికత , స్థానికేతర అంశాలపై కొట్టుమిట్టాడటం ఎంతవరకు సమంజసం? ఈ మధ్య కాలంలో యు.జి.సి పి.హెచ్.డి అనేది అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలకి అదనపు మార్కింగ్ అంశమే కానీ అంత్యంత ఆవశ్యకం కాదని నోటిసుని కూడా విడుదల చేసింది ఇలాంటి పరిస్థితులలో జాతీయ, రాష్ట్ర అర్హత పరిక్షలకు, స్క్రీనింగ్ టెస్ట్ లకు అత్యంత ప్రాదాన్యత ఇవ్వాలి. ఎక్కడైనా విశ్వవిద్యాలయకు కావాల్సింది స్థానికత, సామజిక, రాజకీయ, ఆర్థిక అంశాలు కాదు. ప్రతిభ, విద్య, పరిశోధన, భోధనా సామర్ద్యాలు కావాలి అప్పుడే విశ్వవిద్యాలయాలు విశ్వ వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్టలతో విరాజిల్లుతాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వాళ్ళు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలకి నిభందనలు, నియమాలు ప్రతిపాదిస్తే అవి కేవలం కేంద్ర విశ్వవిద్యాలయలు, జాతీయ సంస్థలు మాత్రమే అనుసరించి నియామకాలు జరువుతున్నాయి , రాష్ట్ర విశ్వవిద్యాలయలు కొన్ని వీటిని పాటిస్తున్నాయి మరికొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయలు యూ.జి.సి నిభందనలను విస్మరిస్తున్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలలో కూడా ఏ.పి.ఐ స్కోర్ ని పరిగణలో తీసుకుంటున్నాయి



ఎందుకంటె కేవలం కొన్ని అంశాలకే ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని అంశాలు పరిగణలో తీసుకుంటున్నాయి. పక్క రాష్ట్రాల అభ్యర్దులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే విశ్వవిద్యాలయాల మధ్య వైవిధ్యం బహిర్గతమవుతుంది.

భోధన, పరిశోదన, విద్యా సంబందించిన అంశాలలో అనుభవం, నైపుణ్యం సంపాదించిన అభ్యర్దులు కేవలం స్క్రీనింగ్ టెస్ట్ అర్హత సాధించలేరనటం హాస్యాస్పదం. ఏ విశ్వవిద్యాలయంకైనా విద్యార్ధి నుండి ఆచార్యుని వరకి ఎవరు శాశ్వతం కాదు, ప్రతి ఒక్కరికి కొంత సమయం ఉంటుంది ఆ సమయంలో విశ్వవిద్యాలయం అభివృద్ధికి , అభ్యున్నతికి కృషి చేయటమే పరిగణలోకి తీసుకోవాలి అంతేకానీ స్థానికత సామజిక , రాజకీయ , ఆర్ధిక అంశాలు కాదు, ఈ అంశాలో విశ్వవిద్యాలయం అభివృద్ధికి, అభ్యున్నతికి గొడ్డలి పెట్టు లాంటివి. ఇప్పటికైనా ఈ అంశాలుని విస్మరిస్తే అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. అర్హత పరిక్ష అనేది అభ్యర్ధిలో విషయ ప్రతిభ , మరియు సంభందిత సబ్జెక్టుపై ఉన్న పట్టుని తెలియజేస్తుంది, ఎందుకంటె అద్యాపకుని ప్రాధమిక విధి భోధన, ద్వితీయ విధి పరిశోధన. విద్యలోని ప్రతిభ , సంభందిత విషయంపై ఉన్న పట్టు ,భోధన సామర్ద్యాలను నిరూపించే అర్హత పరిక్షను వద్దనటం మూర్ఖత్వమే. విద్యార్ధి స్థాయి నుండి అతని ప్రతిభ సంభందిత సర్టిఫికేట్ల ద్వారా తెలుస్తుంది కానీ సబ్జెక్టుపై ఉన్న పట్టు, విషయ పరిజ్ఞానం అనేది కేవలం జాతీయ అర్హత పరిక్ష ద్వారానే తెలుస్తుంది అందుకే అర్హత పరీక్షకు ప్రాదాన్యత ఇవ్వాలి.

దేశంలో కొన్ని ఒష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయలు , ప్రభుత్వాలు అర్హత పరీక్షను నిర్వహించి విజయవంతంగా అధ్యాపకుల నియామకాలు జరువుతున్నారు వారికి లేని న్యాయ పరమైన , సాంకేతిక సమస్యలు మనకెందుకు వస్తున్నాయో ఆలోచించాలి. ప్రాంతీయతత్వం, స్థానికత, కమ్యూనిటీ సెంటిమెంట్ అనేది మంచి భావనే కానీ కొన్ని సందర్భాలలో అవి అభివృద్ధికి విఘాతం కలిగించే ప్రమాదం ఉంది. విశ్వవిద్యాలయంలో చాల ఏళ్ళ నుండి పని చేస్తున్న అధ్యాపకులకు భరోసా కల్పించాలన్న ప్రభుత్వం యెక్క నిర్ణయం హర్షణీయం. కానీ ఏ విశ్వవిద్యాలయంకైనా శాశ్వత ఉద్యోగులు ,అధ్యాపకులు అవసరం. విశ్వవిద్యాలయంలోని అన్ని అంశాలలో తాత్కాలిగా నియామకాలు మంచి పలితాలు రావు. మనకున్న వనరులలో విశ్వవిద్యాలయాలు నడిపి జాతీయ స్థాయి ర్యాంకులను ఆశించటం హాస్యాస్పదం. రాజకీయ , సామజిక అంశాలు, ఒత్తిడులు ద్వారా అనుకూలమైన అభ్యర్దులని నియమించి గత విశ్వవిద్యాలయలు అబాసుపాలైన విషయం అందరికి తెలిసిందే. అన్ని అంశాలలో స్వయం ప్రతిపత్తి ఉన్న విశ్వవిద్యాలయాలు నియామకాల విషయంలో కూడా స్వయం ప్రతిపత్తి ఉండి , పారదర్శకత , హుందాతనం ప్రదర్శించాలి. దేశ, రాష్ట్ర భవిష్యత్తు విశ్వవిద్యాలయలపై ఆధారపడుతుంది కాబట్టి వాటిని నిర్వహించే అధ్యాపకుల ఎంపిక అనేది సక్రమంగా జరగాలి లేకపోతే భావి తరాలు నాశనమవుతాయి. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయలలో విద్య, ఉద్యోగం చేసుకొనేలా అవకాశాలు అందరికి కల్పించాలి. నియామకాలను యు.జి.సి. నిభందనలు అనుసరించి జరపాలి ,న్యాయ, సాంకేతిక సమస్యలను అద్యయనం చేసి అధ్యాపకుల నియామకలు జరపాలి, ఇందులో అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా, విశ్వవిద్యాలయ ఉపకులపతులు హుందాగా వ్యవహరించి పారదర్శకంగా భర్తీ చేయాలి. రాజకీయ అంశాలకి, ఒత్తిడులకు ప్రాదాన్యతనిచ్చి అర్హతగల అభ్యర్దులకు అన్యాయం చేయకూడదు. ఒకవేళ ఒప్పంద, తాత్కాలిగా అధ్యాపకులకు కావలసిన అన్నిరకాల అర్హతలు ఉంటేవారిని కూడా నియమకాలల్లో ఎటువంటి సమస్యలు రావు. రాష్ట్ర స్థాయి లేక విశ్వవిద్యాలయ స్థాయి పరిధిలో అభ్యర్దులు అందరికి ఒకే ప్రాధమిక అర్హత పరీక్ష నిర్వహించి దాని ద్వారా తదుపరి ఇంటర్వ్యూ విధానం, భోధన పరిక్ష, మౌఖిక పరిక్ష అన్ని అంశాలను బేరీజు చేసుకొని అర్హత, ప్రతిభ గల అభ్యర్దులను అధ్యాపకులకుగా నియమించి దేశ, ప్రపంచ వ్యాప్తంగా మన రాష్ట్ర విశ్వవిద్యాలయ ఖ్యాతిని, ప్రతిష్టలను విరజిల్లెల చేయటంలో ప్రభుత్వం సఫలం అవ్వాలని ఆశిద్దాం. మన రాష్ట్ర భవిష్యత్తు మన రాష్ట్ర విశ్వవిద్యాలయ నిర్ణయించాలని కోరుకుందాం.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా:
Editor, Surya, Surya Soudha,
Plot.No.185, MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: *editpage@suryaa.com*

చరిత్రలో ఈరోజు

ఆగస్టు 22

జననాలు

1860: పాల్ గోటిలిబ్ నిప్కో, నిప్కోడిస్కు కనుగొన్న శాస్త్రవేత్త.
1869: పింగళి వెంకట రామారెడ్డి, నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి.
1924: హరిశంకర్ పరసాయి, ప్రముఖ హిందీ కవి.
1955: చిరంజీవి, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు.


మరణాలు

1986: శోభా సింగ్, పంజాబ్ ప్రాంతానికి చెందిన చిత్రకారుడు. పద్మశ్రీ పురస్కార గ్రహీత.
2014: యు.ఆర్.అనంతమూర్తి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత.

కొణిదెల చిరంజీవి

చిరంజీవిగా ప్రసిద్ధి చెందిన కొణిదెల శివశంకర వరప్రసాద్ తెలుగు సినిమా రంగంలో ఒక ప్రముఖ కథానాయకుడు. అంచెలంచెలుగా ఎదిగి మెగాస్టార్‌గా ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. మొత్తం దేశంలో చిరంజీవికి మూడు వేలకు పైగా అభిమాన సంఘాలున్నాయని ఒక అంచనా. ఆగష్టు 22, 195 న పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో కొణిదెల వెంకట్రావు,అంజనాదేవి దంపతులకు ప్రథమ సంతానంగా చిరంజీవి జన్మించాడు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రామారావు తరువాత ఆ స్థాయిలో అభిమానించదగ్గ నటుడు మెగాస్టార్ చిరంజీవి. చెన్నై లోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నుండి డిప్లొమా పొందిన తర్వాత 1978లో పునాది రాళ్లు సినిమా చిరంజీవి నటించిన మొదటి సినిమా. కాని ప్రాణం ఖరీదు ముందుగా విడుదల అయ్యింది.

శోభా సింగ్



శోభాసింగ్ (29 నవంబరు 1901–22 ఆగస్టు 1986) భారత దేశం లోని పంజాబ్ ప్రాంతానికి చెందిన ప్రఖ్యాత సమకాలీన చిత్ర కారుడు. ఆయన అనేక వందల చిత్రాలను సిక్కు గురువులను వారి జీవితం మరియు సేవలనూ ప్రధానంగా చేసుకొని చిత్రించాడు. ప్రజల దృష్టిలో గురు నానక్, గురుగోబింద్ సింగ్ సంబంధం గురించి తెలియజేసాయి. 1969లో గురు నానక్ 500వ పుట్టినరోజు సందర్భంగా గీసిన కళాత్మక రూప చిత్రం గురు నానక్. ఇది గురునానక్‌కు ప్రతి రూపం అని, ఇది ఆయనకు చాలా దగ్గరగా ఉన్నాడని ప్రజల నమ్మకం. గురు అమర్‌దాస్, గురుతేజ్ బహదూర్ మరియు గురు హర్‌కిషన్ చిత్రాలను కూడా చిత్రించాడు. ఆయన చిత్రించిన సోహ్నీ మహివాల్ మరియు హీర్ రంజా చిత్రాలు బాగా ప్రసిద్ధి చెందాయి.

యుఆర్ అనంతమూర్తి



కన్నడ సాహిత్యరంగంలో జ్ఞానపీఠ అవార్డు పొందిన ఎనిమిది మంది కన్నడ సాహితి వేత్తలలో ఉడిపి రాజగోపాలచార్య అనంతమూర్తి (డిసెం బరు 21, 1932–ఆగష్టు 22, 2014) ఆరవవాడు. రచయిత మరియు సాహిత్య విమర్శకుడు. 1955లో విడుదలచేసిన ఎందెందు ముగియద కతె కథా సంకలనం ద్వారా ఆయన సాహిత్యకృషి మొదలైనది. మౌని, ప్రశ్నె, ఆకాశ మత్తు బెక్కు–అనంతమూర్తి యొక్క ఇతర కథసంకల నాలు. ఈ మూడు కథలను కలిగిన మూరు దశకద కథెగళు అనే సంక్షిప్త కథాసంపుటం 1989లో ప్రకటితమైనది. రచనలు: సంస్కార; భారతీపుర; అవస్థె (1978); భవ (1994). ఇతడు 1974లో విడుదలై కన్నడ భాషలో జాతీయ ఉత్తమ ప్రాంతీయ భాషా చిత్రంగా ఎంపికైన కంకణ సినిమాకు స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమ కూర్చాడు. సంస్కార, ఘటశ్రాద్ధ మరియు బర చిత్రాలకు ఉత్తమ కథా రచయితగా ప్రశంసలు అందుకున్నాడు. 1983లో కర్నాటక సాహిత్య అకాడమీ పురస్కారం, 1992లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1994లో మాస్తి పురస్కారంతో అనంతమూర్తిని గౌరవించడమైనది. 1994లో అయనను అత్యుత్తమ సాహిత్య గౌరవమైన జ్ఞానపీఠ అవార్డుతో సత్కరించారు.



భీమ్ క్యాష్‌బ్యాక్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భీమ్ యాప్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే వ్యాపారులను ప్రోత్సహించేందుకు మొదటి ఆరు నెలలు కేంద్ర ప్రభుత్వం వారికి పలు పోత్సాహకాలను ప్రకటించింది. ఆ గడువు ఈ నెలతో ముగియనుంది. దీంతో ఆ గడువును వచ్చే ఏడాది మార్చి వరకూ పొడగిస్తూ తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పెద్దనోట్ల రద్దు అనంతరం నగదు రహిత లావాదేవీలను పోత్రహించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 14న భీమ్ యాప్‌ను కేంద్రం ప్రారంభించింది. వ్యాపారులు భీమ్ యాప్ ద్వారా వినియోగదారుల లావాదేవీలను స్వీకరిస్తే వారికి రూ. వెయ్యి వరకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ పథకం కింద వ్యాపారులు నెలలో 20 నుంచి 50 లావాదేవీలు నిర్వహిస్తే వారికి క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. అయితే నెలకు గరిష్ఠంగా ఒక్కో వ్యాపారస్థుడికి రూ.1000 వరకే అందుతాయి. అయితే వ్యాపారులు నిర్వహించే లావాదేవీల్లో నెలలో కనీసం 20 లావాదేవీలు ఒక్కో వినియోగదారుడి వద్ద మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ పోత్సాహకాల గడువు ఈ నెలతో ముగియనుండటంతో.. దీన్ని మార్చి 31, 2018 వరకూ కేంద్రం తాజాగా పొడగించింది.

బిజినెస్

21-8-2017 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	31,187.25
గరిష్ఠం	31,494.61
కనిష్ఠం	31,121.63
ముగింపు	**31,258.85**
మార్పు (పా)	−265.83
మార్పు (శా)	−0.79

నిఫ్టీ	
ఆరంభం	9,864.25
గరిష్ఠం	9,884.35
కనిష్ఠం	9,740.10
ముగింపు	**9,754.35**
మార్పు (పా)	−83.05
మార్పు (శా)	−0.84

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,131.19	-84.44	-0.83
S&P BSE SENSEX Next 50	32,798.01	-566.66	-1.70
S&P BSE 100	10,117.77	-98.76	-0.97
S&P BSE MidCap	14,987.43	-221.03	-1.45

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
MANAPPURAM	94.55	+9.65	+11.37
HATHWAY	33.10	+0.95	+2.95
PCJEWELLER	383.35	+11.00	+2.95
GRUH	496.40	+14.10	+2.92
CENTURYTEX	1220.75	+32.90	+2.77

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
INFY	873.50	-49.60	-5.37
SINTEX	31.60	-1.70	-5.11
ICIL	108.75	-5.85	-5.10
NILKAMAL	1564.55	-83.60	-5.07
JKTYRE	143.80	-7.60	-5.02

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
AXISBANK	494.15	593.22	11930066
INFY	873.50	398.55	4476699
MANAPPURAM	94.55	190.77	20261664
DRREDDY	1933.15	89.78	452887
RELIANCE	1565.80	68.67	436281

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	63.7382	యూరో	75.2876
యన్	57.6300	పౌండ్	83.1465

మార్కెట్ గమనంపై ఇన్ఫోసిస్ దెబ్బ

- నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- బైబ్యాక్‌తోనూ కోలుకోని ఇన్ఫీ
- మార్కెట్ పతనాన్ని శాసించిన ఇన్ఫోసిస్
- 265 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- ఐదు శాతానికి పైగా పతనమైన ఇన్ఫీ ఈక్విటీ
- 83 పాయింట్లు దిగజారిన నిఫ్టీ



ముంబై: ఇన్ఫోసిస్ సంక్షోభ ప్రభావం ఈ రోజు స్టాక్ మార్కెట్లపైనా పడటంతో నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. నిఫ్టీ 83 పాయింట్లు నష్టపోయి 9,754 పాయింట్ల వద్ద, సెన్సెక్స్ 265 పాయింట్లు నష్టపోయి 31,253 పాయింట్ల వద్ద ముగిసాయి. ఇక, షేర్ల విషయానికి వస్తే.. టీసీఎస్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఎంఅండ్ ఎం, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడగా, ఇన్ఫోసిస్, భారతీ ఇన్ఫ్రాటెల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓఎన్జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సంస్థల షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. కాగా, ఇన్ఫోసిస్ అమెరికాలో కూడా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోందనే వార్తలు రావడంతో భారత్‌లోని అత్యంత విలువైన పది కంపెనీల జాబితా నుంచి ఇన్ఫోసిస్ బయటకు వచ్చేసింది.

ఇన్ఫోసిస్ సీఈవోగా విశాల్ సిక్కా రాజీనామా ఆ సంస్థ షేర్లపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వరుసగా రెండో రోజూ ఇన్ఫీ షేరు కోలుకోలేదు. బైబ్యాక్ ఆఫర్ వ్యూహం కూడా ఫలించలేదు. సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో కొంత సానుకూల ధోరణి కనిపించినా ఆ తర్వాత తీవ్ర ఒత్తిడికి గురైన షేర్లు 4.39 శాతం క్షీణించి రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. కొనుగోళ్లకు మద్దతు లభించకపోవడంతో ఈ రోజు ప్రారంభ ట్రేడింగ్‌లో ఇన్ఫీ షేర్లు నష్టాలను చవిచూశాయి. దీంతో బ్రోకరేజ్ సంస్థలు ఆ కంపెనీ షేర్ విలువను డౌన్‌గ్రేడ్ చేయడంతో 4.39 శాతం పడిపోయాయి. సిక్కా రాజీనామా చేయడంతో శుక్రవారం తొలి ట్రేడింగ్‌లోనే ఆ సంస్థ షేర్లు భారీగా పతనమైన విషయం తెలిసిందే. షేరు విలువను పెంచేందుకు శనివారం రోజున రూ.13వేల కోట్ల విలువైన బైబ్యాక్ ఆఫర్‌ను ఇన్ఫోసిస్ ప్రకటించింది.

విశాల్ సిక్కా రాజీనామా వ్యవహారం కంపెనీ పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉందని బ్రోకరేజ్ సంస్థలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరంపై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉందని సదరు సంస్థలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. ఇప్పటివరకు ఇన్ఫీ కొత్త సీఈవోను ప్రకటించకపోవడం కూడా మరో ప్రతికూలాంశంగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ రోజు రూ.929 వద్ద ప్రారంభమైన ఇన్ఫీ షేరు విలువ రూ.882.55 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ఇతర ఐటీ దిగ్గజ కంపెనీలైన టెక్ మహీంద్రా 1.20శాతం, టీసీఎస్ 0.95శాతం, విప్రో 0.23 శాతంతో బీఎస్ఈ ట్రేడింగ్‌లో దూసుకెళ్తున్నాయి.

మార్కెట్ పతనాన్ని శాసించిన ఇన్ఫీ: స్టాక్‌మార్కెట్లపై ఇన్ఫోసిస్ సంక్షోభ ప్రభావం తొలగిపోలేదు. శుక్రవారం భారీగా పతనమైన ఇన్ఫోసిస్ షేరు నేడు కొంచెం కోలుకుంటుందని భావించారు. కానీ అమెరికాలో కూడా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోనుందని వార్తలు వస్తుండటంతో షేరు పతనం కొనసాగింది. దీంతో భారత్‌లోని అత్యంత విలువైన 10 కంపెనీల జాబితా నుంచి ఇన్ఫోసిస్ బయటకు వచ్చేసింది. నేడు ఎన్ఎస్ఈలో ఇన్ఫోసిస్ అత్యంత చురుకైన షేరుగా.. అత్యధికంగా పతనమైన షేరుగా నమోదైందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఉత్తరకొరియా–అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. రెండువారాల అత్యల్పస్థాయిలో నేడు మార్కెట్ ముగిసింది. నిఫ్టీ 83 పాయింట్లు పతనమై 9,754 వద్ద ముగియగా.. సెన్సెక్స్ 265 పాయింట్లు పతనమై 31,253 వద్ద ముగిసింది. యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఎంఅండ్ఎం షేర్లు లాభపడగా.. ఇన్ఫోసిస్, భారతీ ఇన్ఫ్రాటెల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓఎన్జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ షేర్లు నష్టపోయాయి. యూరోప్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతుండగా.. ఆసియా మార్కెట్లలో హ్యాంగ్ సంగ్, తైవాన్, షాంగై మార్కెట్లు మాత్రమే లాభాల్లో ట్రేడ్ కాగా.. మిగిలినవి నష్టాలను మూటగట్టుకున్నాయి.

స్టాక్ మార్కెట్‌కు 'యుద్ధ' భయం
18 రోజుల్లో 7,344 కోట్లు ఉపసంహరణ

ముంబై: అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికా–ఉత్తర కొరియా మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, భారత్–చైనాల మధ్య డోక్లాంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఏ క్షణంలో అయినా యుద్ధం వచ్చే అవకాశం ఉందని విశ్లేషకుల వ్యాఖ్యల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో పలువురు పెట్టుబడి దారులు తమ షేర్లు అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ విధంగా ఈ నెల 1–18 తేదీల మధ్య ఈక్విటీ మార్కెట్లలో సుమారు 7,344 కోట్ల రూపాయల (1.14 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లను విదేశీ పోర్ట్ ఫోలియోలను మదుపర్లు (ఎఫ్‌పీఐలు) విక్రయించారు. ఇదే సమయంలో డెట్ ఫండ్స్ లో సుమారు 9,364 కోట్ల రూపాయలను పెట్టుబడులుగా పెట్టారు. పెట్టుబడులకు సురక్షితమైన సాధనాలు వెతుక్కునే క్రమంలో ఇలాంటి పరిస్థితి చోటుచేసుకుందని స్టాక్ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ఈక్విటీ మార్కెట్ కి 53,610 కోట్ల రూపాయల పెట్టుబడులు రాగా, ఈ నాలుగు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, డొల్ల కంపెనీలపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (సెబీ) తీసుకుంటున్న కఠిన చర్యలు కూడా విదేశీ మదుపర్లపై ప్రభావం చూపుతున్నాయని తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు యూనియన్




న్యూఢిల్లీ: ఇండియా సిలికాన్ వ్యాలీగా పిలుచుకునే బెంగళూరులో నిన్న ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగులు తొలి జనరల్ బాడీ మీటింగ్ పేరిట ఓ సమావేశం ఏర్పాటు చేసి ట్రేడ్ యూనియన్ను నెలకొల్పే అంశంపై చర్చించారు. నగరంలోని కోరమంగళలో జరిగిన ఈ సమావేశంలో దాదాపు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. కర్ణాటకలోని సాఫ్ట్వేర్ ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు తలెత్తుతుండడంతో రిజిస్ట్రెడ్ యూనియన్ను ఏర్పాటు చేయాలని, దాని ద్వారా ఐటీ ఉద్యోగుల తరఫున గళం విప్పే ప్రయత్నం చేయాలని వారు నిర్ణయించారు.

కర్ణాటక రాష్ట్ర ఐటీ ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) ప్రతినిధులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ ఇండస్ట్రీలో ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడడానికి ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించామని అన్నారు. ప్రస్తుతం ఏ ఐటీ సంస్థలోనైనా ఉద్యోగి ఏదైనా సమస్య ఎదుర్కుంటే ఆ ఉద్యోగి ఒక్కడే సంస్థతో పోరాడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ఇలా ఎవరికి వారు తమ సమస్యలను ఒంటరిగా చెప్పుకుంటే కంపెనీ అధినేతలు వారు చెప్పేది వినిపించుకోవడం లేదని అన్నారు.

రిజిస్ట్రెడ్ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసి, తాము ఉద్యోగుల సమస్యలపై పోరాడడమే కాకుండా, తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు కూడా ఉంచే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇంతవరకు తమకు రిజిస్ట్రెడ్ యూనియన్ లేదని చెప్పారు. ఇటువంటి యూనియన్ లేకపోతే తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు అడుగు ముందుకు వేసే అవకాశం లేదని అన్నారు. ఐటీ ఇండస్ట్రీలోని ఉద్యోగులు ప్రస్తుతం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కుంటున్నారని తెలిపారు. బెంగళూరులోని ఐటీ ఇండస్ట్రీ ఉద్యోగులు మాత్రమే కాకుండా చెన్నై ఉద్యోగులు కూడా యూనియన్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఈ రెండు నగరాల ఐటీ ఉద్యోగులు భవిష్యత్తులో దేశమంతటా యూనియన్ను విస్తృతపర్చడానికి కృషి చేస్తారని తెలిపారు.

నికోటెక్స్ నికోటిన్ ప్యాచ్ విడుదల చేసిన సిప్లా



ముంబై: అగ్రగామి హెల్త్‌కేర్ కంపెనీ సిప్లా హెల్త్‌కేర్ లిమిటెడ్ తాజాగా నికోటెక్స్ నికోటిన్ ప్యాచెస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ధూమపానాన్ని 12 వారాల్లో విడిచిపెట్టేందుకు నికోటెక్స్ నికోటిన్ ప్యాచ్ ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. ఇది నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీగా ఉపయుక్తమవుతుందని పేర్కొంది. ఈ సందర్భంగా సిప్లా హెల్త్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనంత నాయక్ మాట్లాడుతూ ప్రజల జీవితకాలాన్ని మెరగుపరిచేందుకు ఉపయుక్తమయ్యే ఔషధాలను ఉత్పత్తి చేయడమే మా లక్ష్యం. ఇక నికోటెక్స్ విషయానికొస్తే ఇది కొన్ని లక్షల మంది ధూమపానం అలవాటును మాన్పించేందుకు దోహదపడుతుందన్నారు. కాగా ప్రతీయేటా భారత్‌లో 9 లక్షల మంది ప్రజలు పొగాకు వినియోగంతో వచ్చే వ్యాధులకులోనై మరణిస్తున్నారు.

తమిళనాడులో కార్యకలాపాలు: ఇండీట్రేడ్



చెన్నై: దేశంలో ఆర్థిక సేవలు అందించే సంస్థగా పేరుగాంచిన ఇండిట్రేడ్ తమిళనాడుతో తన కార్యకలాపాలకు శ్రీకారం చుట్టింది. మహారాష్ట్రలో ఏప్రిల్ 2017లో తన సేవలను ప్రారంభించిన కంపెనీ రెండవ దశలో తమిళనాడులో మైక్రోఫైనాన్స్ సేవలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ఇండిట్రేడ్ గ్రూప్ కంపెనీస్ చైర్మన్ సుదీప్ బందోపాధ్యాయ మట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఇండిట్రేడ్ అందించే సేవలకు ఆదరణ లభిస్తుందని నమ్ముతున్నాం. ఏడాదిపాటు మార్కెట్‌ను క్షణ్ణంగా పరిశీలించిన తరువాతే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన మ్యాక్స్ లిటిల్స్ బిగ్‌టాలెంట్



నెల్లూరు: భారతదేశపు అతిపెద్ద ఫ్యాషన్ బ్రాండ్ మ్యాక్స్ ఫ్యాషన్, నెల్లూరులో మ్యాక్స్ లిటిల్స్ ఛాంప్ బిగ్ టాలెంట్‌ను నిర్వహించింది. నెల్లూరుకు చెందిన లిటిల్ సూపర్‌స్టార్లుకు ఇది తమ ప్రతిభను వెల్లడించేందుకు ఒక వేదికగా నిలిచింది. చిన్నారులు సింగింగ్, డ్యాన్సింగ్, డ్రాయింగ్, ర్యాంప్ వాక్ పోటీలలో తమ ప్రతిభను చాటారు. సంస్థ ప్రతినిధి వివేక్ శర్మ, మాట్లాడుతూ " షాపింగ్ కోసం సంపూర్ణమైన ఫ్యామిలీ డెస్టినేషన్ మ్యాక్స్. మా కార్యక్రమాల ద్వారా కుటుంబాలను మరింత సన్నిహితంగా తీసుకురావడాన్ని ప్రోత్సహిస్తుంటామని తెలిపారు.

మార్కెట్లో జియోనీ కొత్త ఫోన్



న్యూఢిల్లీ:దేశంలో అగ్రగామి స్మార్ట్ ఫోను కంపెనీగా పేరొందిన జియోనీ తాజాగా జియోనీ ఎక్స్‌వన్ ని ఆవిష్కరించింది. ఇది ఫింగర్ ప్రింట్ సెన్సార్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీతో అనుసంధానమై ఉంటుంది. దీని ధర రూ. 8,999 గా సంస్థ తెలిపింది. ఇది సెక్యూరిటీని అందించడమే కాకుండా, ఫోను వ్యక్తిగత భద్రతకు రక్షణ కల్పిస్తుందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా జియోనీ ఇండియా బిజిసెన్ ఇంటలిజెన్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ అలోక్‌శ్రీవాస్తవ మాట్లాడుతూ జియోనీ ఎల్లప్పుడూ వినియోగదారుల అభిరుచులకు పెద్దపీట వేస్తూ, అత్యుత్తమ ఉత్పత్తులను అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

ఉబర్ పీపుల్స్ ఆఫీసర్‌గా విష్పాల రెడ్డి



న్యూఢిల్లీ: ప్రముఖ రైడ్ షేరింగ్ యాప్ ఉబర్ తాజగా విష్పాల రెడ్డిని ఇండియా, సౌత్ ఆసియాకు సంస్థాగత చీఫ్ పీపుల్ ఆఫీసర్‌గా నియమించింది. విష్పాల రెడ్డికి మానవవనరుల విభాగంగా 17 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. తాజా నియామకంతో ఆయన ఉబర్ వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసేందుకు విష్పాల రెడ్డి కృషి చేయనున్నారు. ఈ సందర్భంగా విష్పాల రెడ్డి మాట్లాడుతూ రైడ్ షేరింగ్‌లో పేరుగాంచిన ఉబర్‌లో ఇంతకాలంగా పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు స్వీకరించిన బాధ్యతలను మరింత ఆనందంగా నెరవేరుస్తానన్నారు. సంస్థను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన మారథాన్‌లో అత్యధిక కార్పొరేట్ ఉద్యోగులు పాల్గొన్న సంస్థగా నిలిచిన ఆప్టిమ్, ట్రోఫీని స్వీకరిస్తున్న దృశ్యం

డెబిట్ కార్డుల ప్రక్షాళన: ఎస్బీఐ




న్యూఢిల్లీ: డెబిట్ కార్డుల సహాయంతో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి కొంతమంది ఖాతాదారుల డెబిట్ కార్డులను ప్రక్షాళన చేసేందుకు ఎస్బీఐ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుల డెబిట్ కార్డులను శాశ్వతంగా బ్లాక్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఖాతాదారులకు పంపించింది. కార్డులను బ్లాక్ చేయాల్సివచ్చిన కారణాలను ఎస్బీఐ వెబ్సైట్లో ప్రకటించింది. ఆర్బీఐ ఆదేశాల మేరకు భద్రతా కారణాల వల్ల మేగ్నటిక్ స్ట్రిప్ డెబిట్ కార్డులను, ఈవీఎం చిప్ డెబిట్ కార్డులతో భర్తీ చేసేందుకే ఈ ప్రయత్నమని పేర్కొంది. 2017 సెప్టెంబర్ 30లోగా అన్ని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు చిప్ ఆధారిత ఏటీఎం మోడల్స్‌కి మారాలని ఆర్బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. బ్లాకైన కార్డలను మార్చుకోవడానికి ఖాతాదారులు బ్యాంకును సంప్రదించాలని కోరింది. ఆన్లైన్ ద్వారా కూడా కార్డులు మార్చుకునే సౌకర్యాన్ని ఎస్బీఐ కల్పించింది. ఈవీఎం చిప్ డెబిట్ కార్డులను బ్యాంకు ఉచితంగా అందించనుంది.

నేడు పీఎస్‌యూ బ్యాంకుల బంద్

న్యూఢిల్లీ: నేడు ప్రభుత్వరంగ బ్యాంకు సేవలు బంద్ కానున్నాయి. ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్ల సాధనకు మంగళవారం దేశవ్యాప్తంగా సమ్మె తలపెట్టాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనాలను వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరి సమ్మె కారణంగా సాధారణ బ్యాంకు సేవలకు తీవ్ర అంతరాయం కలగనుంది. ప్రైవేటు బ్యాంకులైన ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, కోటక్ మహింద్రా బ్యాంకు సేవలు మాత్రం యథావిధిగా పనిచేయనున్నాయి. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చిన రుణాలను మొండి బకాయిలుగా పరిగణించి రద్దు చేయాల్సిన అవసరం లేకుండా చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే, రుణ ఎగవేతను నేరపూరిత చర్యగా ప్రకటించాలని కోరుతున్నాయి. చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో అంగీకారం కుదరకపోవడంతో సమ్మె యథావిధిగా రేవు కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

హెచ్ఐసిసిలో క్రిస్టల్లోగ్రఫీ అంతర్జాతీయ సదస్సు



హైదరాబాద్: ప్రముఖ ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ క్రిస్టల్లోగ్రఫీ(ఐయుసిఆర్) 24వ వార్షిక సదస్సు నగరంలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసిసి) లో జరిగింది. ఏడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ శాస్త్రవేత్త, ఐయుసిఆర్ అధ్యక్షులు మార్వన్ హకెర్ట్ ప్రారంభించారు. క్రిస్టల్స్ గురించి అధ్యయనంచేసే శాస్త్రమే క్రిస్టల్లోగ్రఫీ. సుగర్, ఐస్, గ్రెయిన్స్ మొదలైనవి క్రిస్టల్స్‌కు ఉదాహరణ. క్రిస్టల్స్‌ను ఫార్మా ఔషధాల్లో విరివిగా వినియోగిస్తుంటారు. 2014ను అంతర్జాతీయ క్రిస్టల్లోగ్రఫీ సంవత్సరంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా క్రిస్టల్లోగ్రాఫర్లకు ఐయుసిఆర్ అవకాశాలు కల్పిస్తుంటుంది. కాగా హైదరాబాద్ ఫార్మాకు హబ్ గా మారింది. ఈ నేపథ్యంలో వందకు మించిన ఫార్మాకంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయి. సదస్సులో పాల్గొన్న ప్రముఖ క్రిస్టల్లోగ్రాఫర్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ జి ఆర్ దేశిరాజు మాట్లాడుతూ నగరంలో అంతర్జాతీయ క్రిస్టల్లోగ్రఫీ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో తొలిసారిగా ఈ సదస్సు జరుగుతున్నదన్నారు. ఈ సదస్సుకు 1700 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 900 ప్రజంటేషన్లు ఉంటాయన్నారు. అలాగే 600 పోస్టర్లను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ రామ్ జట్టీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య నిపుణుల వర్క్‌షాప్‌లు ఉంటాయన్నారు. ఈ సదస్సులో భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ ఆర్ చిదంబరం, ఐయుసిఆర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మైక్ గ్లాజర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లాసిక్ పరాఠాలను ఆవిష్కరించిన ఇన్నోవేటివ్ ఫుడ్స్



హైదరాబాద్: ఇండియన్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలో తమ ఫ్రాజెన్ ఫుడ్ శ్రేణిని సుమేరు బ్రాండ్ కింద మార్కెట్ చేస్తున్న సుప్రసిద్ధ సంస్థ ఇన్నోవేటివ్ ఫుడ్స్ లిమిటెడ్ తమ నూతన లైనప్ ఫ్రాజెన్ పరాఠాలను ఆవిష్కరించింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సుమేరు బ్రాండ్ అంబాసిడర్ అజయ్ చోప్రా పాల్గొన్నారు. ఆయన కొన్ని చవులూరించే వంటకాలను ప్రదర్శించడం ద్వారా సుమేరు ఫ్రాజెన్ పరాఠా శ్రేణి వైవిధ్యతను ప్రదర్శించారు. ఫ్రాజెన్ పరాఠాలతో వేగంగా హోమ్ మేడ్ మీల్స్‌ను సృష్టించుకోవాలని ఆరాటపడే వారికి కొన్ని సూచనలు, సలహాలు కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సౌరభ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ఫ్రాజెన్ ఫుడ్ చాలామంది ఆదరణ సొంతం చేసుకుందన్నారు.

అవాస్తవాల ప్రచారంలో జగన్ హిట్లర్‌గోబెల్స్‌లను మించిపోయారు



కాకినాడ,సూర్యప్రతినిధి: ప్రెస్ కౌన్సిల్ గైడ్ లైన్స్, జర్నలిజం విలువలు పాటించని సాక్షి మీడియాకు ఈరోజుకీ నిబంధనల మేరకు యాడ్స్ ఇస్తున్నామని, కానీ ఇకపై పునఃసమీక్షించాలని భావిస్తున్నామని మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగానే కాదు, ప్రజాస్వామ్యంలో ఉండడానికే తగరని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాక ముందు ఇన్ని ఆస్తులు ఉన్నాయా అని యనమల ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ స్థలం రెగ్యులైజ్ చేస్తే అమ్ముకుంటామని అప్పటి టీడీపీ ప్రభుత్వాన్ని వైఎస్ కోరిన మాట నిజం కాదా అని యనమల సూటిగా ప్రశ్నించారు. వైఎస్ దరఖాస్తు చేసుకున్న ఫైల్ తన వద్దకే వచ్చిందని అన్నారు. ఈడీ జప్తు చేసిన రూ.18 వేల కోట్లు జగన్‌కు ఎక్కడి నుంచి వచ్చాయని మంత్రి ప్రశ్నించారు.అవాస్తవాలను వాస్తవాలుగా ప్రచారం చేయడంలో జగన్ హిట్లర్‌గోబెల్స్‌లను మించిపోయారని మంత్రి యనమల ఎద్దేవా చేశారు. జగన్ స్థాపించిన సాక్షి మీడియా జర్నలిజం విలువలను భూస్థాపితం చేస్తోందని, అసత్యాలను వండి వార్చి కనీసం ఖండన కూడా వేయడం లేదని మంత్రి తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఉద్యోగులు, అర్చకుల జీతాలు తగ్గిస్తున్నారని విమర్శిస్తున్నారని, అందుకు ఆధారాలేంటి అని యనమల ప్రశ్నించారు.

డిసెంబర్‌లోగా ఇంటింటికి తాగునీటి సరఫరా

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ముఖ్యమంత్రి నిర్ణయించిన గడువులో డిసెంబర్‌లోగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథతో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించబోతున్నట్లు మిషన్‌భగీరథ వైస్ ఛైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఇంటెక్ వెల్ నుంచిప్రతి ఇంటికి నల్లా వరకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సోమవారంనాడు సచివాలయంలో తన ఛాంబర్ లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్-ఇన్-చీఫ్ బి.సురేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్లు జగన్మోహన్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయ్ ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

ప్రతి సెగ్మెంట్, జిల్లాల వారీగా పనులు ఏఏ దశల్లో ఉన్నాయో హెడ్ టూ టేయిల్ ఇంటెక్ వెల్ టూ ఓహెచ్‌బిఆర్ విధానంలో సమగ్ర నివేదికను రెండు రోజుల్లో అందించాలని సీఈలను ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చె నెల నుంచి ఏ సెగ్మెంట్ లో, ఎన్ని గ్రామాలకు భగీరథ నీటిని అందిస్తారో వివరాలు ఇవ్వాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఇంటెక్ వెల్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్స్, ఓహెచ్ఆర్‌బి ల ఫంక్షనింగ్ తేదీలను నివేదికలో పొందుపర చాలన్నారు. పైప్ లైన్, ఎలక్ట్రో,మెకానికల్, సబ్ స్టేషన్ నిర్మాణాలు, వాల్వ్, వర్టికల్ కనెక్షన్‌ల కు సంబంధించి ఏజెన్సీలు ఇచ్చిన ఆర్డర్ వివరాలతో పాటు యాక్షన్ ప్లాన్ ను రెండు రోజుల్లో అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకిచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు త్వరలోనే సురక్షిత మంచినీటిని అందించబోతున్నామని ప్రశాంత్ రెడ్డి చెప్పారు.



పట్టిసీమ ద్వారా రికార్డు స్థాయిలో నీటిని తరలిస్తున్నాం



విజయవాడ,సూర్యప్రతినిధి: పట్టిసీమ ద్వారా రికార్డు స్థాయిలో నీటిని తరలిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు తెలిపారు. మరో రెండ్రోజుల్లో వంద టీఎంసీల మార్క్ చేరబోతున్నామన్నారు. సోమవారం మంత్రి దేవినేని ఉమా మీడియాతో మాట్లాడుతూ కృష్ణానది నుంచి దిగువకు నీరు రావడంలేదన్నారు. శ్రీశైలంలోకి నీరు రాగానే రాయల సీమకు ఇస్తామని చెప్పారు. ఎగువ రాష్ట్రాలు ఇష్టా రాజ్యంగా నీటిని ఆపేస్తున్నాయని ఆరోపిం చారు. మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల జల చౌర్యాన్ని ఉమాభారతి దృష్టికి తీసుకె ళ్లామని చెప్పారు. ఎగువ రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటిషన్ వేస్తామన్నారు. ఈనెలఖరు నుండి రాష్ట్ర వ్యాప్తంగా జల హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

ఎదిగి ఒదిగిన వెంకయ్య

తెస్తారన్నారు. వెంకయ్య సాధారణమైన వ్యక్తి. సామాన్య కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఇవాళ బేగంపేటలో వెంకయ్య తమను ఆప్యాయంగా పలుకరించడం సంతోషాన్నిచ్చిందన్నారు. చాలామంది అనేక పదవులు అనుభవిస్తారు కానీ.. వెంకయ్యనాయుడిలా పదవికి వన్నె తెచ్చే నేతలు కొందరే ఉంటారు. జాతీయస్థాయికి ఎదిగినా మూలాలు మరిచిపోని మనిషి ఆయన. నిన్నటి వరకు మనలో ఒకరిగా ఉన్న వెంకయ్యనాయుడు ఈరోజు ఉపరాష్ట్రపతి కావడం గర్వకారణంగా ఉంది. రాజకీయాల్లో ఉన్నతస్థాయికి ఎలా చేరాలో ఆయన్ని చూసి నేర్చుకోవచ్చు. కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఉపరాష్ట్రపతి కావడం సామాన్య విషయం కాదు. నేటితరం రాజకీయ నేతలకు ఆయన ఆదర్శం అని కేసీఆర్ అన్నారు. వెంకయ్య ఒదిగి..ఎదిగడంతో ఆయన కఠోరశ్రమ ఉందన్నారు.

ఉప ముఖ్యమంత్రిగా పన్నీర్

సాయంత్రం రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. తమిళ భాష, సాంస్కృతిక శాఖ మంత్రిగా కె. పాండ్యరాజన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి పళనిస్వామి, అన్నా డీఎంకే సీనియర్ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పన్నీర్‌సెల్వంకు ఆర్థిక శాఖ కేటాయించారు. ప్రమాణ స్వీకారం ముగిసిన తరువాత గవర్నర్ సమక్షంలో పళనిస్వామి, పన్నీర్‌సెల్వం చేతులు కలిపారు. అయితే, పన్నీర్ వర్గానికి మూడు మంత్రి పదవులు ఇస్తారని అంతకు ముందు వార్తలు వచ్చాయి. త్వరలోనే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. కాగా, ప్రభుత్వం, పార్టీలో పదవులు అందుకోవడం ద్వారా పన్నీర్‌సెల్వం పంతం నెగ్గినట్టైంది. శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలన్న డిమాండ్ ఇంకా నెరవేరలేదు. పార్టీ కార్యవర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని పన్నీర్‌సెల్వం చెప్పారు. చిన్నమ్మ భవితవ్యంపై పార్టీ ఎటువంటి వైఖరి అవలంబిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పన్నీర్‌కు ఒకటి, నాకొకటి: పళనిస్వామి

చెన్నై : విలీనం తరువాత అన్నా డీఎంకే పార్టీ కన్వీనర్‌గా పన్నీర్‌సెల్వం ఉంటారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి తెలిపారు. పన్నీర్‌సెల్వం తన వర్గాన్ని విలీనం చేసిన సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో అన్నా డీఎంకే నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, కేపీ మునుస్వామి సహ కన్వీనర్లు ఉంటామని చెప్పారు. 11 మంది సభ్యులు సమన్వయ కమిటీ పార్టీని నడుపుతుందని వెల్లడించారు. రెండాకుల గుర్తును నిలబెట్టుకోవడమే ప్రస్తుతం తమ మొదటి ప్రాధాన్యమని అన్నారు. అమ్మ ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ప్రకటించారు. తాను చనిపోయిన తరువాత కూడా పార్టీ వందేళ్లు పైగా వర్ధిల్లాలని జయలలిత ఆకాంక్షిచారని, అమ్మ ఆశయాలకు అనుగుణంగా పార్టీని నడుపుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ పార్టీలో భేదాభిప్రాయాలు ఉన్నాయని, కలసికట్టుగా వీటిని పరిష్కరించుకుంటామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కలసి పని చేయాలని కార్యకర్తకలకు పళనిస్వామి పిలుపు ఇచ్చారు. ఇటీవలి కాలంలో పార్టీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొందని సీనియర్ నేత కేపీ మునుస్వామి వ్యాఖ్యానించారు.

జలసిరికి హారతి

సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకట్టుకోవాలని అన్నారు. మైనర్ ఇరిగేషన్ సహా పూర్తయిన ప్రాజెక్టులన్నింటినీ ఈ సమయంలోనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పోలవరం సహా 28 ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి పోలవరం పనులపై వర్చువల్ ఇన్‌స్పెక్షన్ చేశారు. గడిచిన వారం 1.88 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం పనులు, 17,345 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్ పనులు పూర్తయినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్పిల్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్, అప్రోచ్ చానల్, పైలెట్ చానల్ తవ్వకం పనులు ఇంకా 295.66 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మిగిలి వున్నాయని తెలిపారు. స్పిల్ చానల్ కాంక్రీట్ పనులు ఇప్పటివరకు 6.5% మాత్రమే పూర్తి కావడాన్ని తప్పుబట్టిన ముఖ్యమంత్రి, మట్టి తవ్వకం పనులతో పాటు కాంక్రీట్ పనుల వేగాన్ని పెంచాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, నిధుల వినియోగం, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు వంటి వాటికి సంబంధించిన వివరాలతో నెలనెలా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పోలవరం నిర్మాణం అపూర్వ ఘట్టమని, దీనిని చూసే అవకాశం ప్రతి ఒక్కరికి కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అధికారుల నుంచి సామాన్య ప్రజల వరకు అందరూ పోలవరం పర్యటించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ఎగువ రాష్ట్రాలు పెద్దసంఖ్యలో ప్రాజెక్టులు నిర్మించుకోవడంతో అక్కడ నుంచి నీరు దిగువకు రావడం గగనమవుతోందని చెప్పిన ముఖ్యమంత్రి మన నీటిని మనమే సద్వినియోగం చేసుకోవాల్సి వుందని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు 28 ప్రాజెక్టులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని 28 ప్రాధాన్య ప్రాజెక్టుల పనులపై వివిధ జిల్లాల ఛీఫ్ ఇంజనీర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో రెండు పంపులు సిద్ధం చేస్తున్నామని సంబంధిత సీఈ తెలుపగా, అన్ని పంపులు సాధ్యమైనంత వేగంగా ప్రారంభయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వంశధార ప్రాజెక్టు స్టేజి 2, ఫేజ్ 2 పనులు వచ్చే ఏడాది జనవరి 5 నాటికి పూర్తికావాలని డెడ్‌లైన్ విధించారు. పోగొండ రిజర్వాయర్ ఈ ఏడాది అక్టోబర్ 22 నాటికి సిద్ధమవుతుందని, ఎర్రకాలువ ఆధునీకరణ దాదాపు పూర్తి కావొచ్చిందని, అలాగే అడవిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.6 టీఎంసీల వరకు నిల్వ చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. పెదపాలెం-కండలేరు-చినసాన ఎత్తిపోతల పథకాలు, గోరుకల్లు రిజర్వాయర్, అవుకు టన్నెల్ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని పేర్కొన్నారు. మారాల రిజర్వాయర్ పనులు ఈనెల 24 నుంచి మొదలుపెడుతున్నట్టు తెలిపారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ సెప్టెంబర్ నెలాఖరుకు, నెల్లూరు-సంగం బ్యారేజ్‌లు అక్టోబర్ నాటికి, గండికోట రిజర్వాయర్- సిద్ధాపురం ఎత్తిపోతల పథకాలను సెప్టెంబర్ మొదటి వారానికి, 31వ నెంబర్ రాష్ట్ర రహదారిని సెప్టెంబర్ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. శారదా నదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తికావడంతో అక్కడ జలసిరికి హారతి కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించాలని చెప్పారు. కొండవీటివాగు పంపింగ్ స్కీం పనులు ఇంకా పూర్తి కానందున భారీ వర్షాలు వస్తే అప్రమత్తంగా వుండాలని అన్నారు.


అమెరికా దాడి చేస్తే ఉత్తర కొరియా అధ్యక్షుడు ఏం చేస్తారు?

- **గువామ్ దీవి మా లక్ష్యం కాదు అమెరికాకు ఊహించని షాకిస్తాం**
- **ఉత్తర కొరియా తాజా ప్రకటన**




లండన్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ అమెరికాను నాశనం చేస్తానని హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా తీ వ్రంగా ప్రతిస్పందిస్తే, ఉత్తర కొరియాపై అణు దాడికి తెగబడితే ఆ దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఏం చేస్తారు? ఎలా స్పందిస్తారు? ధైర్యంగా నిలబడతారా? లేక పారిపోతారా? అన్న అనుమానాలకు బ్రిటన్‌లో ఉత్తర కొరియా అంబాసడర్‌గా పని చేసిన, కిమ్ నమ్మకస్థుడు థానే యోంగ్ హో సమాధానం చెబుతున్నారు. అమెరికా దాడికి దిగిన మరుక్షణం చైనా పారిపోయేందుకు అధ్యక్షుడు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చైనాలో సురక్షితంగా ఉంటూనే ఉత్తర కొరియాలో సైన్యాన్ని నడిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. చైనాలోని యాలు నది సమీ పంలో కిమ్ తలదాచుకునే ప్రాంతం ఉందని, ఉత్తర కొరియా నుంచి తప్పించుకునేందుకు కిమ్ దగ్గర రెండు చిన్న విమానాలు సిద్ధంగా ఉంటాయని ఆయన చెప్పారు. వాటిల్లో ఇంధనం నింపి ఉంటుందని అన్నారు. కిమ్ జాంగ్ ఉన్ తప్పించుకోవడమే కాకుండా, తనతో పాటు తన భార్య, లెఫ్టినెంట్ జనరల్ కిమ్ రాక్-జ్యోమ్, క్షిపణుల అధికారి, శాస్త్రవేత్త అయిన కిమ్ జోంగ్-సిక్‌ను కూడా తీసుకువెళ్లనున్నారు. పసిఫిక్ తీరంలోని గువామ్ దీవి తమ లక్ష్యం కాద ని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. దక్షిణ కొరియాతో అమెరికా సంయుక్త సైనిక విన్యాసాల నేపథ్యంలో ఉత్తర కొరియా అధికారిక పత్రిక 'రోడాండ్ సిమోన్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఇందులో దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాలు ఆపేయాలని హెచ్చరించింది. లేదంటే అమెరికా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. గువామ్‌పై దాడి చేస్తామని ప్రకటించినప్పటికీ దానిని విరమించుకున్నామని, అయితే తాము ఎక్కడ? ఎలా? ఎప్పుడు? దాడి చేస్తామో ఎవరూ ఊహించలేరని తెలిపి ంది. అమెరికా ఏమి చేస్తుందో గమనించిన తరువాత అణు దాడి చేద్దామని కిమ్ నిర్ణయించారని, అందుకే తాము దాడి చేయలేదని ఆ కథనం తెలిపింది. దీనిని అవకాశంగా తీసుకున్న అమెరికా తన ఆయుధ సంపత్తితో తమను భయ పెట్టాలని చూసిందని, అది జరిగే పని కాదని అన్నది. కలలో కూడా జరిగే పని కాదని ఆ పత్రిక స్పష్టం చేసింది. కాగా, ఉత్తర కొరియాపై నిఘా కోసం శక్తిమంతమైన కెమెరాలు, రాడార్లు, సెన్స ర్లు కలిగిన ప్రత్యేక యుద్ధ విమానం 'డ్రాగన్ లేడీ'ని రంగంలోకి దించిన సంగతి తెలిసిందే.

కనువిందు చేసిన సూర్య గ్రహణం



వాషింగ్టన్: భారతావని నిద్రిస్తున్న సమయంలో సోమవారం రాత్రి వినీలాకాశంలో ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. 99 ఏళ్ల తర్వాత అమెరికాలో సంపూర్ణ సూర్య గ్రహణం సంభవించింది. ఈ ఖగోళ అద్భుత దృశ్యాలను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది.గ్రహణం కారణంగా యూఎస్‌లోని 14 రాష్ట్రాల మీదుగా 70 కి.మీ మేర చీకటిమయం అయ్యింది. దక్షిణ కరోలినాలో గ్రహణం ముగిసింది. గ్రహణ దృశ్యాలను ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. గ్రహణం సందర్భంగా పలు కంపెనీలు తమ ఉద్యోగులకు సెలవులు ప్రకటించాయి. అమెరికాలోని ఒరెగాన్ ప్రాంతంలో సూర్యగ్రహణం ప్రారంభమైంది. సంపూర్ణ సూర్యగ్రహణ దృశ్యాలను వీక్షించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. గ్రహణం దృశ్యాలను ప్రజలు ప్రత్యేక కళ్లద్దాలతో వీక్షించారు. సంపూర్ణ సూర్యగ్రహణాన్ని విమానాల్లో నుంచి వీక్షించాలని పలువురు తహతహలాడారు. ఈ నేపథ్యంలో ఇబ్బడిముబ్బడిగా విమాన టిక్కెట్లు బుక్ అయ్యాయి. సంపూర్ణ సూర్య గ్రహణాన్ని వీక్షించిన ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

సీఎం ఆరోపణలు హాస్యాస్పదం



నంద్యాల, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆరోపణలను వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి కుటుంబం తీవ్రంగా ఖండి చింది. ఓడిపోతామనే భయంతోనే దిగజారుడు రాజకీ యం చేస్తున్నారని, తాము ఏ విచారణకైనా తమ కుటుంబం సిద్ధమని శిల్పా మోహన్ రెడ్డి కుమా రుడు రవిచంద్ర కిషోర్ రెడ్డి, కోడలు నాగిని రెడ్డి, కుమార్తె శిల్పా తెలిపారు. నంద్యాలలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ "మా కుటుంబంపై ముఖ్య మంత్రి ఆరోపణలు హాస్యాస్పదం. గతం లో శిల్పా సేవా సమితిని చంద్రబాబు, లోకేశ్ ఇద్దరు పొడిగారు. 2014 ఎన్నికల సందర్భంగా చంద్ర బాబు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నాన్న ను పిలిపిం చుకుని మాట్లాడారు. సేవా కార్య క్రమాలు చేస్తున్న ఆయనను పార్టీలో చేరాలని చంద్రబాబే స్వయంగా ఆహ్వానించారు. గతంలో లోకేశ్ నంద్యాలలో పర్యటించినప్పుడు కూడా శిల్పా సహకార బ్యాంకు పనితీరును మెచ్చు కున్నా రు. శిల్పా సేవా సమితి ద్వారానే మా నాన్నకు మం చి పేరు ఉంది. గతంలో నాన్న చేసిన మంచి పను లు ఇప్పుడు చెడుగా కనిపిస్తున్నాయా?. నాన్న ఇప్పటివరకూ ఏ ఒక్క కాంట్రాక్టర్‌ను బెదిరిం చలే దు. బెదిరించిన ఘటనలు మా కుటుంబ చరిత్ర లోనే లేనే లేదు. మహిళల పట్ల నాన్నకు అపారం గౌరవం ఉంది. కూతురి పేరునే ఇంటి పేరుగా మార్చుకున్నారు." అని పేర్కొన్నారు.

మా బ్యాంక్ గురించి మాట్లాడటం ఆశ్చర్యం-శిల్పా కోడలు నాగినిరెడ్డి

శిల్పా సహకార బ్యాంక్ ద్వారా వేలమంది మహి ళలకు రుణాలు ఇచ్చామని శిల్పా చక్రపాణిరెడ్డి కోడ లు నాగినిరెడ్డి తెలిపారు. వడ్డీలేని రుణాలు నుంచి అర్ధరూపాయి వడ్డీ వరకూ రుణాలు ఇస్తున్నా మన్నారు. ఇప్పటివరకూ ఏ మహిళను రుణం కట్టమని గట్టిగా అడిగింది లేదన్నారు. గుర్తింపు ఇవ్వడానికే బ్యాంక్ పెట్టామని బ్యాంకు గురించి చెడుగా ప్రచారం చేయడం మంచిది కాదన్నారు.

మొదటి పేజీ తరువాయి

రేపే ఉప పోరు

వార్డులు - 42 ఉండగా, నంద్యాల రూరల్‌లో 20 గ్రామాలు, గోస్పాడు మండలంలో 15 గ్రామాలు ఉన్నాయి. ఈ నంద్యాల ఉప ఎన్నికలకు సంబంధించి మొత్తం పోలింగ్ 255 కేంద్రాలు ఉన్నాయి. నంద్యాల టౌన్‌లో - 159 పోలింగ్ కేంద్రాలు, నంద్యాల రూరల్ ప్రాంతాల్లో - 57 పోలింగ్ కేంద్రాలు, గోస్పాడు మండలంలో - 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 141 ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 74 గా పోలీసు అధికార్లు నిర్ధారించారు. సాధారణంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు 40 ఉన్నాయి. కులాల వారీగా చస్తే ఈ ఎన్నికల్లో ముస్లిం, బలిజ ఓట్లు అభ్యర్థి విజయంలో కీలకంగా మారనున్నారు.

కొనసాగుతున్న ఆర్థిక ప్రలోభాలు-ఓటర్ల కోసం ప్రత్యేకంగా యాప్‌లు

సాధారణ ఎన్నికలకు రెండేళ్ల ముందు జరుగుతున్న ఈ నంద్యాల ఉప ఎన్నికను టీడీపీ, వైసీపీలు రెఫరాండంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఎవరు ఓడినా వచ్చే సాధారణ ఎన్నికల్లో వారికి ఓటమి తప్పదని భావిస్తూ ఇరు పార్టీలు ఇప్పటి వరకు ప్రచార హోరిలో దూసుకెళ్లాయి. కానీ కేవలం ప్రాచరంపైనే ఆధారపడకుండా నోటు కూడా పనిచేస్తున్న భావనతో పార్టీలు ఆర్థిక ప్రలోభాలకు దిగుతున్నట్లు సమాచారం. ఈ ఎన్నికలు జీవనర్మణ సమ్యగా మారడంతో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇరువురూ స్వయంగా ప్రచార రంగంలోకి దిగారు. ఈ ఉపఎన్నిక చివరికి ప్రధాన పార్టీల అభ్యర్థులు భూమా బ్రహ్మానందరెడ్డి (టీడీపీ), శిల్పా మోహన్‌రెడ్డి (వైసీపీ)ల కంటే ఆయా పార్టీల అధినేతల మధ్య పోటీగా మారింది. ఈ నేపథ్యంలో నంద్యాల ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా ఇరు పార్టీల నేతలు ఓటర్లకు డబ్బులు పంచడంలో పోటీపడ్డారని చెప్పవచ్చు.

సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు

ఈ నంద్యాల ఉప ఎన్నికలో విజయం ఎంతటి ప్రాముఖ్యామో ఈ నియోజకవర్గంలో నున్న ప్రధాన సామాజిక వర్గాలను ప్రభావితం చేయడం కూడా అంతే ముఖ్యంగా టీడీపీ, వైసీపీలు గుర్తించాయి. దీంతో నంద్యాలలోని వివిధ సామాజిక వర్గాలతో సీఎం చంద్రబాబు నాయుడు, ప్రధాన ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వివిధ సామాజిక వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఈ రెండు పార్టీలు కుల సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇచ్చాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల విస్తృత పర్యటన ఆదివారంతో ముగిసింది.

శనివారం రోడ్‌షోలు, ప్రసంగాలు సాగించిన ముఖ్యమంత్రి ఆదివారం వరసగా ఆర్యవైశ్య, డ్వాక్రా మహిళలు, ముస్లింలు, బలిజ సంఘాల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రతిపక్షనేత జగన్ ఇప్పటికే ముస్లింలు, బలిజ, ఆర్యవైశ్య సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఓట్లు అధికంగా ఉన్న వర్గాలను ఎక్కడో చోట కలిసి, ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ముస్లింలు, బలిజ ఓట్లు కీలకంగా మారనున్నాయి. అనధికారిక అంచనా ప్రకారం ఈ నియోజకవర్గంలో ముస్లింలు 55వేలకు పైగా ఉండగా, బలిజ, కాపులు కలిసి 38వేలు, ఆర్యవైశ్యులు 11వేలు వరకు ఉంటారని అంచనా.

బెట్టింగ్‌ల జోరు..

నంద్యాలలో ఇప్పుడు పందేలు(బెట్టింగ్‌లు) భారీగా సాగుతు న్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనే కాకుండా, హైదరాబాద్, బెంగళూ రులలోనూ పందేంలు నడుస్తున్నాయి.

నవరత్నాలకు నంద్యాలే నాంది

పంచిపెడుతున్నారు. మీ అందరి ప్రేమానురాగాలకు నేను కృతజ్ఞుడిని. ఇక్కడికొచ్చిన ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు ప్రతి అవ్వకు, ప్రతి తాతకు ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి చేతులో జోడించి, శిరస్సు వంచి పేరుపేరునా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఇవాళ నంద్యాలలో ఉప ఎన్నిక జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో తిరిగాం. ఈ 13 రోజులుగా మీరు పంచిన ఆత్మీయతను చూశా. నేనొక్కడినేకాదు రాష్ట్రం మొత్తం కూడా చూసింది. ఆ ఆత్మీయత చంద్రబాబు వెన్నెముకలో భయాన్నికూడా పుట్టించింది. అందుకే సీఎంతోపాటు క్యాబినెట్ మొత్తం ఇక్కడికి దిగింది. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో చంద్రబాబును నంద్యాల రోడ్లపై ఎప్పుడైనా చూశారా, ఆయనంటారు జగన్‌కు పనిలేదు 15 రోజులుగా నంద్యాలలో తిరుగుతున్నాడు అని. నిజానికి తిరగాల్సింది నేను కాదు ఆయన తిరగాలి. సీఎం పదవిలో ఉన్నాయన ప్రజల కోసం తిరగాలి. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే కాదు. చంద్రబాబు మనస్తత్వం ఏమంటే ఎన్నికలు వచ్చినప్పుడే ఆయనకు ప్రజలు గుర్తొస్తారు. 2014లో నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే చనిపోతే సానుభూతితో వైసీపీ పోటీ పెట్టలేదు. ఆ తర్వాత చంద్రబాబు నందిగామ ముఖం చూశారా అని గుర్తుచేస్తున్నా. ఇవాళ మూడున్నర సంవత్సరాల తర్వాత చంద్రబాబు పరిపాలకు తీర్పు ఇవ్వబోతున్నాం. తాను చేసిన మోసానికి వ్యతిరేకంగా మీరు ఓటు వేయబోతున్నారు. ఆయన చేసిన అవినీతికి, దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నాం. రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత లేకపోతే ప్రజాస్వామ్యం దిగజారిపోతుంది. ఎన్నికలప్పుడు హామీలిచ్చి, తర్వాత మోసం చేస్తే వ్యవస్థకాదు ప్రజలు నాయకుల కాలర్ పట్టుకుని నిలదీసే రోజు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ఈ మూడేళ్లలో ఏం చేశాడు? నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా. ఉప ఎన్నికలు వచ్చేదాకా ఒక్క రోజైనా ఆయన నంద్యాల నడిరోడ్డుపై కనిపించారా? పేదలకు ఇళ్లు, రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావలంటే బాబు రావాలని టీవీల్లో ప్రచారం చేశారు. మరి ఈ మూడున్నరేళ్లలో హామీని నిలబెట్టుకున్నారా? , డ్వాక్రా మహిళలకు హామీలు ఇచ్చారు. 14 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తానని మాటిచ్చారు. నిలబెట్టుకున్నాడా? ఆయన సీఎం అయిన తర్వాత రేషన్ సరుకుల్లో ఎన్నింటికి కత్తెర వేశారు? ఎన్నికలప్పుడు టీవీల్లో ఏమేం చెప్పించారు? జాబు రావాలంటే బాబు రావాలన్నారు. జాబు రాకుంటే ప్రతి ఇంటికీ రూ.2 వేలు ఇస్తామన్నారు. ఆయన సీఎం అయి 38 నెలలలైంది. 1.70కోట్ల ఇళ్లున్నాయి. ప్రతి ఇంటికీ 78 లక్షలు బాకీ పడ్డాడా లేదా? వీటిలో కనీసం ఒక్క రూపాయానై ఇచ్చాడా? ప్రజలను మోసం చేశాడు. ఆయన సీఎం కావడం కోసం సమాజంలోని అన్ని వర్గాలనూ మోసం చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన మోసాలకు అంతే ఉండదు. నిజం చెప్పనివాడే చంద్రబాబు: జీవితంలో ఒక్క అబద్ధం చెప్పనివాడిని సత్యహరిశ్చంద్రుడు అంటాం. అదే, ఒక్క నిజం కూడా చెప్పనివాడిని నారా చంద్రబాబునాయుడు అంటాం. ముఖ్యమంత్రి హోదాలో మూడేళ్ల కిందట కర్నూలుకు వచ్చి చాలా చెప్పారు. సీఎం చెబితే చేస్తారని మనమంతా అనుకున్నాం. కర్నూలుకు ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ సిటీ చేస్తామన్నారు. ఇప్పుడు నంద్యాలను స్మార్ట్ సిటీ చేస్తామంటున్నారు. ట్రిపుల్‌ఐటీ కాలేజీ కడతామన్నారు.. స్విమ్స్ తరహాలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అన్నారు. అవుకు దగ్గర పార్క్ మైనింగ్ స్కూలు, ఉర్దూ యూనివర్సిటీ, ఆపారెల్‌పార్కులు, కడతామన్నారు. కేసీ కెనాల్ గుండ్రేవుల ప్రాజెక్టు కడతామనిచ ఎప్పారు. వీటిలో కనీసం ఒక్కటైనా కట్టారా అని అడుగుతన్నా. ఇవాళ నంద్యాలలో ఉప ఎన్నిక వచ్చేసరికి మళ్లీ అరిగిపోయిన టేప్‌రికార్డర్ వేస్తున్నారు. మళ్లీ అవే మోసాలు, అవే అబద్ధాలు. అలాంటి వ్యక్తిని మనం ఖచ్చితంగా ఇంటికి పంపించాలి. ఇలాంటి పార్టీని బంగాళాఖాతంలో కలపాలి." అని పేర్కొన్నారు.

ఇది చరిత్రాత్మక ఎన్నిక:

తాను ముఖ్యమంత్రిననే అహంకారం చంద్రబాబుకు ఉంది. ఏమైనా చెయ్యొచ్చు.. ఎవరైనా ఏమైనా అంటే పోలీసులను పంపిచ్చొచ్చని ఆయన భావన. ప్రశ్నించినవాళ్లని కళ్లు పెద్దవి చేసి నువ్వు జగన్ మనిషివని అంటాడు. నిలదీసినవాళ్లపై అపనిందలువేసి, పోలీస్ స్టేషన్లలో పెట్టిస్తారు. ఈ వ్యవస్థలో మార్పు రాకుంటే, చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి. లేకుంటే, ప్రతి ఇంటికీ మారుతీ కారు, కేజీ బంగారం ఇస్తామంటాడు. మూడున్నరేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికలు వచ్చాయి. మోసం చేసివాళ్లకు ఖచ్చితంగా బుద్ధి చెప్పాలి. నంద్యాలలో వేసే ఓటు చరిత్రాత్మకమైనది. ఇక్కడి నుంచి మొదలయ్యే మార్పు శ్రీకాకుళం దాకా వెళుతుంది. చంద్రబాబుకు ఓటేయకపోతే నంద్యాల అభివృద్ధి ఆగిపోతుందని భయపెట్టిస్తున్నారు. కానీ మీకో మాటిస్తున్నా.. చంద్రబాబు మాదిరి డబ్బులేదు, పదవి లేదు, పోలీసులు లేరు, ఉన్నదిలేనట్లు, లేనిది ఉన్నట్లు చూపించలేను. నా దగ్గరున్న ఆస్తి దివంగత నేత ప్రియతమనాయకుడు రాజశేఖర్‌రెడ్డిగారు పోతూపోతూ ఇచ్చిన ప్రజలే నా కుటుంబం. ఆయన చేసిన మంచి, సంక్షేమ పథకాలు ఇవ్వాళ్టికీ బతికే ఉన్నాయి. అదే నాకున్న ఆస్తి. జగన్ మోసం చేయడు. జగన్ అబద్ధమాడడు. జగన్ ఏదైనా చెబితే మాట ఇస్తే కట్టుబడి ఉంటాడు. వాళ్ల నాన్న మాదిరే ప్రజలకు మంచిచేస్తాడు. జనానికి మేలు చేయాలనే నవరత్నాలను ప్రకటించాడు. వాళ్ల నాన్న లాగే మంచి చేస్తారని జనం నమ్ముతున్నారు. అదే నాకున్న పెద్ద ఆస్తి. దేవుడి దయ, మీ అందరి ఆశీర్వాదంతో అవి కలకాలం కొనసాగుతాయి. మనం గుడికిపోయినా, చర్చికిపోయినా, మసీదుకు పోయినా.. దేవుడికి దగ్గరికి కావాలని పోతాం. దేవుడు మనకేం చెబుతాడు? అన్యాయం చేయొద్దు, అధర్మం చేయొద్దు అని చెబుతాడు. మూడేళ్లుగా జరుగుతోన్న అన్యాయానికి వ్యతిరేకించండి జరుగుతోన్న అన్యాయాన్ని ఇప్పుడు తిప్పికొట్టే సమయం వచ్చింది.

చంద్రబాబు నంద్యాలలో డబ్బులు పంపిణీ చేస్తున్నాడు. అక్కడక్కడ 2వేలు, ఒక్కోచోట 5వేలు ఇస్తున్నారని తెలుసు. ఒక్కొక్కరి చేతిలో డబ్బులుపెట్టి దేవుడి బొమ్మ మీద ప్రమాణం చేయిస్తారు. నంద్యాల అభివృద్ధిని నాకొదిలేయండి. పులివెందుల మీద ఎలా శ్రద్ధచూపిస్తానో, నంద్యాలపైనా అలానే చూపిస్తా. రాబోయే రోజుల్లో నంద్యాలను జిల్లా చేస్తాం. నవరత్నాలను ప్రకటించాం. అవి ప్రతి ఇంటికీ చేరితే ప్రతి కుటుంబంలో వెలుగులు కనిపిస్తాయి. అలా జరగాలంటే ఇప్పుడున్న వ్యవస్థ ఇంకా మారాలి.



తెలంగాణ పోలీసులపై దేశవ్యాప్తంగా ప్రశంసలు : హోంమంత్రి నాయిని

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధి : తెలంగాణ పోలీసులకు రాష్ట్ర వ్యాప్తం గా ప్రత్యేక గుర్తింపు ఉందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. వరంగల్ నగరంలో జరుగు తున్న పోలీసు క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యాన్ని రూపొం దించుకోవచ్చన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అత్యున్నత ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. పాలనలో సిఎం కెసిఆర్ తనదైన శైలిలో దూసుకుపోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణలో ఉన్న చెరువులను ఆధునీకరించేందుకు మిషన్ కాకతీయ కార్యక్ర మాన్ని చేపట్టామని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. కాకతీయ రెడ్డి రాజులు ఆనాడు గొలుసు కట్టు చెరువలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకుని మిషన్ కాకతీయను చేపట్టామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా తయారు చేయాలంటే చెరువులు బాగుండాలన్నారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో సంక్షేమ రంగంలో తెలంగాణ నెంబర్ వన్‌గా దూసుకు పోతుం దన్నారు. రాబోయే బడ్జెట్‌లో యాదవుల సంక్షేమం కోసం నాలుగు వేల కోట్ల రూపాయల నిధులను కెటాయించబోతున్నట్లు వివరిం చారు. ప్రభుత్వ ఉద్యోగుల జీత భత్యాలను పెంచామన్న ఆయన తెలంగాణ పోలీసుల పనితీరును కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో మన పోలీసుల పాత్ర అత్యం గొప్పదని కితాబిచ్చారు. కాగా ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపి పసునూరి దయాకర్, ఎమ్మెల్యే వినయ్‌బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో తుమ్మలకు ఎదురవుతున్న సవాళ్లు?


- ఖమ్మం జిల్లాను శాసించిన తుమ్మల నాగేశ్వరరావు
- జిల్లాపై ఆధిపత్యం కోల్పోతున్న మంత్రి
- ఆయనకు వ్యతిరేకంగా రంగంలోకి దిగిన జలగం
- వెంకట్రావుతో జట్టు కట్టిన ఎంపి పొంగులేటి, పువ్వాడ
- నామినేటెడ్ పదవుల భర్తీలో మంత్రి అనుచరులకు చెక్
- కెటిఆర్‌తో సన్నిహిత సంబంధాలు నెరపుతున్న వ్యతిరేక వర్గం
- పాలేరు నియోజకవర్గానికి పరిమితం చేస్తున్న పార్టీ పెద్దలు
- త్వరలోనే ఖమ్మం జిల్లాలో మరో విడత చేరికలు

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధి : తెలంగాణ క్యాబినెట్‌లో సిఎం కెసిఆర్ తర్వాత తనది రెండోస్థానమంటూ ఇన్నాళ్లు మంత్రి తుమ్మల చేసిన కామెంట్స్ కు టిఆర్ఎస్ అగ్రనేతలు ఆదిలోనే చెక్‌పెట్టారు. గత సార్వత్రిక ఎన్నికలలో ఖమ్మం అసెంబ్లీ నుండి పోటీచేసి ఓటమి పాలైన ఆయనను టిఆర్ఎస్ అధినేత సిఎం కెసిఆర్ పట్టుబట్టి ఎమ్మెల్సీ చేసి మరీ తెలంగాణ క్యాబినెట్‌లోకి చేర్చు కున్నారు. ఆయనతోపాటు ఖమ్మం జిల్లాలో టిడిపికి చెందిన బలమైన వర్గ మంతా గులాబీ కండువా కప్పుకున్నారు. ఆ సమయంలోనే తుమ్మల వ్యతిరేక వర్గమంతా ఒక్కటై సిఎం కెసిఆర్‌ను కలిశారు. రాజకీయంగా దశాబ్దాలుగా ఆయనతో ఉన్న వైరాన్ని ముఖ్యమంత్రికి చెప్పుకున్నారు. వారందరికి ఓదార్చిన ఆయన అందరి రాజకీయ భవిష్యత్‌కు తనదే భరోసా అని హామీ ఇచ్చారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల పంపిణీలో జరిగే అన్యాయాన్ని ముందే పూసగు చ్చినట్టు వివరించారు. అయితే పార్టీ బలోపేతం కోసం ఆయనను తీసు కుంటు న్నామని వారిని సముదాయించారు. కొద్దిరోజులకే జరిగిన క్యాబినెట్ విస్తర ణలో ఆయనకు మంత్రిగా అవకాశమిచ్చారు. ఇక్కడవరకు బాగానే ఉన్న అస లు రాజకీయం ఇక్కడే మొదలైంది. అనుకోకుండా పాలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకట్‌రెడ్డి మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలలో తుమ్మ లను రంగంలోకి దింపిన అధిష్ఠానం ఆయనకు వ్యతిరేకంగా ఉన్నవారిని వెంటనే పార్టీలోకి రప్పించింది. ఖమ్మం ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ టిఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. అంతకు ముందే వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరం కనకయ్యలు పార్టీ మారిన వారి జాబితాలో ఉన్నారు. పొంగులేటితోపాటు మిగిలిన ఎమ్మెల్యే వెంకటే శ్వర్లు కూడ గులాబీ గూటికి చేరారు. దీంతో జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేలకు గాను ఏడుగురు అధికార పార్టీకి చెందిన వారు ఉన్నట్లయింది. జిల్లా రాజకీయాలను తన కనుసైగలతో శాసించే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన అనుచరులకు పదవులు ఇప్పించేందుకు రంగంలోకి దిగారు. దీనిని గమనించిన ఆయన వ్యతిరేక వర్గం తుమ్మలకు చెక్ పెట్టాలని ఓ నిర్ణయానికి వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలనే ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారు. అందులో బాగంగానే ఖమ్మం కార్పోరేషన్ మేయర్‌గా పాపాలాల్ పేరు ఖరారైంది. సిఎం కెసిఆర్ కూడ తొలి నుండి పార్టీలో పనిచేస్తున్న వారికి ప్రాధా న్యత నివ్వాలని సూచించడంతో తప్పని పరిస్థితులలో తుమ్మల ముఖ్య మంత్రి ఆదేశాలను అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మిగిలిన పదవుల పంపకాలలోను ఇదే ఫార్ములాను అనుసరించేందుకు తుమ్మల వ్యతి రేక వర్గం పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కెటిఆర్‌తో టచ్‌లో ఉంటున్న తుమ్మల వ్యతిరేకవర్గీయులు

ప్రస్తుత ఖమ్మం జిల్లా రాజకీయాలలో అధికార టిఆర్ఎస్ పార్టీలో చీలిక స్పష్టంగా కనపడుతుంది. తుమ్మలతోపాటు పార్టీలో చేరిన టిడిపి నేతలు ఒక వర్గంగా ఉండగా టిడిపికి వ్యతిరేకంగా పోరాడి టిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు మరోవర్గంగా ఉన్నారు. ఇందులో తుమ్మల వ్యతిరేక వర్గానకి సీనియర్ నేత జలగం వెంకట్రావుతో పాటు ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. తుమ్మల కోటరీలో ముఖ్యనేతలుగా ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, గడిపల్లి కవిత, కొండబాల కోటేశ్వరరావు, మదన్‌లాల్‌లు ఉన్నారు.

ఆయా నియోజకవర్గాలలో ఉండే నామినేటెడ్ పదవుల పంపిణీలో ఎమ్మెల్యే లదే తుది నిర్ణయమని సిఎం కెసిఆర్ స్పష్టం చేయడంతో ఆ పదవుల పందే రంలో తుమ్మల జోక్యం చేసుకోవడం లేదు. జిల్లా స్థాయిలో ఉండే ఖమ్మం వ్యవసాయ మార్కెట్, గ్రంథాలయ సంస్థ, భద్రాచలం ఆలయ కమిటీ వంటి కీలక పదవులను తన అనుచరులకు అప్పగించేందుకు రంగం సిద్దం చేశారు. కానీ ఆయన వ్యతిరేక వర్గం తుమ్మలకు చెక్ పెట్టి ఖమ్మం మార్కెట్ ఛైర్మన్‌గా ఆర్‌జెసి క్రిష్ణ పేరును సూచించిందని సమాచారం. టిఆర్ఎస్ అధిష్ఠానం కూడ ఆయన



వైపే మొగ్గు చూపతుండడంతో తుమ్మల కూడ ఏం చేయలేని పరిస్థితులలో ఉన్నారని ప్రచారం జరుగుతుంది. ఇక మంత్రి కెటిఆర్‌తో ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తరచూ సమావేశమవుతూ తన అనుచరులకు న్యాయం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

పాలేరు నియోజకవర్గానికి పరిమితమైన తుమ్మల

పాలేరు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనవిజయం సాధించారు. అయితే ఈ అసెంబ్లీ టికెట్ కోసం పార్టీలో పలువురు సీనియర్ నేతలు టికెట్ ఆశించినప్పటికి సిఎం కెసిఆర్ మాత్రం వ్యూహాత్మకంగా తుమ్మలను బరిలోకి దింపారు. జిల్లా రాజకీయాలను శాసించే క్రమంలో నాగేశ్వరరావు తన వ్యతిరేకవర్గాన్ని ఎదగనీయడం లేదని గ్రహించిన ముఖ్యమంత్రి ఆయనను పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానకి పరిమితం చేయాలని భావించారని సమాచారం.


తుమ్మల తన సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్ర స్థాయిలో పదవులు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం పై ఒత్తిడి పెంచుతున్నారు. పలు సందర్బాలలో సిఎం కెసిఆర్ కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం కూడా ఆయన ఆగ్రహానికి కారణమైందట. వెరసి తుమ్మలకు చెక్ పెట్టే పనిలో ఇటు అధిష్ఠానం, అటు టిఆర్ఎస్ నేతలు మూకు మ్మడిగా రంగంలోకి దిగారని ప్రచారం ఖమ్మం జిల్లాలో విస్తతంగా జరుగు తుంది.

సింగరేణిలో మోగిన ఎన్నికల నగారా




హైదరాబాద్, మేజర్‌న్యూస్ : సింగరేణిలో ఎన్నికల నగారా మోగింది. సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై సోమవారం సింగరేణి అధికారులు చర్చించారు. అక్టోబర్ 5న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్యాం సుందర్, సింగరేణి డైరెక్టర్ (పా) పవిత్రన్ కుమార్, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.ఎన్నికల షెడ్యూల్..నామినేషన్ల స్వీకరణ – సెప్టెంబర్ 14 – సెప్టెంబర్ 16, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ – సెప్టెంబర్ 19 నామినేషన్ల పరిశీలన – సెప్టెంబర్ 20, ఎన్నికలు – అక్టోబర్ 5. అదే రోజు రాత్రి 7 గంటల తర్వాత ఓట్లను లెక్కిస్తారు.

నంద్యాల ఎన్నికపై హైకోర్టులో పిటిషన్




హైదరాబాద్, మేజర్‌న్యూస్ : కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార పార్టీ దుర్వినియోగానికి పాల్పడుతోందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో సోమవారం రిట్ పిటిషన్ దాఖలైంది. కిరణ్‌బాబు అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఉల్లంఘించి అధికార పార్టీ ప్రచారం నిర్వహిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ప్రలోభానికి గుర్తి చేస్తోందని తెలిపారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.కాగా, అధికార టీడీపీ నాయకులపై ఇప్పటికే ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ పలుమార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. తెలుగుదేశం నాయకుల ప్రలోభాల వ్యవహారం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లింది. టీడీపీ నేతల అక్రమాలపై ఈసీ సీరియస్‌గా దృష్టి సారించింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె అలవెన్సు పెంపు



విజయవాడ, సూర్య బ్యూరో : మచిలీపట్నం, శ్రీకాకుళం, చిత్తూరు పట్టణాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యం 20 శాతానికి పెంచడంపై ఎన్‌జీవో నేతలు పి. అశోక్‌బాబు, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, చిత్తూరు జిల్లా చిత్తూరు, శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం పట్టణ పరిధిలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె అలవెన్సును 14.5 శాతం నుండి 20 శాతానికి పెంచుతూ సంబంధిత దస్త్రం పై ముఖ్యమంత్రి సంతకం చేయడం పట్ల ఎపి ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ ఉత్తర్వుల ద్వారా మచిలీ పట్నం, చిత్తూరు, శ్రీకాకుళం పట్టణాలలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు సుమారు 30 నుండి 35 వేలమందికి లబ్ధిచేకూరనుందని తెలిపారు. ఆయా ఉద్యోగుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రికి వారి మంత్రివర్గ సహచరులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఎపి ఎన్‌జీవోల పక్షాన కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయరంగంలో ప్రతిభను ప్రశంసించిన సీఎం



విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వ్యవసాయ, ప్రాథమిక అనుబంధ రంగాలపై అన్ని జిల్లాలో కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిం చారు. నగరంలో కలెక్టర్ కార్యంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం జిల్లాలోని వ్యవసాయ రంగ ప్రతిని వివరిస్తూ జిల్లలో 2 లక్షల 90 వేల హెక్టార్ల విస్తీర్ణం పంట సాగును చేయడం జరిగిందని, గత సంవత్సరం ఇదే సమయంలో లక్షా 80 వేల హెక్టార్లలో మాత్రమే సాగుచేయడం జరిగిందని, గత సంవత్సరంతో పోలిస్తే అదనంగా లక్షా 10 వేల హెక్టార్లలో సాగు విస్తీర్నం చేశామని కలెక్టర్ సీఎంకు వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా విడుదల అవుతున్న గోదావరి నీటిని జిల్లాలోని కాలువ చివరి భూముల వరకు నీటిని అందించి ప్రణాళికా బద్దంగా అధికారుల సమన్వయంతో ఈ ప్రగతిని సాధించామని కలెక్టర్ సీఎంకు వివరించారు. ఇక్రాఫ్‌లో 2 లక్షల 65 వేల 93 హెక్టార్ల పంట సాగును నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో 2,252 మెట్రిక్ టన్నులు సూక్ష్మ పోషకాల పంపిణీ లక్ష్యానికి గాను 2,370 మెట్రిక్ టన్నులు లక్ష్యానికి మించి పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలో 19,200 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ లక్ష్యానికి గాను ఇప్పటికే 3,624 కోట్లు, కౌలు రైతులకు 85.78 కోట్లు అందించామని కలెక్టర్ సీఎంకు వివరించారు. రాష్ట్రంలోనే వ్యవసాయ రంగంలో కృష్ణాజిల్లా అన్నింటా మొదటిస్థానంలో నిలపడంపట్ల జిల్లా కలెక్టర్ సీఎం అభినందించారు.

జహీరాబాద్‌లో టిడిపి జోరు



- కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల నుండి టిడిపిలోకి
- పార్టీ ప్రతిష్ఠత కోసం తమ్ముళ్ల కృషి
- ఎట్టకేలకు పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యం
- టార్గెట్ 2019పై టిడిపి దూకుడు

జహీరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో గత 2014 శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుండి టిఆర్ఎస్ ప్రభుత్వంపై ఆ పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, వర్కింగ్ ప్రెసిడెండ్ ఎ. రేవంత రెడ్డిలు ఢీ అంటే ఢీ అన్నట్లు ప్రభుత్వంపై విరుచుపడుతూ విమర్శనలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని వినిపిస్తుంది. జహీరాబాద్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందనే విమర్శలున్న పార్టీ ముందుండి నడపించే నాయకుడిగా రెండు మార్లు ఓటమి పాలైన నాయకుడు, పదువుల కోసం ఆశ పడకుండా ప్రజా సేవకు అంకితమై తెలుగుదేశం పార్టీలో ఉండి అధికార పార్టీ అయిన టిఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న మహా నాయకుడు వై. నరోత్తమ్ అని చేప్పవచ్చు. 2009 శాసనసభ ఎన్నికల్లో వై. నరోత్తమ్ తన జాబ్‌కు రిజన్ చేసి ప్రజాసేవలో పాలుపంచుకుంటానని కాంగ్రెస్ పార్టీ సినీయర్ నాయకురాలు గీతారెడ్డిపై టిడిపి తరుపున ఎమ్మెల్యేగా పోటి చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుండి పార్టీ కోసం, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడగా పేరుపోందిన మహా నాయకుడుగా వై.నరోత్తమ్ గుర్తింపు పొందారు. తజాగా 2014లో మళ్లి టిడిపి తరుపున ఎమ్మెల్యేగా పోటి చేసి పరాజయం పాలయ్యారు. ఓటమి చేందాననే నిరుత్సాహం చేందకుండా పార్టీ కార్యకర్తలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ప్రజల సమస్యలపై అధికార పార్టీనాయకులపై పోరాటం చేస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రెండుమార్లు ఓటమి పాలైన టిడిపి చెక్కు చెదర కుండా పార్టీలోనే కొనసాగుతున్న టిడిపిలోకి అధికార పార్టీ నాయకులు, ప్రతి పక్ష పార్టీ అయిన కాంగ్రెస్ నేతలు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ ప్రతిష్టత కొరకు కార్యకర్తలతో కలిసి పార్టీ పూర్వవైభవమే లక్ష్యం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. స్వర్గీయ మాజీ మంత్రి బాగారెడ్డిపై తెలుగుదేశం పార్టీ తరుపున దశరథ్‌రెడ్డి పోటి చేసి ఓటమి చెందారు. ఎన్టీఆర్ న్యాయకత్వంలో టిడిపి పార్టీ టికెట్‌ను అశించిన దశరథ్‌రెడ్డి ,కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే పి. నర్సింహారెడ్డిపై పరాజయం పాలయ్యారు. తాజాగా రెండు మార్లు టిడిపి తరుపున పోటిచేసి ఓటమి చేందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ముచ్చటగా మూడోసారి చెంగల్ బాగన్న టిడిపి తరుపున పోటి చేసి కాంగ్రెస్‌పై భారీ మేజార్టీతో గెలు పొందారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం పసుపుమయంలో నిండిపోయింది. నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీకి దీటుగా గట్టి పోటీని ఇస్తున్న పార్టీ కేవలం తెలుగుదేశం పార్టీయేనని చేప్పవచ్చు. 2009 శాసనసభ ఎన్నికలు రావడంతో జహీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో మాజీ మంత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యే గీతారెడ్డిపై టిడిపి తరుపున వై.నరోత్తం రెండు సార్లు పోటి చేసి పరాజయం పాలయ్యారు.

ఓటమి చవిచూసిన తమ్ముళ్ళల్లో జోరు తగ్గలేదు అని చేప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ అభిమానులు, స్వర్గీయ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుపై అభిమానులు జహీరాబాద్ చాలావరకు ఉన్నట్లు చేప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ శ్రామీకుల పార్టీ అని చెప్పిన ఎన్టీఆర్ మాటకు కట్టుబడి నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల పార్టీని నాయకుల్లో ఉత్సాహం పెంచుతూ పార్టీ బలోపేతం చేసి పూర్వ వైభవంతో ముచ్చటగా మూడోసారి 2019లో జహీరాబాద్ నియోజకవర్గంపై పసుపు జేండా ఎగరవేయడమే ఖాయంగా నరోత్తమ్ సేన పనిచేస్తుంది. పార్టీ సినియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి. నర్సింహారెడ్డి, జి.గుండప్ప, పార్టీ సినియర్ నాయకులు హుగ్గెల్లి జి. రాములు వంటి నాయకులు పార్టీలోనే కొనసాగుతున్నారు. పార్టీ సినీయర్ నాయకులు ఉండడంతో రెండుమార్లు ఓటమి పాలైన టిడిపి పార్టీ చెక్కు చెదరకుండా పూర్వ వైభవమే లక్ష్యంగా కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పార్టీ బలం గా ఉందని చెప్పవచ్చు.

ఏదిఏమైనా 2019 ఎన్నికల్లో ఖచ్చితంగా పసుపు జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కల్తీజోరు.. వినియోగదారులు బేజారు

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- మామూళ్ల మత్తులో మునిగిపోతున్న అధికారులు
- కల్తీ సరకులు అమ్ముతూ లక్షలు ఆర్జిస్తున్న వ్యాపారులు



కరీంనగర్–సూర్యప్రధానప్రతినిధి : చుడ్డానికి నిగనిగలాడగుతుంటాయి. నిజమైన వాటికి ఏ మాత్రము తీసిపోవు పైగా ధర సైతం తక్కువే. ఇంకేముంది సామాన్య ప్రజలు బుట్టలో పడినట్టే పైకి నిగనిగలు... ధర సైతం ఊహించినంతే.. ఈ రెండు చాలు సరుకు కొనుగోలు చేయడానికి దీన్నే కొందరు అక్రమార్కులు క్యాష్ చేసుకుంటున్నారు. అసలైన వాటికి ఏమాత్రం తీసిపో కుండా ఆహార ధాన్యాలను కల్తీ చేసి విక్రయిస్తు లక్షలు ఆర్జిస్తున్నారు. కల్తీ సరుకులను ఆరికట్టాల్సిన అధికారులు మాములుగా తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కల్తీ సరుకులు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఆరికట్టంలో విఫలమౌవుతున్నారు. కల్తీ సరుకులు వాడిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు మాముళ్ల మత్తులో నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సి, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధమైన మోసాలు జరుగుతున్నాయి. అమాయక ప్రజలను ఆసరగా తీసుకుని వ్యాపారులు ఉప్పు నుంచి మొదలుకొని కారం, పసుపు, పప్పులు, పిండి, సబ్బుల వరకు కల్తీ సరుకులు విక్రయిస్తున్నారు. ప్రతి మండలం లోను మేజర్ గ్రామ పంచాయితీల పరిధిలో వారంతపు సంతలు జరుగుతుంటాయి. ఈ సంతలే వ్యాపారులకు అడ్డాలు. కొందరు నేరుగా దుకాణాల్లోను యధేచ్ఛగా కల్తీ సరుకులు విక్రయిస్తున్నారు. దుకాణాల్ల మొదటి రకం క్వాలిటీ, రెండో రకం క్వాలిటీ అంటు రెండు రకాలుగా సరుకులను విక్రయిస్తున్నారు. ఇందులో రెండో రకం క్వాలిటి సరుకులు ధర తక్కువగా ఉండడంతో అమాయక ప్రజలు వాటినే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు సైతం వీటి విక్రయాలతోనే అధిక లాభం వస్తోంది. దీంతో రెండొరకం సరుకులకే వారు ప్రాధాన్యత ఇస్తున్నారు.

వారంతపు సంతలే అడ్డాలు...

గ్రామీణ ప్రాంత ప్రజలను ఆసరగా చేసుకొని కొందరు వ్యాపారులు కల్తీ సరుకులను తక్కువ ధరకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుని వారాంతపు సంతలతోపాటు పలు కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు కల్తీ సరుకులను గుర్తించడంతో పెద్దగా అవగాహన లేక పోవడంతో వ్యాపారులు దీన్ని ఆసరగా చేసుకుని వారికి సరుకులను అంటగడుతున్నారు.

ధర తక్కువ, లాభం ఎక్కువ: ఉమ్మడి జిల్లాలోని కల్తీ సరులకును నివారించడానికి సంబంధితశాఖల అధికా రులు నామమాత్రంగా తనిఖీలను నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక వైపు ధరల పెరుగుదల, మరో వైపు మార్కెట్‌లో పోటి పరిస్థితులు నెలకొనడం తో కల్తీ సరుకుల విక్రయాల్లో అధికలాభం ఉండడంతో వ్యాపారులు వాటినే విక్రయిస్తున్నారు. పెసరపప్పు, కందిపప్పుతోపాటు ఎర్రపప్పు, కారంపొడి, శనగపిండి, సబ్బులు, సరుపులు, ఆయా రకాల పిండి సరుకులు సైతం తక్కువ ధరలకే లభిస్తున్నాయి.


ఇతర ప్రాంతాలనుంచి దిగుమతి

మండల, పట్టణ కేంద్రాల్లో వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది రూపాయాలు విలువ చేసే నకిలీ సరుకులను దిగుమతి చేసుకుటున్నట్లు సమాచారం. రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి వారాంతపు సంతలో విక్రయిస్తున్నారు. అధికారులు వీరిని పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇదే అదునుగా తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు.

కల్తీ ఇలా : సరుకులు కల్తీవో... నాణ్యమైనవో తేల్చుకోలేని విధంగా కల్తీ సరుకులను వ్యాపారులు తయారు చేస్తున్నారు. కందిపప్పులో సోయాపప్పు కలుపుతున్నారు. సోయా పప్పు సైతం కందిపప్పు మాదిరిగానే ఉంటుంది.

దీన్ని కంది పప్పులో కలిపి విక్రయిస్తున్నారు. పెసరపప్పులో పిల్లిపెసర కలిపి విక్రయిస్తు న్నారు. నాసిరకమైన మిరపకాయలతో తయారు చేసిన కారంపొడిని సంతల్లో విక్రయిస్తున్నారు. కల్తీ చేసిన వాటిని పక్కపక్కన పెట్టి చూస్తే ఒకే విధంగా కనబడుతుంటాయి. ఇక్కడే ప్రజలు మోసపోతున్నారు. వాషింగ్ పౌడర్లు, సబ్బులు సైతం నురుగ అధికంగా వచ్చే వాటిని చూపి ప్రజలను బురిడి కొట్టిస్తున్నారు.

ఎపి నుంచి 2,813 మంది హజ్ యాత్రికులు



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రికులు మొత్తం 2,809 మంది పవిత్ర మక్కా నగరానికి హజ్ యాత్ర కోసం వెళ్ళారు. హైదరాబాద్ నుంచి 2100, బెంగుళూరు నుంచి 696, ముంబాయి నుంచి 17 మంది. వీరికి సహాయ సహకా రాలు అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 14మంది ఖాదిముల్ హుజ్జాజ్ (హజ్ వాలెంటీర్ల)ను పంపింది. వీరితో కలిపి మొత్తం 2,813 మంది ఎపికి చెందిన హజ్ యాత్రికులు ఉన్నారు.

ఎమర్జెన్సీ యూనిట్స్ డాక్టర్ల కోసం దరఖాస్తులు

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలోని నార్త్ కోస్టల్ ఆంధ్రా, సెంట్రల్ జోన్, రాయలసీమ జోనల్ పరిధిలో అడ్వాన్స్ లైఫ సపోర్ట్ అంబులెన్స్‌లలో పని చేయుటకు సమర్ధులైన వైద్య సిబ్బందిని కాంట్రాక్టు విధానంలో తాత్కాలిక పద్దతిలో నియమించుటకు దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతోందని డైరెక్టరు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా॥ ఎన్. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియ జేశారు. నార్త్ కోస్టలాంధ్రలో విశాఖపట్నం కేంద్రంగా, సెంట్రల్ జోన్‌లో గుంటూరు కేంద్రంగా, రాయలసీమ జోన్ లో తిరుపతి కేంద్రంగా, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లో ప్రముఖుల పర్యటన సందర్బంలో నిబద్దతతో కూడి విధులు నిర్వర్తించుటకు ఆసక్తిగల అభ్యర్ధుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. 3 సంవత్సరాల కాల పరిమితితో జరిగే కాంట్రాక్టు నియామ కమును ప్రతి ఏడాది పొడిగించడం జరుగుతుందన్నారు. జనరల్ మెడిసన్, అనస్తీషియా విభాగాలలో ఎండి పోస్టులకు, సర్జరీ, ఆర్థోసర్జరి విభాగాలలో ఎంఎస్ అర్హత కలిగిని డాక్టర్లు దరఖాస్తుకు అర్హులు. ప్రతినెల రు.75 వేల రూపాయలు కన్‌సాలిడేట్ శాలరీ ఇస్తారు. ఏపి మెడికల్ కౌన్సిల్లో రిజిష్టరు కాబడి ప్రముఖ ప్రభుత్వ లేక ప్రయివేటు ఆసుపత్రులలో తగిన అనుభవం కలిగివుండి 40 సంవత్సరాలలోపు వ్యక్తులు దరఖాస్తుకు అర్హులు. విద్యార్హతలకు 80 మార్కులు, ఇంటర్వూకు 10 మార్కులు, ఎక్స్‌పిరియన్స్‌కు ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కులు, పీజీ క్వాలిఫికేషన్‌తో ఉత్తీర్ణులైన వారు అర్హులు. దరఖాస్తుకోసం రు. 5 వందల రూపాయలు రుసుముగా చెల్లించాల్సి వుంటుంది. డిఎంఇ ఏపి, పాత గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ ప్రాంగణం, హనూమాన్ పేట, తుమ్మలపల్లి కళాక్షేత్రంఎదురుగా విజయవాడ 520003 కు ఆగస్టు 28 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు కోసం డిఎంఇ వెబ్‌సైట్ చూడాలని సుబ్బారావు తెలియజేశారు.

ఓట్ల కోసం కక్కుర్తి పొత్తుల ఎత్తులు

- నంద్యాలలో అలా... కాకినాడలో ఇలా..
- బిజెపి-టిడిపిల ధోరణిపై బొత్స విసుర్లు

కాకినాడ, సూర్య ప్రతినిధి : నంద్యాలలో ముస్లిం, మైనార్టీల ఓట్లు కోల్పోతామన్న భయంతో బిజెపిని దూరంగా పెట్టిన తెలుగుదేశం పార్టీ కాకినాడలో మాత్రం ఆ పార్టీతో కలిసి నగరపాలక సంస్థ ఎన్నికల్లో ముందుకు వెళ్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, మాజీమంత్రి బొత్స సత్య నారాయణ విమర్శించారు. ఓట్లు కోసం ఈ కక్కుర్తి పొత్తుల ఎత్తులు కొనసాగుతున్నారు. భవిష్యత్తులో వైసీపీ బిజెపితో పొత్తు పెట్టుకుంటుందా అన్న ప్రశ్నపై బొత్స స్పందించారు. ప్రస్తుతం టిడిపితో కాపురం చేస్తుంది కాబట్టే ఆ పార్టీతో కాకినాడలో పొత్తు పెట్టుకుందని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం కాకినాడ కార్పొరేషన్ వైసీపీ ఎన్నికల కార్యాలయంలో బొత్స సత్యనారాయణ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి అధికార దుర్వినియోగం, ప్రలోభాల పర్వం నంద్యాల, కాకినాడలోనూ మరింత పెరిగిపోయిందన్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీ పేరుతో కోట్లాది రూపాయలు టిడిపి ప్రజాప్రతినిధులు దోచేశారని ఆరోపించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో బిజెపితో పొత్తు లేనట్టు పచ్చ టోపీతో అక్కడి ముస్లిం, మైనార్టీలను చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి విధానాలు స్పష్టంగా లేవని, ద్వంద్వ విధానాలతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. మూడున్నర ఏళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.



రైతులకు తక్షణమే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అందజేయాలి

రాష్ట్ర ప్రభుత్వవిప్ చింతమనేని ప్రభాకర్

ఏలూరు, బ్యూరో మేజర్‌న్యూస్ : పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నామని రైతులకు అవసరమైన భూరికార్డులను ఆన్‌లైన్‌లో తక్షణమే అందేలా రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ ఏలూరు ఆర్‌డిఓ జి చక్రధరరావును కోరారు. స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం చింతమనేని చక్రధరరావును కలిసి దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రజలెదుర్కొంటున్న పలు విషయాలపై ఆర్‌డిఓతో చర్చించారు. గత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతానికి సమృద్ధిగా సేద్యపునీరుతోపాటు త్రాగేనీరు కూడా అందించ గలుగు తున్నా మిన గత రెండేళ్ళ నుండి మెట్ట ప్రాంతంలోని రైతాంగం కూడా సేద్యపునీటికి ఇబ్బందిలేకుండా ఆనందంగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. రైతాంగం పంట ఋణాలకోసం, రెవెన్యూ రికార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారని ఎక్కడ కూడా జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా రైతులకు కావల్సిన అడంగల్ కాపీ ఇతర రెవెన్యూ రికార్డులను సమకూర్చాలని చింతమనేని చెప్పారు. ఏలూరు రెవెన్యూ డివిజన్‌పరిధిలో నూరుశాతం రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్ లో పొందుపరిచామని, మీ – సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసిన వెంటనే అవసరమైన రికార్డులు రైతాంగం పొందేలా పటిష్టమైన చర్యలు తీసుకు న్నామని ఎక్కడైనా జాప్యం జరిగితే వెంటనే సరిదిద్ది రైతులకు మరింత చేరువయ్యేలా గ్రామస్థాయి నుండి మండల స్థాయి అధికారులను అప్రమత్తంచేస్తామని చక్రధరరావు అన్నారు.



ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- ఓటింగ్ శాతం పెంచాలి
- వచ్చే 3, 4 రోజుల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఎన్నికల ఏర్పాట్లు సంతృప్తికరం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్. రమేష్ కుమార్

కాకినాడ, మేజర్‌న్యూస్ ప్రతినిధి : కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లను రమేష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు న్యాయపరమైన అంశాలను పరిగణలోకి తీసుకొని, ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఈ ఎన్నికలను అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రానున్న 3, 4 రోజులలో అప్రమత్తంగా ఉండి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం వుందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపకుండా, ఎన్నికల సిబ్బంది ఒక టీమ్‌లా పని చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సిబ్బంది క్రియాశీలకతతో పనిచేసే సమర్ధతను చూపాలన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల ఏర్పాట్లు సమర్ధవంతంగా చేసారని కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులుగా సమర్థవంతమైన అధికారులు ఉన్నారని, ఎన్నికల నిర్వహణ పట్ల ఎన్నికల కమిషన్‌కు ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ఫిర్యాదులు ఏమీ లేవన్నారు. తూర్పు గోదావరి జిల్లాకు ప్రత్యేక సంస్కృతి వుందని, హింసాత్మక సంఘటనలకు ప్రజలు తావివ్వరని, ఈ మేరకు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరుగుతుందనే నమ్మకాన్ని కమిషనర్ వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం ద్వారా వెబ్‌కాస్టింగ్, ఆన్‌లైన్ మోనిటరింగ్ విధానాలు, బందోబస్తు ఏర్పాట్లపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ ఎన్నికలలో ఎక్కువ శాతం ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోనేలా చర్యలు చేపట్టాలని, అదే విధంగా యువత కూడా ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఓటుహక్కును సామాజిక భద్రతగా ఓటర్లు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఎన్నికల ఏర్పాట్ల కమిషనర్‌కు వివరిస్తూ కాకినాడ నగరపాలక సంస్థకు 48 డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఈ ఎన్నికల పోలింగ్ ఈ నెల 29వ తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కోసం 196 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, మొత్తం 2,29,373 ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సరాసరి 1120 ఓటర్లు ఉంటారని, 39/4 పోలింగ్ స్టేషన్‌లో అతి తక్కువగా 746 ఓటర్లు ఉండగా, పోలింగ్ స్టేషన్ 11/5లో అత్యధికంగా 1354 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లను ప్రభుత్వం, ప్రైవేటు భవనాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం 216 ప్రిసైడింగ్ అధికారులు, 216 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 723 ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ ఈ నెల 19న నిర్వహించామని, రెండవ విడత ఈ నెల 24న నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది అందరినీ కాకినాడ డివిజన్‌కు బయటివారినే నియమించామని, పోలింగ్ డ్యూటీల ప్రాంతాలు ఈ నెల 28న మాత్రమే వారికి తెలుపుతామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక మైక్రో పరిశీలకున్ని నియమించామని, పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తామన్నారు. పోలింగ్ కోసం ఫోటో ఓటరు స్లిప్‌లను సోమవారం నుండి బుధవారం వరకు ఆయా బూత్ స్థాయి అధికారులు ఇంటింటా పంపిణీ చేస్తారన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును పరిశీలించేలా నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, ఈ కంట్రోల్ రూమ్ నెం.0884-2376051 నంబరుకు ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ నిర్వహణకు ఏడు జోనల్ అధికారులు, 13 రూట్ అధికారులను నియమించామన్నారు. అదే విధంగా ఓట్ల లెక్కింపునకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఓట్ల లెక్కింపు సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 8 గంటల నుండి జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను కమిషనర్‌కు వివరిస్తూ ఎన్నికల కోసం 12 చెక్‌పోస్టులు, 37 పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో 28 పోలింగ్ స్టేషన్లు అత్యంత సమస్యాత్మకంగా... 52 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగాను గుర్తించడం జరిగిందని, పోలింగ్ నిర్వహణకు ఆరు స్ట్రైకింగ్ ఫోర్సులు, ఆరు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, 13 రూట్




మొబైల్ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. ఎన్నికల నిర్వహణకు 3వేల మంది సిబ్బంది పనిచేస్తారని, రెవెన్యూ మున్సిపల్ సహకారంతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎవి.సత్యప్రకాష్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ అలీంబాషా, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, డిఆర్‌ఓ ఎం.జితేంద్ర, రెవెన్యూ పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

– పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎన్నికల కమిషనర్ :


రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్ సోమవారం నాడు కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా కాకినాడ గాంధీనగర్‌లోని 41/1 పోలింగ్ కేంద్రాన్ని, రామారావుపేటల్లోని 39/1, 39/2, 39/3, 39/4 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కోసం వచ్చే వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమీషనర్ సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను కమీషనర్‌కు వివరించినా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, పోలింగ్ కేంద్రాలలో వికలాంగులకు వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు టాయిలెట్స్, మంచినీరు సదుపాయాల ఏర్పాటుపై కమమీషనర్ తగు సూచనలిచ్చారు. కమీషనర్ వెంట మున్సిపల్ కమీషనర్ అలీంబాషా, కాకినాడ ఆర్‌డిఓ ఎల్.రఘుబాబు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జలక్రీడలకు గుర్తింపునకు కృషి



విజయవాడ, సూర్యబ్యూరో : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో జలక్రీడ లకు గుర్తింపు తీసుకురావటానికి, రాష్ట్రంలో నాల్గు ప్రదేశాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయ, యువజన, క్రీడలు, శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక వున్నమి ఘాట్‌లో ఏర్పా టు చేసిన జల క్రీడలు డెమో కార్యక్రమాన్ని మంత్రి కొల్లు రవీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలవల్ల భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాలలో క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునా మన్నారు. రాష్ట్ర క్రీడాకారులు వివిధ అంశాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచేయడానికి మంచి శిక్షణ ఇవ్వడానికి 10 అకాడమీలను ఏర్పాటు చేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. అందులో భాగంగా విజయవాడలోని వున్నమిఘాట్, నాగా యలంక, తూర్పుగోదావరి జిల్లాలోని ఎర్రకాలువ, విజయనగరం జిల్లాలోని తాటివూడి వద్ద ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇక్కడ కెనాయింగ్ (పడవ పందెం), కయాకింగ్ (సన్నని పడవ), రోయింగ్, సెయిలింగ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 12 సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాల వయస్సులోవు ఉన్న వారికి ఇక్కడ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి ఉచితంగా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. రూ.5 లక్షలతో మున్సిపాలిటీలలో కూడా ప్లేగ్రౌండ్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ మేనేజర్ రామకృష్ణ, జిల్లా ఎస్.డి.వో బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలో డబ్బు ప్రభావంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి



విజయవాడ, సూర్యబ్యూరో : నంద్యాల ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలు విచ్చల విడిగా వెదజల్లుతున్న ధన ప్రవాహంపై ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కె. రామకృష్ణ నేడొక ప్రకటన విడుదల చేసారు. నంద్యాల అసెంబ్లీ సీటు గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలైన టిడిపి, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీలు 'చావో రేవో' అనే విధంగా అడ్డదారులు తొక్కుతూ, పలు రకాల కుయుక్తులకు పాల్పడుతూ తమ ప్రయత్నాలు సాగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నీ గాలికొదిలేసి ప్రభుత్వ యంత్రాంగమంతా నంద్యాలలోనే తిష్టవేసిందన్నారు. ఈ ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతుంటే ఎన్నికల కమీషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా సర్వేలు, ఓపీనియన్ పోల్స్‌పై నిషేధం విధించడం ఆమోదయోగ్యమే. కాని నంద్యాలలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున డబ్బులు పంచుతూ మొత్తం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే ఎన్నికల కమీషన్ చర్యలు చేపట్టపోవడం శోచనీయమన్నారు.

కాకినాడ ఎన్నికల్లో వైసిపిని తిప్పి కొట్టండి

- ప్రజలకు ఆర్థిక మంత్రి యనమల పిలుపు
- ప్రజాస్వామ్యంలో నాయకునిగా తగని వ్యక్తి జగన్

కాకినాడ, సూర్యప్రతినిధి : గతంలో కాకినాడలో కబ్జాకు పాల్పడిన నాయకులకు అండగా ఇక్కడ దోచుకునేందుకు,వచ్చిన ఇతర జిల్లాల అవినీతి నాయకులకు గతంలో వైజాగ్‌లో అక్కడ ప్రజలు ఏవిధంగా తిప్పికొట్టారో, ఆ విధంగా కాకినాడలో కూడా తిప్పికొట్టాలని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన జగన్మోహన్‌రెడ్డి జర్నలిజం నైతిక విలువలను దిగజార్చరని ఆయన వివరించారు. ప్రెస్‌కౌన్సిల్ ఇండియా నిబంధనలను కూడా తుంగలో తొక్కిన జగన్మోహన్‌రెడ్డికి అతని పత్రిక, చానల్ గతంలో డిక్టేటర్‌గా వ్యవహరించిన హిట్లర్ చేసే తప్పులను కప్పి పుచ్చిన గ్లోబెల్ మాదిరిగా ఇవి వ్యవహరిస్తున్నారని యనమల తెలిపారు.ప్రజాస్వామ్యంలో నాయకునిగా ఉండటానికి తగని వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని ఆయన విమర్శించారు. ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కాకుండానే తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని లక్షకోట్లు దోచుకున్న చరిత్ర జగన్మోహన్‌రెడ్డి గురించి ఆనాడు టిడిపి విపులంగా ఒక పుస్తకాన్ని ప్రచురించిందని ఆయన తెలియజేసారు. దానిలో విపులంగా ఈ అవినీతి,దౌర్జన్యాలను క్రోడీకరించామన్నారు.సిబిఐ జగన్మోహన్‌రెడ్డి కేసులకు సంబంధించి 11 ఛార్జిషీట్‌లు వేసిందని, ఆ కేసులు అన్ని ప్రస్తుతం ట్రయిల్స్‌కు వస్తున్నాయన్నారు. ఆ 11ఛార్జిషీట్‌లు మొత్తం ఒకే ట్రయిల్‌గా వేయమని కోర్టును జగన్ కోరాడన్నారు. లేకపోతే ప్రతి శుక్రవారం వెళ్ళడానికి బదులు ప్రతిరోజూ కోర్టుకు వెళ్ళాల్సి వస్తుందన్నారు.ఐపిసిలో 420 క్రింద 11 ఛార్జిషీట్‌లు దోపిడి, అవినీతికి పాల్పడిందన్నారు.సిబిఐ రూ.40కోట్ల ఆస్తులు



అటాచ్‌మెంట్ చేస్తే, అంతలేదని, రూ.18 కోట్లు మాత్రమేఅని జగన్ చెబుతున్నాడని, అయితే ఆమేరకు ఆసొమ్ము ఎక్కడ నుండి వచ్చిందో తెలియజేయాలన్నారు.అయితే కరెప్షన్‌లో మనీల్యాండరింగ్ మర్డర్ కంటే ప్రమాదకరమైందన్నారు.అయితే ఈ అవినీతి కేసులకు సంబంధించి త్వరలో కోర్టులు నిర్ణయం తీసుకుంటాయన్నారు.రాజకీయాల్లో వచ్చేసరికి సాక్షిపత్రికగానీ, సాక్షిఛానల్‌గానీ, లోటస్‌పాండ్‌లో ఇల్లుగానీ, బెంగుళూరులో ప్యాలెస్‌గానీ, ఇడుపులపాయిలో భవనాలు గానీ ఉన్నాయా? అంటూ ఆయన ప్రశ్నించారు. అధికారం లేకుండానే తండ్రి వెనుక ఉండి లక్షకోట్లు వసూలు చేసిన చరిత్ర జగన్‌కు ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేసే అభివృద్ధి అడుగడుగునా అడ్డుపడుతున్న చరిత్ర జగన్‌కు ఉందన్నారు.వైజాగ్‌లో ప్రభు త్వం నిర్వహించిన సమ్మిట్స్ 1,2 కూడాఅడ్డుకున్న చరిత్ర జగన్‌కు ఉందన్నారు. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికాకుండా కోర్టుల్లో కేసులు వేయించి వాటిని అడ్డుకునే ప్రయత్నాన్ని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. సాక్షి పత్రిక వైఎస్ఆర్‌సిపి కరపత్రంలా మారిందని, అయితే ఈ పత్రికకు కూడా తాము ప్రకటనలు ఇస్తున్నామని, అయితే ప్రెస్‌కౌన్సిల్ నిబంధనలు కూడా తుంగలో తొక్కి వార్తలు రాస్తూ, కనీసం వివరణలు కూడా ఇవ్వనిది ఈపత్రిక అన్నారు.తాము ఎందుకు మిగిలిన పత్రికలు మాదిరిగాదీనికి ప్రకటనలు ఇవ్వాలని, తాను వ్యక్తిగతం గా ఆలోచిసున్నానన్నారు. అయితే ఇది తన ఆలోచన మాత్రమే అని యనమల తెలియజేసారు. ఎక్సయిజ్ శాఖమంత్రి జవహార్ మాట్లాడుతూ టిడిపిలో వర్ల రామయ్య గానీ, తానుగానీ, డొక్కామాణిక్‌ప్రసాద్, కారెంశివాజీ, జూపూడి ప్రభాకర్‌లు వంటి నాయకులకు సముచితస్థానం ఉందని, వైఎస్ఆర్‌సిపిలో ఒక్క దళితనాయకుని పేరైనా ఆ పార్టీ వారు చెప్ప గలరా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు.నంద్యాలలోటిడిపి విజయం ఖాయమైందని, కాకినాడలో కూడా దళితులు టిడిపితోనే ఉన్నారని ఆయన తెలియజేసారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ టిడిపి నాయకులు బోళ్ళకృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్‌లో బ్రాందీ షాపు తొలగించాలి



ఏలూరు, మేజర్‌న్యూస్ : హనుమాన్ నగర్‌లో బ్రాందీ షాపు తొలగించాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం ఉద యం ఏలూరు మండలం వెంటాపురం పంచాయితీ హనుమాన్‌నగర్ మహిళలు ఏలూరు కలెక్టరేట్ వద్ద తమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బ్రాందీ షాపును తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యులు జి. విజయ లక్ష్మి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జిల్లా కేంద్రమైన ఏలూరులో మహిళలు తమ నివాసాల వద్ద బ్రాందీ షాపు పెట్టవద్దని ఆందోళన చేస్తుంటే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. హనుమాన్‌నగర్ ప్రధాన రహదారిలో ఈ మద్యం షాపు పెట్టారని ఈ రహదారి వెంబడి అనేక ప్రాంతాలకు మహిళలు, స్కూల్, కాలేజీ పిల్లలు నిత్యం వెళ్తుంటారని షాపువద్ద తాగుబోతులవల్ల వీరంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హనుమాన్‌నగర్ బ్రాందీ షాపు దగ్గర మరో బెల్టు షాపు నిర్వహిస్తున్నారని అక్రమంగా వేరే ఇంట్లో దాసిన మద్యం బాటిల్స్‌ను ఎక్సైజ్ అధికారులకు పట్టించిన ఇంటి యజమానిపై గాని, షాపు యజమానిపై గాని చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తక్షణమే మహి ళలకు ఇబ్బంది కలిగించే హనుమాన్‌నగర్ బ్రాందీ షాపు ను తొలగించాలని డిమాండ్ చేసారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని, అంబికాంబ, పార్వతి, మహంకాళి, పాపా రత్నకుమారి, ఫాతిమా, సుగుణమ్మ, కమలమ్మ, సీతామహాలక్ష్మి, శ్రీలక్ష్మి, లక్ష్మి, రామాయమ్మ, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, మణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలే జగన్‌కు గుణపాఠం కావాలి


- ఫ్యాక్షన్ రాజకీయాలు ఓటు హక్కుతో తరిమి కొడదాం
- నంద్యాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం
- టిడిపి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందాం
- భూమా విజయానికి ఆర్యవైశ్యులు అండగా ఉండాలి
- నంద్యాల ఎన్నికల ప్రచారంలో మంత్రి శిద్ధా రాఘవరావు

నంద్యాల, మేజర్‌న్యూస్ : పులి వెందుల మార్క్ రాజకీయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెక్ పెట్టనున్నారని, ఫ్యాక్షన్ రాజకీయాలు రాష్ట్రంలో తెరమరగు కానున్నాయని మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. నంద్యాలలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థికి మద్దతుగా నంద్యాల మర్చంట్ అసోసియేషన్, స్వర్ణకారుల సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నంద్యాల ప్రజలు అభివృద్ధికే పట్టం పట్టనున్నారని, తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలవనున్నారని తెలిపారు. నంద్యాలలో తాను విస్తృతంగా పర్యటించి గడపగడకు ప్రచారం నిర్వహించానని, నంద్యాల ప్రజలు అభివృద్ధిని కోరకుంటున్నారని మంత్రి తెలిపారు. నంద్యాలలో జగన్ 13 రోజుల ప్రచారం చేసినా జగన్‌ను విశ్వసించే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుంటే జగన్‌కు అవేవి కనిపించడం లేదని మంత్రి విమర్శించారు. చంద్రబాబు నాయుడు వాగ్ధానాలు చేయడమే కాదు వాటిని అమలు చేసి చూపిస్తారన్నారు. 1300 కోట్ల రూపాయలతో నంద్యాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత నివ్వడానికి రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడుకు ఆర్యవైశ్యలంటే అమితమైన ప్రేమ అన్నారు. చంద్రబాబు నాయుడు సముఖంగా ఉన్నారన్నారు. నంద్యాల అభివృద్ధికి శిల్పా చేసింది ఏమిలేదని అన్నారు. నంద్యాల ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టి తెదేపా అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు.

'బయోమెట్రిక్ విధానం పాటించాలి'




ఏలూరు, బ్యూరో మేజర్‌న్యూస్: పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజలకు సమర్ధ వంతమైన సేవలు అందించడానికి ఉద్యోగుల, అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు వేసి తీరాల్సిందేనని జిల్లా కలెక్టరు డా॥ కాటంనేని భాస్కర్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరు కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి అధికారుల సంప్రదింపుల సమావేశకమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అన్నీ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ఖచ్చింగా నిర్ధేశించిన సమయానికి బయోమెట్రిక్ హాజరువేసి తీరాలని ఏ ఉద్యోగి ఏసమయంలో హాజరు ఎక్కడ వేస్తున్నారో బయట కార్యాలయాలలో హాజరువేసి ఆఫీసుకు కావడంలేదా! వచ్చినా ఎంత ఆలస్యంగా వస్తున్నారో సమగ్ర సమాచారాన్ని సిద్దంచేయాలని ఇందుకు ప్రత్యేక నిబంధనలను ప్రతీ కార్యాలయానికి పంపించి వారం వారం తగు సమాచారాన్ని అందులో పొందుపరచాలని డా॥ భాస్కర్ జిల్లా అధికారు లను ఆదేశించారు. తాను ఎప్పుడు బదిలీ అవుతానా అంటే ఊహాగానాల్లో విహరించవద్దని తాను ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖచ్చితంగా పనిచేస్తానని తాను ఎక్కడికి వెళ్ళబోనని తన ఉద్యోగాన్ని ఖచ్చితంగా చేయనివ్వాలేతప్ప లేనిపోని పుకార్లతో కాలాన్ని గడపవద్దని డా॥ భాస్కర స్పష్టంచేశారు. టోక్యోలో ఇండియన్ అంబాసిడర్ కార్యాలయంలో జపనీస్ ఇతరులు కూడా పనిచేస్తుంటారని తాను ఒకరోజు స్వయంగా పరిశీలించానన్నారు. జిల్లాలోని 2500 పాఠశాలల్లో 15 రోజుల్లోగా బయోమెట్రిక్ హాజరుకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసి టీచర్ల హాజరు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు భాస్కర్ డిఇఒ గంగా భవానినీ ఆదేశించారు. చంద్రన్న భీమా పథకం క్రింద లబ్ధిదారులకు సకాలంలో పరిహారం అందేలా వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని పెండింగ్‌లో ఉన్న 29 ప్రతిపాదనలను పరిష్కరించాలని కలెక్టరు ఆదేశించారు.

కాపులను బీసీల్లో చేర్చకపోతే.. టీడీపీని గద్దె దించుతాం : అమరావతి కాపునాడు



విజయవాడ, సూర్యబ్యూరో : కాపులను బీసీలో చేర్చకపోతే తెదేపా ప్రభుత్వాన్ని గద్దె దించుతామని అమరావతి కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ (కబాడీ శ్రీను) హెచ్చరించారు. సోమవారం అమరావతి కావునాడు రాష్ట్ర నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఏ పార్టీకి సంబంధం లేదని చెప్పారు. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కావు, బలిజ, ఒంటరి కులాల ఎదుగుదలను చూసి ఓర్వలేక బీసీలో ఉన్నవారిని తొలగించారని ఆరోపించారు. నాటి నుండి అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో బీసీలో చేర్చుతామని, గెలిచిన తరువాత తమ గురించి పట్టించుకున్న వారిలేరని విమర్శించారు. 2014 ఎన్నికల్లో తమను గెలిపిస్తే బీసీలో చేరుస్తామని చెప్పిన బాబు 3సం॥లు గడిచినా కమిషన్ అంటూ సాగతీస్తున్నారని విమర్శించారు. నంద్యాల నియోజకవర్గంలో 40 వేలకు పైగా కావు, బలిజల ఓట్లు వుండటంతో సీఎం వారితో సమావేశం ఏర్పాటుచేశారని, ఇచ్చిన వాగ్ధానాన్ని గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. మంజునాథ్ కమిషన్ వేశామని సీఎం అంటుంటే బీసీల స్థితిగతుల గురించి వేశారంటూ మంజునాథ్‌లు చెబుతూ బాబు, మంజునాథ్‌లు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కావుల సంక్షేమం కోసం ముద్రగడ పద్మనాభం ఉద్యమం చేస్తుంటే ఆయనేదో తీవ్రవాదిలా 7వేల మంది పోలీసులను కిర్లంపూడిలో మోహరింప చేసి నిర్బంధించడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా నడుస్తోందని ఆరోపించారు. ఇటీవల ఒక సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారు, కావులను బీసీలో చేర్చుతున్నట్లు ప్రకటిస్తారు అని కావు కమిషన్ చైర్మన్ ఎస్సెమ్మెస్‌లు పంపారని, తీరా మీటింగ్‌లో న్యాయనిపుణులతో చర్చిస్తామని సీఎం చెప్పి మరోసారి కావులను మోసం చేసారని విమర్శించారు. కావు పిల్లల అభివద్ధి కోసం పాటుపడాల్సిన కావు సంఘాలు కొన్ని వారి స్వార్ధ ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలకు తాకట్టు పెడుతున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కావులను బీసీలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి పానక్ దేవ్, గౌరవాధ్యక్షులు పసువులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వెంపా సురేష్, సెక్రటరీ గెద్దం రామకష్ణ, జాయింట్ సెక్రటరీ మీసాల శ్రీకాంత్, బసవ నారా యణ, అప్పిశెట్టి నారాయణ, కనపర్తి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వానికి చిరంజీవి లేఖ



విజయవాడ, సూర్యబ్యూరో : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రాజ్యసభ ఎంపీ, ప్రముఖ సినీనటుడు చిరంజీవి సోమవారం లేఖ రాశారు. తిరుపతి 18వ వార్డులోని స్కావెంజర్స్ కాలనీని ఖాళీ చేయించడాన్ని ప్రశ్నిస్తూ ఆయన లేఖ రాశారు. గత 70 సంవత్సరాలుగా కావురం ఉంటున్న దాదావు 160 కుటుంబాల వారిని అక్కడనుంచి బలవంతంగా ఖాళీ చేయించడం అన్యాయమన్నారు. తిరుపతి నడిబొడ్డున ఆ కాలనీ ఉండటం ఇష్టంలేకనే బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ కాలనీ లో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడం కూడా జరిగింది. తిరుపతి నగరం నడిబొడ్డున స్కావెంజర్స్ కాలనీ ఉండటం ఈ ప్రభుత్వం సహించలేక పోతుందా? ఇది పూర్తిగా వివక్షపూరితమన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగిం చేందుకే ప్రభుత్వం ఆ కాలనీ వాసుల్ని ఖాళీ చేయిస్తోందని చిరంజీవి తన లేఖలో ఆరోపించారు. అక్కడి నిరుపేదలైన ఆ కుటుంబాల పట్ల మాన వతా దక్పథంతో వ్యవహరించాలన్నారు.


26న తెనాలికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాక



విజయవాడ, సూర్య బ్యూరో : ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈనెల 26న తెనాలి రానున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి అధికారిక సమాచారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ కోన శశిధర్, జిల్లా గ్రామీణ ఎస్పీ అప్పల నాయుడు హెలిపాడ్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య శత జయంతి సభలో పాల్గొనేందుకు ఉపరాష్ట్రపతి తెనాలి వస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు గవర్నర్ వచ్చే అవకాశముందన్నారు. కార్యక్రమ నిర్వాహకు రాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమతో మాట్లాడి కార్యక్రమ వివరాలు అడిగితెలుసుకున్నారు.



సూర్య




ధీర
VOICE OF WOMEN



మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సింద్రోమ్

రుతుక్రమం ప్రారంభమైననాటినుంచి ప్రతి నెలా మహిళలందరికీ ఇదో తప్పనిసరి దశ. అందరికీ అదో సాధారణ అంశం. కానీ కొందరికి మాత్రం అదో శాపం, ప్రవర్తనను సంపూర్ణంగా మార్చివేసి 'అసలు ఆమేనా ఈమె' అనుకునేలాంటి అభిప్రాయాన్ని కలిగించే దుస్థితి ఇది అందరిలోనూ కాకపోయినా..... ఆ కొందరుమాత్రం ఇంటిల్లిపాదినీ బాధిస్తారు. కాసింతసేపు వేధిస్తారు. తీవ్రతల్లో తేడా ఉండవచ్చేమోగానీ.... దాదాపు 80 శాతం మహిళల్లో ఎంతో కొంతమేర ఈ రుగ్మతతో బాధపడేవారే. అలా నెలసరికి ఐదు నుంచి ఏడురోజుల ముందు కొందరు మహిళలలో చోటు చేసుకునే మార్పులకు కారణమే...



ఏమిటీ సింద్రోమ్........?

తుఫాను ముందర కమ్ముకునే మబ్బుల్లా కొందరు మహిళల్లో పీరియడ్స్‌కి ముందు చోటుచేసుకునే లక్షణాలనే 'ప్రీ మెన్‌స్ట్రువల్ సింద్రోమ్. స్త్రీలలో రుతు క్రమం మొదలైనప్పటినుంచి మెనోపాజ్ దశ వరకు ఈ లక్షణాలు కోనసాగుతాయి. ఈ సింద్రోమ్ శారీరక, మానసిక భావోద్వేగాల మయం. అంతకు ముందెన్నడూ లేని విధంగా కొంతమంది మహిళలు తమ స్వభావాలకు విరుద్ధంగా, విచిత్రంగా ప్రవర్తించడానికి కారణం ఇదే.

వైరుధ్యం... విచిత్రం... వైపరీత్యం...

ఈ సింద్రోమ్ లక్షణాలు అందరు స్త్రీలలో ఒకే విధంగా ఉండవు. కొంతమందిలో శారీరీకమైన రుగ్మతలు ఎక్కువ గా ఉంటాయి. మరికొందరిలో మానసిక, శారీరకమైన ఇబ్బందులు రెండూ ఉంటాయి. కొంతమంది మహిళలకు మాత్రం ఇటువంటి లక్షణాలేవీ కనపడకుండానే నెలసరి మామూలు రోజులలాగే సాఫీగా గడిచిపోతుంది. ఈ విషయంలో వారు అదృష్టవంతులనే చెప్పవచ్చు. కొందరిలో ఈ లక్షణాలు సాధరణంగా రుతుస్రావం మొదలైన తరువాత ఉండవు. కానీ విచిత్రంగా మరికొంతమందిలో మాత్రం రుతుస్రావం జరిగే రోజులలో కూడా ఈ లక్షణాలు కొనసాగవచ్చు - మామూలు ఇబ్బందైతే పర్లేదు..... కానీ ఈ లక్షణాలు చాలా తీవ్రస్థాయిలో ఉండి దైనందిన జీవనంలో అనేక ఆటంకాలకు కారణమవుతుంటే దానిని 'ప్రీ మెన్‌స్ట్రువల్ డిస్ ఫోరిక్ డిసార్డర్- పిఎడిడీ' అంటారు. ఇలాంటివారు తప్పనిసరిగా వైద్యసహాయం తీసుకోవాలి.

కుటుంబానికి చెందిన వారెవరికైనా ఇలాంటి రుగ్మత ఉంటే ఆ కుంటుంబంలోని మిగతా మహిళలూ పి.ఎం.ఎస్ బారిన పడే అవకాశం ఎక్కువ. ఈ సింద్రోమ్ పీడితులు అవునో, కాదో తెలుసుకోవాలనుకుంటే ఎవరికి వారే ఓ పరీక్ష చేసుకోవచ్చు. కనీసం రెండు రుతుక్రమాలు వచ్చే ముందూ, వచ్చిన తరువాత మీ ప్రవర్తనను క్రింద ఇచ్చిన లక్షణాలతో సరిచూసుకోండి.

శారీరక మార్పులు....

★రుతుక్రమ సమయంలో ఆకలి మందగించడం.

★తలనొప్పి, కాళ్ళు, చేతులపై చెమటలు పట్టడం.

★పొత్తి కడుపు, నడుము నొప్పి.

★రొమ్ముల్లో సలుపు (బ్రెస్ట్ టెండర్‌నెస్).

మానసిక మార్పులు...

★చికాకు, నిస్పృహ, ఆత్రుత, అస్పష్టత, కంగారు.

★తీవ్రమైనఒత్తిడికిలోనుకావడం.

★ఒంటరిగా ఉండాలనుకోవడం.

★ఏ పని చేయాలనిపించకపోవడం.

నిజానికి ఆ సమయంలో శారీరకంగా కలిగే సమస్యల కంటే మానసిక ఉద్వేగాలతో వచ్చే సమస్యలే మహిళ లను ఎక్కువగా బాధిస్తాయి.

చేయాల్సిందిదే.....

ఈ సమయలో నడుంనొప్పి, కడుపునొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్స్ వేసుకుంటే సరిపోతుంది. దాంతో పాటు ఈ క్రింది జాగ్రత్తలను కూడా పాటిస్తే మరికొంత మేలు చేకూరుతుంది.

★ఆహారపు అలవాట్లలో, జీవనశైలిలో కాస్తమార్పు చేసుకుంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటుంది.

★పాలూ, పాలతో తయారయ్యే ఆహార పదార్థాలు తక్కువగా తీసుకోవాలి.

★అలాగే.... కొవ్వు పదార్థాలు తక్కుగా ఉండే ఆహారం తీసుకోవడాం కూడా అవసరం.

★కాఫీ, టీ, చక్కెర, ఉప్పు వంటివి తగ్గించాలి.

★పీచుపదార్థాలు, ప్రోటీన్లు (పప్పుధాన్యాలు) ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి.

★కాల్షియం, విటమిన్ - ఇ టాబ్లెట్లు వాడితే మంచి ప్రయోజనం ఉంటుంది. అయితే వీటిని విధిగా డాక్టర్ సలహా మేరకే వాడాలి. తీసుకోవాల్సిన మోతాదు కూడా డాక్టరే నిర్ణయిస్తారు.

మరికొన్ని మార్గాలు...

మందులతో మాత్రమేకాకుండా అందరూ వివిధ రకాలైన వ్యాయామంతోనూ ఈ బాధల నుంచి ఉపశమనం పొందవచ్చు. వీలైనంత వరకు లైట్ ఏరోబిక్ ఎక్సర్ సైజ్‌లు చేయడం వల్ల కొంత సాంత్వన చేకూరుతుంది. కోపం, విసుగు, చికాకు కలిగించే వాతావరణానికి దూరంగా ఉండాలి. మంచి సంగీతం వినడం, అభి రుచులకు తగిన పనులు చేయడం వల్ల చికాకు తగ్గి ప్రశాంతత చేకూరుతుంది. నెలలో మిగిలిన రోజులలో కూడా ఆహారపు అలవాట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. అయితే సమస్య తీవ్రంగా ఉందంటే మాత్రం...... ఈ సింద్రోమ్‌తో బాధపడుతూ, చుట్టూ ఉన్న వారిని బాదపెడుతూ ఉండటం కంటే డాక్టర్ని సంప్రదించడం మంచిది. అందు బాటులో చికిత్స ఉన్నప్పుడు అనవసరంగా బాధలు అనుభవించడం సరికాదు కదా.

పి.ఎం.ఎస్ లక్షణాలు ఉంటే వాటిని నియంత్రించు కోవడం ప్రతి మహిళకు సాధ్యంకాకపోవచ్చు. ఆ లక్షణాల తీవ్రతనుబట్టే ఆమె ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. అలాంటంప్పుడు ఆమెకు కావల్సింది ఆమెను అర్థం చేసుకునే మనసు. అండగా నిలిచే కుంటుంబ సభ్యుల ఆలంబన.

అందుకే... ఆమె చుట్టూ ఉన్న వాతావరణాన్ని ప్రశాంతంగా సంతోషంగా ఉంచగలిగితే ఆమెకు కొంత ఊరటని అందించిన వారవుతారు. అంతేకాదు... వీలయినంత వరకు ఆ సమయంలో ఇంటి పనులలో మిగతా కుటుంబ సభ్యుల సాయం అందితే శారీరకంగా ఆమె శ్రమ చాలా వరుకు తగ్గుతుంది. ఇక ఉద్యోగం చేసే మహిళలకు ఆసమయం నరకమే. వీక్‌లీ ఆఫ్ బదులు ఆ మూడు రోజులు మంత్‌లీ ఆఫ్‌లు ఉంటే బాగుండు అనుకోవడం కొందరిలో మామూలే. బస్సులో ప్రయాణం చేసి, ఆఫీస్‌లో అన్ని గంటలు పనిచేసి వచ్చిన మహిళ మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవలసిన బాధ్యత కుటుంబ సభ్యులదే. ఇవన్నీ సహజంగా జరిగే మార్పులే. అయితేనేం... వాటి వెనుక కారణం రుతుక్రమమే అనే విషయం ఆమె మరిచిపోయే అవకాశాలు ఎక్కువ. అందుకే ఆ సమయంలో కుటుంబ సభ్యులు సరైన తోడ్పాటును ఆందించగలిగితే మహిళలు మానసికంగా కొంత స్థిమితపడతారు.

బనానా ఫేషియల్

చూడగానే ఆకట్టుకునే రూపాన్ని అందరూ కోరుకుంటారు. మనిషిని చూడగానే ముందుగా ఆకట్టుకునేది ముఖం దీనిని తాజాగా, అందంగా ఉంచుకోవడానికి రకరకాల క్రీములు ఇప్పుడు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి, ప్రకృతి సిద్ధంగా లభించే మూలికలతో లభించే క్రీములు బోలెడు వున్నాయి. మూలికలతో పాటు పళ్లు ప్రకృతి మనకు ఇచ్చిన వరం.

అరటితో అందం...

ఫేస్‌ప్యాక్‌లకి, ఫేషియల్‌కి పళ్లు ఎంతో ఉపయోగపడతాయి, వాటిల్లో అరటిపండుతో ఫేషియల్ ముఖారవిందాన్ని రెట్టింపు చేస్తుంది.

అరటిపండు మనకు సహజ సిద్ధంగా లభించే ఫలం దీనిలో అనేక పోషక విలువలు ఉంటాయి. అలాంటి అరటి పండుతో ఫేషియల్ చేసుకుంటే మీ ముఖారవిందం ఎంతో అందంగా తయారవుతుంది.

ముందుగా ముఖాన్ని శుభ్రంగా కడుకున్న తరువాత అరటిపండు గుజ్జుని ముఖం అంతా సమానంగా పట్టించి ఐదు నిమిషాలపాటు అలానే వుంచుకోవాలి, మీది జిడ్డు చర్మం అయినా, ముఖం మీద నల్లటి మచ్చలు వున్నా, రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఫేషియల్ స్టీమ్ తీసుకోవాలి. ఫేషియల్ స్టీమ్ వలన చర్మం మృదువుగా మారుతుంది. ఇప్పుడు అరటిపండు తొక్కతో ముఖం మీద తేలికగా రబ్ చేస్తూ చర్మంలో వున్న మృత కణాలను తొలగించాలి.

మృతకణాల తొలగింపు అయిపోయిన తరువాత అరటి - కోకో బటర్ (మసాజ్ క్రీమ్) కలిపి మృదువుగా పది నుంచి పదిహేను నిమిషాలపాటు మసాజ్ చేయాలి.

న్యూట్రిషన్ విలువలున్న వీటి వలన ఎండిపోయినట్టు వున్న చర్మం మృదువుగా మెత్తగా అవుతుంది. చివరగా బనానా పాక్‌ను ముఖానికి... మెడకి పట్టించి 15 నిమిషాలపాటు అలానే వుంచేయాలి, ఆ తరువాత గోరు వెచ్చని నీటితో ముఖాన్నిశుభ్రం చేసుకొని మెత్తటి టవల్‌తో తుడుచుకుంటే ముఖం అందంగా కనబడుతుంది.



పూవులతో ఇంటిని ఇలా తీర్చిదిద్దండి

ఇంటిని తాజా పూవులతో అలంకరిం చుకోవాలని చాలామందికి ఉం టుంది. కాకపోతే పూవులు అలంకరించిన కొద్ది గంటలకే కనీసం ఫంక్షన్ ప్రారంభం కాకముందే వాడిపోయినట్లు కనిపిస్తాయి. అలా కాకుండా తాజాగా ఎక్కువ సేపు ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

సాయంత్రమే కోసుకోవాలి...

పువ్వులు సాయంత్రం పూటే కోసుకోవాలి. కోయగానే మంచినీటిలో ఉంచాలి. పూవుల కాడలు కత్తిరించే ముందు మంచినీటిలో ఉంచిన తర్వాతనే కత్తిరించాలి. అలా చేస్తే పువ్వులు ఎక్కువసేపు తాజాగా ఉంటాయి.

గులాబీ పూవులను వాడేటప్పుడు...

గులాబీ పూవులతో అలంకరణ చేయాలనుకుంటే ముందుగా వాటి కాడల్ని ఒకసారి వేడినీటిలో ఉంచి వెంటనే తీసి చల్లని నీటిలో ఉంచాలి.

అలంకరణ కోసం పాలుగారే కొమ్మల్ని ఎంచుకుంటారు కొందరు. వాటిని నేరుగా వాడకూడదు. ముందుగా ఆ కొమ్మల్ని సన్నని సెగపై కాల్చి ఆ తర్వాతనే వాడాలి.



గదులను బట్టి...

పుష్పాలంకరణ చేయగానే సరిపోదు. ముందుగా గదుల విస్తీర్ణం, వాటిని ఏ స్థలంలో అలంకరణ చేయాలి. వాటి బ్యాక్‌గ్రౌండ్ ఎలా ఉండాలి. అవి అందరికీ నచ్చుతాయాలాంటి విషయాలపై అవగాహన ఉండాలి. గదులను బట్టి అలంకరణ అనేది ఉండాలి. విశాలమైన స్థలం ఉన్న గదులలో రెండు రకాల అలంకరణలు చేసేటప్పుడు రెండూ పక్కపక్కనే ఉండకుండా దూరంగా ఉండేలా చూసుకోవాలి. రెండు అలంకరణలు కూడా విభిన్నంగా కనిపించాలి.



ఎండవేడి తగలకుండా...

పువ్వులకు సాధ్యమైనంతవరకూ ఎండ వేడిమి తగలకుండా చూసుకోవాలి. అలా చేస్తే కొమ్మలు వాడిపోయినట్లు కనిపించి చూసేవారికి అలంకరణ హీనంగా కనిపిస్తాయి. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పువ్వులతో అలంకరణ ఇంటికి చక్కని శోభ నిస్తుంది. ఫంక్షన్లో కూడా పదిమందీ మీరు చేసిన అలంకరణపై దృష్టిని కేంద్రీకరిస్తారు. మిమ్మలను అభినందలనలో ముంచెత్తుతారు.



HAPPY BIRTHDAY

మెగాస్టార్
చిరంజీవి' ఇది జస్ట్ పేరు కాదు.. సినీ రంగంలో ఓ ప్రభంజనం. ఎందరో నటీ నటులకు ఊపిరి పోసిన ఇన్స్పిరేషన్ పర్సనాలిటీ, వందలు కాదు వేలు కాదు లక్షల ప్రశంశలు అందుకున్న స్టార్, దాదావు 45 ఏళ్ళ సినీ చరిత్రలో తన గురించి ఎంత చెప్పినా ఎంత విన్నా తక్కువే.. ఒక వైవు నటన, మరో వైవు మెగా సేవా కార్యక్రమాలు, ఇంకో వైవు రాజకీయం ఇలా ఏకోణం లో చూసినా జగదేకవీరుడిగా పేరు గడించాడు మెగాస్టార్. ఇక అసలు విషయానికి వస్తే చిరు చాలా గ్యాప్ తీసుకున్న తరువాత తమిళ రీమేక్‌తో ఖైదీ నెంబర్ 150 చిత్రం చేసి కాసుల సునామి సృష్టించిందనే విషయం అందరికీ తెలిసినదే అయితే ఈ మెగాస్టార్‌కు నేటితో 62 సంవత్సరాలు పూర్తయ్యి 63 వసంతాలు రానున్నాయి. ఈ సందర్భంగా మెగా అభిమానులకు ఓ కానుక ఇవ్వనున్నారు ఏంటంటే... చిరు తన కెరీర్‌లో ఇంతవరకు పూర్తి స్థాయి చారిత్రాత్మక చిత్రం చేయలేదు. 1983 సంవత్సరంలో వచ్చిన 'శివుడు శివుడు శివుడు' అనే సినిమాలోని పాత్ర కొంత వరకు కనిపించినా ఆ తరువాత చాలా మటుకు కమర్షియల్ ఎలెమెంట్స్ ఉన్న పాత్రల్లోనే కనిపించారు. అయితే

మకుటం లేని ఇంద్రుడు
మెగాస్టార్

ఇప్పుడు ఇంత కాలానికి సరికొత్తగా 151 చిత్రంగా కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్ పై చిరు తనయుడు రామ్ చరణ్ నిర్మిస్తున్న ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి అనే జీవిత చారిత్రాత్మక చిత్రంలో నటిస్తున్నారని, ఈ చిత్ర పూజా కార్యక్రమాలు మొన్నీమధ్య జరువుకున్నారని కూడా మనకు తెలిసిందే... సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను చిరంజీవి వుట్టిన రోజు కానుకగా విడుదల చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ గుర్తింవు సినిమాగా తీర్చి దిద్దేందుకు సన్నాహాలు చేస్తునట్టు సమాచారం. మరో వైవు ఈ సినిమాకు జక్కన్న రాజమౌళి హ్యాండ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతి త్వరలో ఈ చిత్ర షూటింగ్ మొదలు కానుంది. బ్రేకులు లేకుండా సినిమా పూర్తి చేయడానికి చరణ్ ప్లాన్ చేస్తున్నట్టు వినపడుతోంది. ముగ్గురు హీరోయిన్‌లు మెగా స్టార్ ప్రక్కన నటిస్తున్నట్లు కూడా చెర్రీ తెలిపారు. మొత్తానికి మెగా అభిమానులకు తమ అభిమాన హీరో కొత్త తరహా పాత్రలో కనిపించి కనువిందు చేయనున్నాడని తెగ సంబర పడుతున్నారు అంతా..

ప్రస్తుత సినీ రంగంలో చారిత్రాత్మక చిత్రాల హవా నడుస్తోంది. బాహుబలి, బాలీవుడ్ బాజీరావు మస్తానీ , బాలకృష్ణ గౌతమిపుటత్ర శాతకర్ణి, ఈ తరహా చిత్రాలు మెగాస్టార్ ఇన్సిరేషన్‌గా భావించి ఇంత కాలానికి వెరైటీ లుక్ లో కనిపిస్తున్నారు కాబోలు. ఏది ఏమైనా మెగాస్టార్ సినీ చరిత్రకు తిరుగులేని ఇంద్రుడే.. నేడు మెగాస్టార్ వుట్టినరోజు కావడంతో సూర్య దిన పత్రిక తరువున జన్మదిన శుభాకాంక్షలు.

భరత్ అను నేను చిత్రానికి ఆటంకమా?

శ్రీమంతుడు లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తరువాత మహేష్ బాబు, కొరటాల కాంబినేషన్ లో వస్తున్న చిత్రం 'భరత్ అను నేను' శ్రీమంతుడు సినిమా లో ఒక ఊరిని దత్తత తీసుకునే పాత్రలో కనిపిస్తే ఇప్పుడు భరత్ అను నేను చిత్రంలో ఏకంగా ముఖ్యమంత్రి పాటలో కనిపించున్నాడు ప్రిన్స్. ఈ చిత్రంలో మహేశ్‌కి బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వాణీ జోడీ కడుతుండగా ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. డివివి దానయ్య ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా అటుంచితే ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శర వేగంగా జరువుకుంటోంది. ఈ చిత్రంలోని కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలను ఉత్తర్‌ప్రదేశ్‌లోని మూసాబాఘ్, జహంగీరాబాద్ ప్యాలెస్ వంటి చరిత్రాత్మక ప్రాంతాల్లో చిత్రీకరించాలని చిత్రబృాఎందం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యం లోనే చిన్న చిక్కొచ్చి పడింది. ఈ చిత్రీకరణకు ఏఎస్ఐ(ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా)అధికారులు ఒప్పుకోలేదట. యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించే క్రమంలో భవనాలు దెబ్బతినే అవకాశం ఉందని అందుకే షూటింగ్‌కి ఒప్పుకోలేదని చిత్రవర్గాల సమాచారం.





మమ్మలన్ని అలా చూడటం నచ్చలేదు



టాలీవుడ్- కోలీవుడ్- బాలీవుడ్ -హాలీవుడ్ ఇలా ఏ సినీ వుడ్ అయినా హీరోలకే రెమ్యూనరేషన్ ఎక్కువగా ఉంటాయి.. నిర్మాతలు కూడా దీనికి ఫిక్స్ అయివుంటారు. హీరో తరువాత ఎవరెంత కష్ట పడి నటించినా వారి స్థాయికి తగ్గ రెమ్యూనరేషన్ స్తుంటారు. ఈ విషయం లో కొంత మంది పట్టించుకున్నా పెద్దగా నోరు తెరచి చెప్పారు కానీ బాలకృాఎష్ణ తో లెజెండ్, లయన్ సినిమాలలో నటించిన హాట్ బ్యూటీ రాధికా ఆప్టే కు మాత్రం కోపమొచ్చింది. రాధిక రీసెంట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం పై రియాక్ట్ అవుతూ ఈ రోజుల్లో హీరోలను చూస్తున్నట్టు ఇతర నటీనటులను చూడటం లేదని ముఖ్యంగా హీరోయిన్స్ ఎంత కష్టపడుతున్నా వారికి హీరోల స్థాయిలో ఆదరణ దక్కడం లేదని చెప్పింది. ఆమె నటించిన చాలా సినిమాల్లో హీరోతో సమానంగా కష్టపడినా హీరోకు ఇచ్చిన స్థాయిలో తనకు రెమ్యునరేషన్ ఇవ్వలేదంటూ..వాపోయింది. ఇదే తరహాలో తనతో క్లోజ్ గా ఉన్న మరో ముగ్గురు టాప్ హీరోయిన్స్ పరిస్థితీ కూడా నాలానే ఉందని చెప్పింది. సల్మాన్ లాంటి సూపర్ స్టార్స్ తో నటిస్తున్న దీపికా పదుకొనె- ప్రియాంక చోప్రా వంటి వారిని యాక్టర్స్ గానే చూస్తున్నారని, అంతే కాకుండా ప్రస్తుతం ఈ సినిమా వ్యవస్థలో ఇది ఒక ఫోబియా లాగా ఉందని పబ్లిక్ కూడా హీరోయిన్స్ ను అదే స్థాయిలో చూడటానికి అలవాటుపడిపోయారని చెప్పుకొచ్చింది.

మరి రాధికా చేస్తున్న వ్యాఖ్యలు కూడా ప్రస్తుతం కొంత ఆలోచించే తరహాలోనే ఉంది. కానీ హీరోయిన్స్ స్పెషల్ రోల్స్ చేస్తే వారికి కూడా ప్రేక్షకులు ఆదరించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా లేడి ఓరియెంటెడ్ మూవీస్ తీసినప్పుడు వారికి సూపర్ స్టార్ మర్యాదలు కూడా ఇస్తున్నారు. ఈ విషయాలు కొన్ని తెలియక ఇలా అనేసిందేంటని కొందరు నాలుక కరుచుకున్నారు.

ఇవీ కుదరక పోతే ఇక అదే చేస్తుందట

శ్రీమంతుడు లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తరువాత మహేష్ బాబు, కొరటాల కాంబినేషన్ లో వస్తున్న చిత్రం 'భరత్ అను నేను' శ్రీమంతుడు సినిమా లో ఒక ఊరిని దత్తత తీసుకునే పాత్రలో కనిపిస్తే ఇప్పుడు భరత్ అను నేను చిత్రం లో ఏకంగా ముఖ్యమంత్రి పాటలో కనిపించున్నాడు ప్రిన్స్. ఈ చిత్రంలో మహేశ్‌కి బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వాణీ జోడీ కడుతుండగా ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. డివివి దానయ్య ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా అటుంచితే ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శర వేగంగా జరువుకుంటోంది. ఈ చిత్రంలోని కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలను ఉత్తర్‌ప్రదేశ్‌లోని మూసాబాఘ్, జహంగీరాబాద్ ప్యాలెస్ వంటి చరిత్రాత్మక ప్రాంతాల్లో చిత్రీకరించాలని చిత్రబృాఎందం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యం లోనే చిన్న చిక్కొచ్చి పడింది. ఈ చిత్రీకరణకు ఏఎస్ఐ(ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా)అధికారులు ఒప్పుకోలేదట. యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించే క్రమంలో భవనాలు దెబ్బతినే అవకాశం ఉందని అందుకే షూటింగ్‌కి ఒప్పుకోలేదని చిత్రవర్గాల సమాచారం.

దీపికా వద్దూ.... అంటున్నా వినడం లేదట



గ్లామర్ ఫీల్డ్‌లో కొందరు ప్రేమించుకున్నారంటే ఆజంట ఇక ఏమాత్రం ఆగకుండా చెట్టాపట్టాలేసేసుకొని తెగ తిరగడమే కాకుండా వాళ్ళ సీక్రెట్ ఫొటోస్ కూడా లీక్ చేసేస్తూ హలచల్ చేస్తుంటారు.. వాటి వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు కానీ ఓ ప్రేమ జంట ఇలా తిరగడం నచ్చలేదని ఓ దర్శకుడు చిన్నబుచ్చుకున్నాడట.. వివరాల్లోకెళితే బాలీవుడ్ స్టార్స్ దీపిక పదుకొణె, రణ్‌వీర్ సింగ్ ప్రేమించు కున్నట్లు కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. వీరిద్దరూ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా వారు చేసే పనులు చూస్తే ఎవ్వరైనా ఇద్దరినీ ప్రేమికులనే అనుకుంటారు. అందుకు ఉదాహరణ రణ్ వీర్ తన వుట్టిన రోజు నాడు కొత్తకారులో దీపికను బయటికి తీసుకెళ్లడమే.

అదీకాకుండా ఇటీవల రణ్‌వీర్, దీపిక ముద్దాడుతున్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వెరల్ అయింది. అయితే వీరిద్దరూ ఇలా కలిసి తిరగడంతో బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే భన్సాలీ దర్శకత్వం లో రణ్‌వీర్, దీపిక, షాహిద్ కవూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం పద్మావతి.

ఈ చిత్రంలో రణ్‌వీర్, దీపిక మధ్య ఎలాంటి సంభాషణలు, సన్నివేశాలు ఉండవు. దాంతో రణ్‌వీర్, దీపిక అభిమానులు ఇప్పటికే దీనిపై ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారట. ఇద్దరినీ తెరపై కలిసుండడం చూడాలనుకుంటున్నామని అంటున్నారట. మరోవెవు సినిమా చిత్రీకరణ పూర్తయ్యేంతవరకు ఇద్దరూ కలిసి తిరగ కూడదని భన్సాలీ దీపికకు ఆంక్షలు విధించారని కూడా తెలిసింది. అయినా ఆయన మాటలు పట్టించుకోకుండా రణ్‌వీర్, దీపిక తరచూ కలుసు కుంటూ ఉండడంతో భన్సాలీ వారిపై అలిగారట. మిగతా సందర్భాల్లో వారిద్దరూ ఎలా ఉన్నా తనకు అభ్యంతరం లేదని కనీసం చిత్రీకరణ పూర్తయ్యేవరకైనా తాను చెప్పినట్లు నడుచు కుంటే బాగుంటుందని భన్సాలీ తెలిపారు. ఈ పద్మావతి చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

❀అందుకు ఉదాహరణ రణ్ వీర్ తన వుట్టిన రోజు నాడు కొత్తకారులో దీపికను బయటికి తీసుకెళ్లడమే.

❀ఇద్దరినీ తెరపై కలిసుండడం చూడాలనుకుంటున్నామని అంటు న్నారట. మరోవెవు సినిమా చిత్రీకరణ పూర్తయ్యేంతవరకు ఇద్దరూ కలిసి తిరగ కూడదని భన్సాలీ దీపికకు ఆంక్షలు విధించారని కూడా తెలిసింది.

❀అందుకు ఉదాహరణ రణ్ వీర్ తన వుట్టిన రోజు నాడు కొత్తకారులో దీపికను బయటికి తీసుకెళ్లడమే.

❀మిగతా సందర్భాల్లో వారిద్దరూ ఎలా ఉన్నా తనకు అభ్యంతరం లేదని కనీసం చిత్రీకరణ పూర్తయ్యేవరకైనా తాను చెప్పినట్లు నడుచు కుంటే బాగుంటుందని భన్సాలీ తెలిపారు.

ఆనందో బ్రహ్మ విజయోత్సవ వేడుక



తాప్సి పన్ను ప్రధానపాత్రలో శ్రీనివాస్ రెడ్డి, వెన్నల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ కలసి నటించి మెప్పించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ' మహి రాఘవన్ దర్శకత్వం లో 70ఎం ఎం ఎంటర్టైన్మెంట్స్ పతాకం పై విజయ్ చిల్లా, శశి రెడ్డి లు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం గత శుక్రవారం విడుదలయ్యి ప్రేక్షకాదరణ పొందడం తో ఈ చిత్ర యూనిట్ విజయోత్సవ వేడుకను జరువుకున్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ దెయ్యాలు మనుషులను చూసి పయపడే కాన్సెప్ట్ చాలా కొత్త గా ఉంది. ఈ చిత్రం విడుదలైన మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ ను పొందింది. మంచి కలెక్షన్స్ కూడా వస్తున్నాయి. ఈ రోజుల్లో చిన్న సినిమాలు ఆడడం ఎంత కష్టమో తెలిసిందే.. కానీ ఈ చిత్రం విజయం వైపు పరుగెడడం ఈ చిత్ర యూనిట్ కు ఆనందకరమైన విషయమే. అందరికీ నా అభినందనలు అని తెలిపారు. అనంతరం దర్శకుడు మహి మాట్లాడుతూ డిఫరెంట్ కాన్సెప్ట్ తో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ నా కృాఎతజ్ఞతలని తెలిపారు. ఈ చిత్రానికి హీరో తాప్సి అని చెప్పొచ్చు.. తను దగ్గరుండి అన్ని విషయాలు చూసుకుంది. దర్శకుడు మహి సినిమాను అందరికీ నచ్చేలా తెరకెక్కించాడు, రెండు రాష్ట్రాల్లో భారీ కలెక్షన్స్ వస్తున్నాయి, వర్సెస్ లో విడుదలైన 85 థియేటర్లలో సినిమా విజయం సాధించి మంచి కలెక్షన్స్ వస్తుండడం ఎంతో ఆనందంగా ఉందంటూ నిర్మాత విజయ్ తెలిపారు. తాప్సి మాట్లాడుతూ నా కెరీర్ లోనే ఈ చిత్రం ఒక స్పెషల్. నేను ఊహించినట్టుగానే చిత్రం విజయం సాదించినందుకు సంతోషం గా ఉందంటూ చెప్పారు. ఈ విజయోత్సవ వేడుకలో దర్శకుడు మహి, నిర్మాత విజయ్, తాగుబోతు రమేష్, రాజీవ్ కనకాల తది తరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్మార్ట్‌ఫోన్ కోసం పందెం కట్టిన యువకుడు

నదిలోకి దూకి ప్రాణాలు కోల్పోయాడు

లాహోర్ : ప్రవహిస్తున్న నదిని ఈత కొడుతూ దాటితే రూ. 15 వేలతో పాటు స్మార్ట్ ఫోన్ కూడా ఇస్తానని స్నేహితులు పందెం కాయడంతో నదిలోకి దూకి ప్రాణాలు కోల్పోయాడు ఓ పాకిస్తానీ యువకుడు. పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో గుజ్రాన్‌వాలా ప్రాంతానికి చెందిన అలీ అక్బర్ పందెం విషయంలో స్నేహితులు బలవంతం చేయడంతో జోరుగా ప్రవహిస్తున్న జీలం నదిని ఈదడానికి ప్రయత్నించి నదిలో కొట్టుకుపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్‌లో ఉంది. ఇందులో నదిలో దూకడానికి ముందు అలీకి, తన స్నేహితులకు మధ్య ఏదో సంభాషణ జరుగుతుండడం చూడవచ్చు. తరువాత నీళ్లలోకి దూకిన అలీ ప్రవాహ ధాటికి కొట్టుకుపోవడం కూడా చూడవచ్చు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో అలీ మృతదేహం ఇంకా లభించలేదని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అలీ స్నేహితులు ఒసామా, తల్హా, జెషన్, షోయబ్, రాహత్‌లను అదుపులోకి తీసుకున్నట్లు వారు చెప్పారు. గతంలో కూడా ఈ ప్రదేశంలో ఐదుగురు టూరిస్టులు నదిలో కొట్టుకుపోయినా, ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులూ పెట్టలేదని స్థానికులు వెల్లడించారు.

సింగపూర్ సముద్రంలో ఘోర ప్రమాదం

ఢీకొన్న నౌకలు: 10 మంది అమెరికా నావికుల గల్లంతు

సింగపూర్ : సింగపూర్ సముద్ర జలాల్లో జరిగిన ప్రమాదంలో అమెరికాకు చెందిన పది మంది నావికులు గల్లంతయ్యారు. వారి కోసం రెస్క్యూ సిబ్బంది వెతుకులాట ప్రారంభించారు. అమెరికా యుద్ధ నౌక యుఎస్ఎస్ జాన్ ఎస్ మెక్‌కెయిన్ ప్రమాదవశాత్తు వాణిజ్య నౌక అల్నిక్ మెకెను ఢీకొంది. తూర్పు సింగపూర్‌లోని మలాకా జల సంధి వద్ద ఆదివారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగినట్లు అమెరికా నేవీ వెల్లడించింది. ఈ ఘటనలో జాన్ ఎస్ మెక్‌కెయిన్ నౌక దెబ్బ తిన్నట్టు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ప్రమాదం తరువాత పది మంది నావికులు కనిపించకుండా పోగా, ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు.

విలీనం ఓకే! అదే మిలియన్ డాలర్ క్వశ్చన్

- తమిళనాడులో అధికార అన్నా డీఎంకే పార్టీలో పన్నీర్‌సెల్వం వర్గం విలీనం
- మద్దతుగా ఉన్న 20 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలతో మదురైలో ర్యాలీ
- తమిళనాట సంచలనంగా మారిన పళని స్వామి, పన్నీర్‌సెల్వం
- పంతం నెగ్గించుకున్న పన్నీర్ సెల్వం ఏం చేస్తారో?



చెన్నై : తమిళనాట సంచలనంగా మారిన పళని స్వామి, పన్నీర్‌సెల్వం వర్గాల విలీనంపై శశికళ వర్గం స్పందించింది. 'విలీనం సంతోషమే... కానీ తమను (టీటీవీ దినకరన్, సరస్వతి) ఎందుకు దూరం పెడుతున్నారు' అని ఏఐఏడీఎంకే నేత సిఆర్ సరస్వతి ప్రశ్నించారు. అదే మిలియన్ డాలర్ల క్వశ్చన్ అని ఆమె మండిపడ్డారు. ముఖ్యమంత్రి జయలలిత మరణం తరువాత తమిళ రాజకీయాల్లో అనేక కీలక పరిణామాలు సంభవిస్తున్నాయి. తాజాగా మరో కీలక మార్పునకు నాంది పడింది. రాష్ట్ర రాజకీయాల్లో ఎలా అయినా పాగా వేయాలని భావించిన శశికళ 'చిన్నమ్మ' వరుస చిక్కుల్లో చిక్కుకుంటుండగా తాజా పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా అన్నా డీఎంకే పార్టీని చీల్చి, భంగపడిన మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం దిగి వచ్చి పళని స్వామితో ఒక అంగీకారాన్ని కుదుర్చుకున్నారు. ఈ మేరకు సోమవారం తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి విలీనానికి ఇరు వర్గాలు అంగీకరించినట్టు సోమవారం అధికారింగా ప్రకటించారు. అనంతరం ఇరువురు నేతలు ఎంజిఆర్ మెమోరియల్, మెరీనా మెమోరియల్‌ను సందర్శించి దివంగత మాజీ ముఖ్యమంత్రికి, అమ్మ జయలలితకు నివాళులు అర్పించారు. అలాగే పార్టీ పదవిలో నుంచి శశికళ తొలగించడంపై పార్టీ జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించనున్నట్టు ఒక ప్రశ్నకు సమాధానంగా పళని స్వామి తెలిపారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం ప్రమాణ స్వీకారం చేయగా, పన్నీరు సన్నిహితుడు పాండ్యరాజన్ కూడా కొత్త క్యాబినెట్‌లో మంత్రిగా చేరారు.

దినకరన్ సేఫ్... అందుకే?

తమిళనాడులో అధికార అన్నా డీఎంకే పార్టీలో పన్నీర్‌సెల్వం వర్గం విలీనం పూర్తయింది. శశికళ, దినకరన్ భవితవ్యంపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. వీరిద్దరినీ పార్టీ నుంచి గెంటివేయాలని విలీన చర్చల సందర్భంగా ఓపీఎస్ వర్గం గట్టిగా పట్టుబట్టింది. అయితే, దినకరన్‌ను పార్టీ నుంచి వెలి వేయకూడదన్న ఆలోచనలో ముఖ్యమంత్రి పళనిస్వామి ఉన్నట్టు తెలుస్తోంది. దినకరన్‌పై వేటు వేస్తే తన పదవికి ముప్పు వచ్చే అవకాశం ఉన్నందున ఈ విషయంలో ఆయన ఆచి తూచి వ్యవహరిస్తున్నట్టు కనబడుతోంది. ఓపీఎస్, ఈపీఎస్ వర్గాల మధ్య విలీన చర్చలు తుది దశకు వచ్చినప్పుడు దినకరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనను పార్టీ నుంచి గెంటివేస్తే పళనిస్వామి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు వెనుకాడబోనని పరోక్షంగా బెదరించారు. అంతే కాదు. తనకు మద్దతుగా ఉన్న 20 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలతో మదురైలో ర్యాలీ కూడా నిర్వహించారు. ఒకవేళ దినకరన్‌పై వేటు వేస్తే అన్నా డీఎంకే 20 మంది ఎమ్మెల్యేల మద్దతు కోల్పోయే అవకాశం ఉంది. 235 మంది స్థానాలు ఉన్న తమిళనాడు అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118. ఓపీఎస్ వర్గం నుంచి 12 మంది ఎమ్మెల్యేలు పళనిస్వామి సర్కారు మద్దతు ఇచ్చినా మేజిక్ ఫిగర్‌కు 3 సీట్లు తగ్గుతాయి. మరో వైపు ఏ చిన్న అవకాశం దొరికినా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రతిపక్ష డీఎంకే నాయకుడు స్టాలిన్ ఎదురు చూస్తున్నారు. తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 89 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు 9 మంది శాసనసభ్యులు ఉన్నారు. వారంతా కలిస్తే ప్రతిపక్ష బలం 98కి చేరుతుంది. వీరికి దినకరన్ దగ్గర ఉన్న 20 మంది ఎమ్మెల్యేలు కలిస్తే పళనిస్వామి ప్రభుత్వం కూలడం ఖాయం. అందుకే దినకరన్‌పై వేటు వేయాలని పన్నీర్‌సెల్వం వర్గం ఎంత ఒత్తిడి చేస్తున్నా పళనిస్వామి ముందడుగు వేయడం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ప్రభుత్వం, పార్టీలో తన పంతం నెగ్గించుకున్న పన్నీర్ సెల్వం ఏం చేస్తారనే దానిపై తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

పళనిస్వామితో పన్నీర్‌సెల్వం భేటీ

శశికళను పార్టీ నుంచి బహిష్కరించేందుకు పళని అంగీకారం



చెన్నై : తమిళనాడు రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఆరు నెలల తరువాత పన్నీర్‌సెల్వం చెన్నైలోని అన్నా డీఎంకే కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామితో పన్నీర్‌సెల్వం భేటీ అయ్యారు. శశికళను పార్టీ నుంచి పూర్తిగా బహిష్కరిస్తేనే ఇరు వర్గాల విలీనం సాధ్యమని పన్నీర్ సెల్వం చేసిన ప్రతిపాదన పట్ల పళనిస్వామి సానుకూలంగా స్పందించారు.

శశికళకు షాక్!

పక్కా వీడియో ఆధారాన్ని సమర్పించిన డీఐజీ రూప



బెంగళూరు : బెంగళూరులోని పరప్పణ అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు శశికళకు ఊహించని షాక్ తగిలింది. జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ జైలు అధికారులకు 2 కోట్ల రూపాయల ముడుపులు చెల్లించి వీవీఐపీ మర్యాదలు పొందుతున్నారని డీఐజీ రూప సీబీఐకి స్పష్టమైన ఆధారాలు ఇచ్చారు. ఇందులో జైలులోని ప్రధాన ద్వారం నుంచి శశికళ బయటకు వస్తున్న విజువల్స్ ఉండడం విశేషం. దీనితో పాటు జైలులో శశికళ విలాసాలపై 14 పేజీల నివేదికను కూడా ఆమె అందజేశారు. సాధారణంగా జైలు లోపలికి ఖైదీలు వెళ్లినా, జైలు నుంచి ఖైదీలు బయటకు వెళ్లినా ప్రధాన ద్వారానికి ఉండే చిన్న ద్వారం ద్వారానే రాకపోకలు జరుగుతాయి. సాధారణ సిబ్బంది కూడా ఇదే విధంగా లోపలికి వెళ్లి వస్తుంటారు. కేవలం ఉన్నత స్థాయి అధికారులకు ప్రధాన ద్వారం తెరిచే వెసులుబాటు ఉంటుంది. ఈ నేపథ్యంలో శశికళకు సంబంధించిన ఫుటేజ్ ఈ వివాదంపై క్లారిటీ ఇస్తోంది. తాజాగా ఆమె సమర్పించిన ఆధారాలు, నివేదికతో శశికళకు జైలులో వీవీఐపీ మర్యాదలు అందుతున్నాయని స్పష్టమవుతోంది.

అన్నా డీఎంకే విలీనంపై కమల్ ట్వీట్

ప్రజల్ని వెర్రివాళ్లను చేస్తున్నారని కామెంట్



చెన్నై : తమిళ రాజకీయ పరిణామాలపై విలక్షణ నటుడు కమలహాసన్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. పళనిస్వామి, పన్నీర్‌సెల్వం వర్గాలు కలవడంపై కూడా ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. పార్టీలు విడిపోవడం, మళ్లీ కలవడం వంటి చర్యలతో తమిళ ప్రజలను ప్రభుత్వం వెర్రివాళ్లను చేస్తోందని ఆయన కామెంట్ చేశారు. తమిళుల తల మీద గాంధీ టోపీ, కాషాయం టోపీ, కాశ్మీర్ టోపీలతో పాటు ఇప్పుడు జోకర్ టోపీ కూడా పెట్టారని ఆయన ఎద్దేవా చేస్తూ తమిళంలో ట్వీట్ చేశారు. 'గాంధీ టోపీ.. కాషాయ టోపీ... కాశ్మీర్ టోపీ.. ఇప్పుడు ఫూల్స్ టోపీ.. ఇది చాలదా?' అని ట్వీట్ చేశారు. ప్రజలకు మరింత కావాలా? అని అడిగారు. తమిళ ప్రజలు దయచేసి మేల్కోవాలని రాసుకొచ్చారు. కాగా, సోషల్ మీడియా ద్వారా తమిళ రాజకీయాలపై ప్రభావం చూపించడానికి ప్రభుత్వ పని తీరుపై స్పందించాల్సిందిగా తన అభిమానులను కమల్ ఉసిగొల్పడంపై తమిళ ప్రభుత్వం ఒకింత అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కమల హాసన్ డీఎంకే పార్టీలో చేరతారన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

మావోయిస్టులపై అంతరిక్షం నుంచి నిఘా

ప్రత్యేక ఉపగ్రహం తయారీకి కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ : మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్రం చర్యలు ప్రారంభించింది. దండకారణ్యం నుంచి వారిని సమూలంగా ఏరివేసేందుకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపగ్రహం ద్వారా వారిపై నిఘా పెట్టాలని యోచిస్తున్న ప్రభుత్వం ఇందు కోసం ప్రత్యేకంగా ఓ ఉపగ్రహాన్ని రూపొందించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. దట్టమైన అడవుల్లో గాలింపు కార్యక్రమంలో పాల్గొంటున్న భద్రతా దళాలకు మరింత వెన్నుదన్నుగా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వేలాది మంది భద్రతా సిబ్బంది అబూజ్‌మడ్, బస్తర్ వంటి ప్రాంతాల్లో అడుగడుగునా గాలింపు సాగిస్తుండడంతో ఆ ప్రాంతాలు బలగాల చేతుల్లోకి వచ్చాయి. అయితే, ఒక్కసారిగా చుట్టుముట్టి విరుచుకుపడుతున్న నక్సల్స్ చేతుల్లో పడి పెద్ద సంఖ్యలో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలు మరణిస్తుండడం ప్రభుత్వాన్ని కలవరపరుస్తోంది. దీనితో చిమ్మచీకట్లో సైతం వారి కదలికలను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఉపగ్రహాన్ని రూపొందించాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్రం నిర్ణయించింది. 2012లో ప్రయోగించిన ఆర్ఐశాట్-1 ఉపగ్రహం తగినంతగా ఉపయోగపడకపోవడం, ఈ ఏడాదితో దాని కాల పరిమితి ముగియడంతో కొత్త ఉపగ్రహం తయారు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందు కోసం ఇజ్రాయెల్ టెక్నాలజీని ఉపయోగించనున్నట్టు సమాచారం.

గ్రేట్ వాల్‌పై కెమెరాలు ఏర్పాటు చేసిన చైనా

పేర్లు రాస్తున్న పర్యాటకులపై నిఘా



బీజింగ్ : ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన చైనాలోని గ్రేట్ వాల్‌పై పేర్లు రాస్తూ, జ్ఞాపకం కోసం చిన్న చిన్న రాళ్లను పెకిలించి తమ దేశాలకు తీసుకువెళుతున్న పర్యాటకులను అరికట్టడానికి 300కు పైగా హై డెఫినిషన్ కెమెరాలను గ్రేట్ వాల్ పొడవునా అమర్చారు. చారిత్రక కట్టడానికి నష్టం తెస్తున్న వారిని గుర్తించడానికే చైనా ప్రభుత్వం ఈ పని చేసినట్టు మీడియా అభిప్రాయపడింది. గ్రేట్ వాల్ పొడవునా చాలా చోట్ల కొరియన్, చైనీస్, ఇంగ్లీషు పేర్లతో ఉండడాన్ని ఇటీవల చైనా పురాతన కట్టడాల బృందం గమనించింది. వారి సలహా మేరకు, ఇక నుంచి ఇలాంటి పనులు జరగకుండా ఉండేందుకు చైనా కెమెరాలను ఏర్పాటు చేసింది. ఎవరైనా పర్యాటకులు పేర్లు గానీ, గీతలు గానీ చెక్కుతున్నట్లు కనిపిస్తే, వారిని మళ్లీ చైనాకు రాకుండా నిషేధించాలని ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా ఎప్పటికప్పుడు పర్యాటకులను పర్యవేక్షించడానికి గోడపై ప్రత్యేక పోలీసు బృందాలను, హెచ్చరిక బోర్డులను కూడా అమర్చినట్లు మీడియా తెలియజేసింది.

స్టాన్‌ఫర్డ్ అధ్యాపకుడిగా తెలుగోడు

వీసా లేకుండానే బోధించే అరుదైన అవకాశం కల్పించిన అమెరికా ప్రభుత్వం



వాషింగ్టన్ : అమెరికాలోని ప్రతిష్ఠాత్మక వైద్య విశ్వవిద్యాలయం స్టాన్‌ఫర్డ్ మెడిసిన్‌లో 'వాస్క్యులర్ సర్జరీ' విభాగంలో సహాయ ఆచార్యుడిగా బోధించేందుకు గుంటూరుకు చెందిన డాక్టర్ మిక్కిలినేని కార్తీక్ ఎంపికయ్యారు. యూనివర్సిటీ కోరిక మేరకు కార్తీక్‌కు 'ఓ-వన్ఏ' వీసాను అమెరికా ప్రభుత్వం జారీ చేసింది. అంటే వీసా అవసరం లేకుండానే అక్కడ ఉండి, పాఠాలు బోధించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కార్తీక్ 2004-10 కాలంలో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, తరువాత పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేయడానికి 2012లో అమెరికా వెళ్లారు. న్యూయార్క్‌లోని పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో వాస్క్యులర్ సర్జరీ ఎండీ విద్యను పూర్తి చేశారు. వాస్క్యులర్ డిపార్టుమెంట్‌లో మొత్తం 11 సీట్లు ఉంటే అమెరికాయేతర వ్యక్తిగా అతనికి మాత్రమే సీటు రాగా మిగిలిన పది మంది అమెరికా దేశానికి చెందినవారే. ఒక వైపు ఎండీ విద్యాభ్యాసం చేస్తూనే మరో వైపు చదువులో భాగంగానే పరిశోధనల వైపు ఆయన దృష్టి సారించారు. హార్వర్డ్ వర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అతని ప్రతిభను గుర్తించి రెండు రీసెర్చ్ ప్రాజెక్టులు మంజూరు చేశాయి. ఇప్పటి దాకా స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో ఓ-వన్ఏ వీసాతో భారత సంతతికి చెందినవారు పని చేయలేదని కార్తీక్ తెలిపాడు. అమెరికాలో 3200 మంది మాత్రమే వాస్క్యులర్ సర్జన్లు ఉండగా భారత్ వంటి దేశాల్లో వారి సంఖ్య చాలా తక్కువ. అక్టోబరు 1న అధ్యాపకుడిగా కార్తీక్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల పాటు తప్పనిసరిగా పని చేయాల్సి ఉంటుంది. వార్షికంగా అన్ని రాయితీలతో కలిపి 3.25 లక్షల డాలర్లు వేతనంగా ఇవ్వనున్నారు.

ఒకే ఒక్కడు కొండను తవ్వి రహదారి నిర్మించుకున్న వైనం!



తిరువనంతపురం : ఒకే ఒక్క మనిషి కొండను తవ్వాడు. వాహనాలు వెళ్లడానికి వీలుగా రహదారి నిర్మించాడు. అతడికి అందరిలా అన్ని అవయవాలూ సక్రమంగా ఉన్నాయా అంటే అది కూడా లేదు. అతడి కుడి చేయి, కుడి కాలు సరిగ్గా పని చేయవు. ఆయన జీవిత కథకు నెటిజన్లు సలాం కొడుతున్నారు. తాజాగా ఆయనకు నెటిజన్లు మూడు చక్రాల వాహనం కొని ఇచ్చారు. కేరళకు చెందిన మెలితువీట్టిల్ శశి అనే వ్యక్తి 18 ఏళ్ల క్రితం ఎంతో హుషారుగా పనులు చేసుకునేవాడు. ఓ రోజు కొబ్బరి కాయలు కోయడం కోసం చెట్టు ఎక్కి కింద పడిపోయాడు. అనంతరం సుదీర్ఘ కాలం చికిత్స తీసుకున్నప్పటికీ పూర్తిగా కోలుకోలేకపోయాడు. శరీరంలోని కుడి వైపు పాక్షిక పక్షవాతం వచ్చి, కుడి చేయి, కుడి కాలు సరిగ్గా పని చేయడం మానేశాయి. అసలే పేదరికంలో ఉన్న తన కుటుంబాన్ని పోషించడానికి ప్రతి రోజు తమ ఇంటికి కొన్ని కిలో మీటర్ల దూరంలో ఉండే తిరువనంతపురం వెళ్లి లాటరీ టిక్కెట్లు అమ్మి పని చేసుకోవాలనుకున్నాడు. తాను ఆ ప్రాంతానికి వెళ్లడానికి మూడు చక్రాల వాహనం అవసరం పడింది. దాన్ని కొనేందుకు తన దగ్గర డబ్బు లేకపోవడంతో గ్రామ పంచాయతీ అధికారులను ఆశ్రయించి, సాయం చేయవలసిందిగా కోరాడు. శశిని చూసిన అధికారులు హేళనగా మాట్లాడారు. ఆయన ఇంటి ముందు ఓ కొండ ఉందని, ఒకవేళ వాహనం ఇచ్చినా ఎలా నడిపిస్తావని ప్రశ్నించి ఆయనను పంపించివేశారు. అనంతరం కొన్ని రోజులకు మళ్లీ అధికారుల వద్దకు వచ్చి తన ఇంటి ముందు ఉన్న కొండను తొలగించి రహదారి వేయించాలని కోరాడు. ఏకంగా పదేళ్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం రాలేదు. దీంతో విసుగెత్తి పోయిన శశి కొండను తానొక్కడినే తవ్వాలని నిర్ణయించుకుని, రోజుకు 6 గంటల చొప్పున కష్టపడి కొండను తవ్వేశాడు. అంతటితో ఆగకుండా సుమారు మూడేళ్ల పాటు కష్టపడి తన ఇంటికి రహదారిని నిర్మించుకున్నాడు. ఆయన కథను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో నెటిజన్లు అతడికి మూడు చక్రాల వాహనాన్ని కొని ఇచ్చారు.


సంక్లిష్ట శస్త్రచికిత్సలను సులభంగా పూర్తి చేసే రోబో



లండన్ : హెర్నియా సరి చేయడం, పురీషనాళం, పాయువు, పెద్ద ప్రేగు, ప్రొస్టేట్, చెవి, ముక్కు, గొంతు వంటి సంక్లిష్ట శస్త్రచికిత్సలు సులభంగా చేయగల రోబోను లండన్ శాస్త్రవేత్తలు రూపొందించారు. మొబైల్ ఫోన్లు, అంతరిక్ష కేంద్రంలో వాడే సాంకేతికతను ఉపయోగించి తయారు చేసిన ఈ రోబో పేరు 'వెర్సైస్'. ప్రపంచంలో శస్త్రచికిత్సలు చేయగల రోబోల్లో వెర్సైస్ అతి చిన్నది. మనిషి చేతిని పోలి ఉండే ఈ రోబో సహాయంతో సంప్రదాయ శస్త్రచికిత్సల్లో వలె పెద్ద పెద్ద గాట్లు పెట్టనవసరం లేకుండానే శస్త్రచికిత్స చేయవచ్చు. దీంతో రక్తస్రావం తక్కువగా జరగడమే కాకుండా రోగికి పెద్దగా బాధ కూడా తెలియదని శాస్త్రవేత్తలు తెలిపారు. త్రీడీ తెర సాయంతో ఈ రోబోను నియంత్రించవచ్చు. వచ్చే ఏడాది లాంఛనంగా ప్రారంభించే ఈ రోబోను ముందుగా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స చేసేందుకు ఉపయోగించనున్నట్లు కేంబ్రిడ్జ్ మెడికల్ రోబోటిక్స్ శాస్త్రవేత్త మార్టిన్ ఫ్రాస్ట్ చెప్పారు.

రంగంలోకి దిగుతున్న 'డ్రాగన్ లేడీ'

చీమ చిటుక్కుమన్నా అమెరికా సైన్యానికి తెలిసిపోతుంది



వాషింగ్టన్ : అమెరికా, ఉత్తర కొరియా మధ్య యుద్ధ వాతావరణం ఇంకా చల్లబడలేదు. అమెరికాపై ఇప్పుడే దాడి చేయడం లేదని ఉత్తర కొరియా ప్రకటించినప్పటికీ, ఆ మాటల్ని అమెరికా పూర్తిగా విశ్వసించడం లేదు. అందుకే, తన జాగ్రత్తలో తాను ఉంటోంది. శత్రు దేశం కదలికలపై ఓ కన్ను వేసి ఉంచింది. ఈ క్రమంలో అమెరికా సైన్యం తన అత్యాధునిక యుద్ధ విమానం 'డ్రాగన్ లేడీ'ని రంగంలోకి దించింది. ఉత్తర కొరియా రాడార్లు కనిపెట్టలేనంత ఎత్తులో అంటే సుమారు 70 వేల అడుగుల ఎత్తులో ఎగురుతూ అది పహారా కాస్తుంది. అది జపాన్ ఎయిర్ బేస్ నుంచి బయలుదేరనుందని అమెరికా సైన్యం తెలిపింది. చాలా ఎత్తులో ఈ విమానాన్ని నడపవలసి ఉండడంతో ఇందులోని పైలట్లు వ్యోమగాములు ధరించేటటువంటి దుస్తులను ధరిస్తారని అమెరికా సైన్యాధికారులు తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిడితోనే ఉత్తర కొరియా దాడిని వాయిదా వేసిందని, దాడిని రద్దు చేసుకోలేదని అమెరికా సైన్యం అనుమానిస్తోంది. దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించే సమయంలో ఉత్తర కొరియా తీవ్రంగా స్పందించే అవకాశం ఉందని, దీనితో అది తీవ్ర నిర్ణయం తీసుకుంటే ముందుగానే గుర్తు పట్టాల్సిన బాధ్యత తమపై ఉందని అమెరికా సైన్యం చెబుతోంది. అందుకే ముందు జాగ్రత్తగా ఉత్తర కొరియాపై నిఘా కోసం అత్యంత శక్తిమంతమైన కెమెరాలతో పహారా కాసేందుకు డ్రాగన్ లేడీని రంగంలోకి దించామని తెలిపింది.

విదేశీ న్యాయస్థానాలు భారతీయులకు విడాకులు మంజూరు చేయకూడదు

బొంబాయి హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ముంబయి : భారతీయ దంపతులకు విదేశీ న్యాయస్థానాలు విడాకులు మంజూరు చేయకూడదని బొంబాయి హైకోర్టు సూచించింది. దుబాయిలో ఉంటున్న ఓ భారతీయుడికి అక్కడి న్యాయస్థానం విడాకులు మంజూరు చేయడంపై దాఖలైన పిటిషన్‌పై బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానిస్తూ, విదేశాల్లో నివసిస్తున్నంత మాత్రాన భారతీయులకు విడాకులు మంజూరు చేసే పరిధి సదరు దేశాల్లోని కోర్టులకు లేదని స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం ప్రకారం పెళ్లి చేసుకున్న భారతీయ జంటలకు సంబంధించిన కేసులను విచారించే పరిధి విదేశీ కోర్టులకు లేదని చట్టం పేర్కొంటోందని జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ అనుజా ప్రభు దేశాయ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కక్షిదారులు ఇద్దరూ పుట్టుకతోనే భారతీయ హిందువులని, వారికి హిందూ వేద హక్కుల ప్రకారం వివాహం జరిగిందని, వారి వివాహం హిందూ వివాహ చట్ట పరిధిలోకి వస్తుందని. అందువల్ల విదేశీ న్యాయస్థానాలకు వారికి విడాకులు మంజూరు చేసే అధికారం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

ట్రంప్ ట్వీట్‌లో స్పెల్లింగ్ మిస్టేక్

విమర్శల వర్షం కురిపిస్తున్న నెటిజన్లు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ట్వీట్‌లో ఉన్న స్పెల్లింగ్ మిస్టేక్ ఆయన్ని విమర్శలపాలు చేస్తోంది. ట్వీట్‌లో ఒకే తప్పిదాన్ని రెండు సార్లు చేయడం వల్ల నెటిజన్లు ఆయనపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. చార్లసెట్విల్లే ఘటనపై అమెరికాను ఉద్దేశించి ట్రంప్ చేసిన ట్వీట్ 'హీల్' అనే పదం స్పెల్లింగ్ తప్పుగా రాశారు. దీంతో ట్వీట్ అర్థం మారిపోయింది. దీంతో 'మన అధ్యక్షుడు ఇడియట్', 'హీల్ స్పెల్లింగ్ రాని నీవు రేపు యుద్ధం వస్తే న్యూక్లియర్ కోడ్లను ఎలా ఎంటర్ చేస్తావ్?' వంటి కామెంట్లతో పాటు ఆయనను అనుకరిస్తూ తప్పుడు పదాలతో చాలా మంది ట్వీట్ చేశారు. తరువాత కాసేపటికి ట్రంప్ తన ట్వీట్‌ను సరి చేసుకున్నారు. గతంలో కూడా డిక్షనరీలో లేని 'కౌఫెఫె' పదాన్ని ట్రంప్ ట్వీట్ చేశాడు. దాని అర్థం ఏమిటో తెలియక నెటిజన్లు అయోమయానికి గురై, కామెంట్ల వర్షం కురిపించారు.

సరిహద్దుల్లో చైనా మరోసారి యుద్ధ విన్యాసాలు

- ఇరు దేశాల మధ్య డోక్లామ్ విషయమై ఉద్రిక్తతలు
- భారత సరిహద్దుల్లో యుద్ధ విన్యాసాలు
- చైనా సెంట్రల్ టెలివిజన్ కథనాన్ని ఉటంకిస్తూ 'గ్లోబల్ టైమ్స్'
- చైనా మీడియా 'జిన్హువా' తాజాగా మరో వీడియో ప్రసారం



బీజింగ్ : చైనా సైన్యం (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) మరోసారి భారత సరిహద్దుల్లో యుద్ధ విన్యాసాలు నిర్వహించినట్టు ఆ దేశ అధికార పత్రిక 'గ్లోబల్ టైమ్స్' సోమవారం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య డోక్లామ్ విషయమై ఉద్రిక్తతలు కొనసాగుతున్న క్రమంలో ఈ యుద్ధ విన్యాసాలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల మొదటి వారంలో జరిగిన ఈ విన్యాసాలను ఇదమిత్థంగా ఎక్కడ నిర్వహించిందీ వెల్లడించలేదు. చైనా సెంట్రల్ టెలివిజన్ కథనాన్ని ఉటంకిస్తూ 'గ్లోబల్ టైమ్స్' ఈ వివరాలను బయటపెట్టింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు చెందిన పదికి పైగా యూనిట్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. భారత్‌కు అత్యంత సమీపంలోని కింఘై- టిబెట్ పీఠభూమి వెస్ట్రన్ కమాండ్‌కు ప్రధాన కేంద్రంగా ఉంది. యుద్ధ విన్యాసాలు నిర్వహించిన యూనిట్లలో వాయు, సాయుధ విభాగాలు కూడా ఉన్నట్టు 'గ్లోబల్ టైమ్స్' కథనం ఆధారంగా తెలుస్తోంది. విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంకులు లక్ష్యాలపైకి శతఘ్నులను విడిచి పెడుతున్న దృశ్యాలను ఓ ఐదు నిమిషాల నిడివితో కథనాన్ని చైనా సెంట్రల్ టెలివిజన్ ప్రసారం చేసింది. ఇది అక్కడి ప్రభుత్వ అధికార చానల్. ఈ కథనం ఆధారంగా 'గ్లోబల్ టైమ్స్' కథనాన్ని అల్లింది. కాగా, భారత్, చైనా, టిబెట్ సరిహద్దుల్లోని డోక్లామ్‌లో ప్రతిష్టంభన ఏర్పడిన తరువాత జూలై చివర్లోనూ ఈ తరహా విన్యాసాలు నిర్వహించడం గమనార్హం.

భారత్‌పై ఆరోపణలతో చైనా మీడియా మరో వీడియో

భారత్ చేసిన ఏడు పాపాలు అంటూ ఇటీవలే ఓ వీడియోను ప్రసారం చేసిన చైనా మీడియా 'జిన్హువా' తాజాగా మరో వీడియో ప్రసారం చేసింది. భారత్‌ను పొగుడుతున్నట్లు మొదట చూపించి, ఆ తరువాత ఎప్పటిలా భారత్‌పై ఆరోపణలు చేసింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న డోక్లామ్ వివాదానికి కారణం ఇండియానేనని వార్తలు ప్రసారం చేసింది. ఈ వీడియోలో మొదట భారత్ ప్రపంచంలోనే పురాతన నాగరికత గల దేశమని ఆ మీడియా చూపించింది. అద్భుతమైన సంస్కృతి భారత్ సొంతమని అంది. అనంతరం డోక్లామ్ తమ దేశ భూభాగమేనని చెప్పుకుంది. భారత్ చైనా భూభాగంలోకి ప్రవేశించిందని ఆ వీడియో పేర్కొంది. తమ దేశానికి చెందిన ఆర్మీ మాత్రం సరిహద్దు ఉల్లంఘనలకు పాల్పడలేదని తెలిపింది. గత రెండు నెలలుగా డోక్లామ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఇలా చైనా మీడియా సంస్థలు వార్తలు ప్రసారం చేస్తూనే ఉన్నాయి.

సూర్య స్పోర్ట్స్

వరుసగా ఆరు 50 స్కోర్లు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా శిఖర్ ధావన్



దంబుల్లా : శ్రీలంక పర్యటనలో భాగంగా ఆదివారం ఆ టీమ్‌పై ఆడిన మొదటి వన్డేలో భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ సెంచరీ బాది అభిమానులను అలరించాడు. 71 బంతుల్లోనే 132 పరుగులు చేసిన ధావన్ మరో రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంకపై తాను ఆడిన చివరి ఆరు వన్డేల్లోనూ శిఖర్ ధావన్ 50 ప్లస్ స్కోరు చేసి, అంతర్జాతీయ వన్డేల్లో ఓ ప్రత్యర్థి జట్టుపై ఈ ఘనత సాధించిన మొదటి భారత ఆటగాడిగా నిలిచాడు. శ్రీలంకతో తాను ఆడిన చివరి ఆరు వన్డేల్లో ధావన్ వరుసగా 94, 113, 79, 91, 125, 132 స్కోర్లు సాధించాడు. కాగా, శ్రీలంకపై వరుసగా ఐదు సార్లు 50కి పైగా స్కోరు సాధించిన వారిలో టీమిండియా మాజీ ఆటగాళ్లు నవ్‌జోత్ సింగ్ సిద్ధు, మహమ్మద్ అజహరుద్దీన్ ఉన్నారు. శ్రీలంకపై వరుసగా చేసిన ఆరు 50 ప్లస్ స్కోర్లే కాకుండా ధావన్ గతంలో మరో హాఫ్ సెంచరీ కూడా చేశాడు. అంటే శ్రీలంకపై మొత్తం ఏడు 50 ప్లస్ స్కోర్లు చేశాడు. ఆ జట్టుపై ఏడు సార్లు 50కి పైగా స్కోరు చేసిన టీమిండియా మాజీ ఆటగాడు సెహ్వాగ్ సరసన ధావన్ నిలిచాడు.



ఓటములు ఎన్నో పాఠాలు నేర్పుతాయి

దంబుల్లా : శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో భారత ఆటగాడు శిఖర్ ధావన్ 90 బంతుల్లో 132 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన శిఖర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. ఇటీవల వరుస ఇన్నింగ్స్‌లతో రాణిస్తున్న ధావన్ గతంలో జట్టులో స్థానం కోల్పోయిన సమయంలో ఓటముల నుంచి ఎంతో నేర్చుకున్నట్లు తెలిపాడు. అంతే కాదు. ఓటములే మనకు భవిష్యత్తులో రాణించేందుకు ముఖ్యమైన పాఠాలు నేర్పుతాయని అన్నాడు. తొలి వన్డే అనంతరం శిఖర్ మీడియాతో మాట్లాడుతూ, గత ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో నేను మెరుగైన ప్రదర్శన చేయలేకపోయా. దీంతో జట్టులో నుంచి స్థానం కోల్పోవల్సి వచ్చింది. కాస్త విరామం తరువాత ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ సమయంలో జట్టులో స్థానం దక్కించుకోగలిగాను. ఈ టోర్నీలో నా ప్రదర్శనకు మంచి మార్కులే పడ్డాయి. భవిష్యత్తులోనూ ఇదే ప్రదర్శననే కొనసాగించాలి అనుకుంటున్నాను. 2019లో ప్రపంచ కప్ జరగనుంది. ఈ మెగా టోర్నీకి ఇంకా ఎంతో సమయం ఉంది. ఈ టోర్నీలో మంచి ప్రదర్శన చేయాలన్నది నా లక్ష్యం. అందుకే ఇదంతా. ఒక వేళ నేను మంచి ప్రదర్శన చేయలేకపోతే నా స్థానంలో మరో బ్యాట్స్‌మన్ చోటు దక్కించుకోవడం ఖాయం అని అన్నాడు. ఓటములు ఎన్నో పాఠాలు నేర్పుతాయి. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతుడిని. ఇప్పటికే వాటి నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. ఫామ్ కోల్పోయి జట్టులో స్థానం కోల్పోయిన సమయం నాకెంతో కఠినమైనది. ఇప్పుడు దాని నుంచి బయటికి వచ్చేశాను కాబట్టి మరోసారి ఆలోచించాలని అనుకోవడం లేదు. 2013లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్‌పై శతకం సాధించాను. అప్పుడు ఏ ఫామ్‌లో ఆడానో ఇప్పుడు అదే ఫామ్‌లో ఆడుతున్నా. మ్యాచ్‌కు ముందు లక్ష్యాలను ఏర్పరుచుకోను. కేవలం ఫిట్‌నెస్, ఫీల్డింగ్, స్కిల్స్‌పైనే ఎక్కువగా దృష్టి పెడతా' అని తెలిపాడు. 'శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభాన్ని చూసి ఆ జట్టు 300కి పైగా పరుగులు సాధిస్తుందని భావించా, కానీ స్వల్ప విరామంలో వికెట్లు కోల్పోయింది.

ప్రస్తుతం ఆ జట్టులో యువ ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నారు. మరిన్ని మ్యాచ్‌ల ద్వారా వారు త్వరలోనే అనుభవం సాధిస్తారు. విశ్వ ఫెర్నాండో బౌలింగ్ ప్రదర్శనపై నేను ఎలాంటి వ్యాఖ్యలూ చేయను. అతనో మంచి బౌలర్. చాంపియన్స్ ట్రోఫీలోనూ అతన్ని ఎదుర్కొన్నాను' అని ధావన్ వివరించాడు.

వైడ్ బాల్ : స్టంప్స్ ఎగరగొట్టిన ధోనీ

దంబుల్లా : దంబుల్లా వన్డేలో టీమిండియా జయ కేతనం ఎగరేసింది. బౌలర్లు చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 216 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ తన కీపింగ్ సత్తా ఏమిటో మరోసారి చూపించాడు. బ్యాట్స్‌మన్ తిరిగి చూసే లోపే స్టంప్స్ ఎగరగొట్టాడు. శ్రీలంక ఇన్నింగ్స్‌లో 42వ ఓవర్‌ను స్పిన్నర్ యజువేంద్ర చాహల్ వేశాడు. మూడో బంతి ఆడేందుకు మలింగ క్రీజులోకి వచ్చాడు. బంతి వేయగానే లాగి సిక్సర్ బాదేయాలన్నంత కసిగా కనిపించాడు. బ్యాట్స్‌మన్ మూమెంట్ గమనించిన చాహల్ తెలివిగా బంతిని ఆఫ్ స్టంప్ వైపు ఎడంగా విసిరాడు. ఈ ఎత్తుగడ తెలియని మలింగ ముందుకు రాగానే బంతి అందుకున్న ధోనీ వికెట్లను గిరాటేశాడు. దీంతో వైడ్ బాల్‌కు వికెట్ పడింది. శిఖర్ ధావన్ అజేయ శతకం బాదడంతో టీమిండియా 30 ఓవర్ల లోపే విజయం సాధించడం విశేషం.

శ్రీలంక క్రికెటర్లు వెళుతున్న బస్సును అడ్డుకున్న అభిమానులు


దంబుల్లా : శ్రీలంక క్రికెట్ టీమ్ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. వరుస ఓటములతో ఆ టీమ్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది. శ్రీలంక క్రికెట్ అభిమానులు తమ దేశ జట్టు ఆటగాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను ఓడిపోయిన శ్రీలంక వన్డేల్లోనూ పేలవ ప్రదర్శన కనబరుస్తుండడంతో తమ క్రికెటర్ల ఆట తీరుకు నిరసనగా వారు ప్రయాణించే బస్సును అడ్డుకున్నారు. దంబుల్లాలో ఆదివారం జరిగిన తొలి వన్డేలో పాల్గొని, అనంతరం హోటల్‌కు వెళ్లడానికి శ్రీలంక క్రికెటర్లు బస్ ఎక్కారు. అదే సమయంలో దాదాపు 50 మంది శ్రీలంక క్రికెట్ అభిమానులు దానిని అడ్డుకుని క్రికెటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి ఆట తీరును హేళన చేశారు. దీనితో దాదాపు అర గంట సేపు బస్సు ముందుకు కదలలేదు. చివరకు అభిమానులు ఆ బస్సు వెళ్లడానికి దారి ఇచ్చారు. మరో వైపు తమ ఆటగాళ్ల పేలవ ప్రదర్శనపై శ్రీలంక టీమ్ కోచ్ నిక్ పోథాస్ స్పందిస్తూ, టీమ్‌పై బయటి వ్యక్తుల పెత్తనం అధికమై పోతోందని అన్నారు.

భారత్, శ్రీలంక అభిమానుల మధ్య వాగ్వాదం

దంబుల్లా : భారత్, శ్రీలంక అభిమానుల మధ్య ఆదివారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదు వన్డేల సిరీస్‌లో దంబుల్లా వేదికగా ఆదివారం తొలి వన్డే జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇది ఇలా ఉండగా, భారత జట్టు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో గ్యాలరీలో కూర్చుని మ్యాచ్ వీక్షిస్తున్న అభిమానల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి పోలీసులు వచ్చి గొడవను సద్దుమణిగేట్లు చేయవలసి వచ్చింది. అసలేమి జరిగిందంటే, ధావన్, కోహ్లీ బౌండరీలు బాదుతూ పరుగులు రాబడుతుంటే గ్యాలరీలో మ్యాచ్ వీక్షిస్తున్న భారత అభిమానులు క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ సందడి చేశారు. ఈ నేపథ్యంలో నలుగురు భారత అభిమానులు, శ్రీలంక అభిమానుల మధ్య మ్యాచ్ గురించి చిన్నపాటి చర్చ మొదలైంది. అది కాస్త పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో లంకేయులు భారత అభిమానులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. గమనించిన భద్రతా సిబ్బంది అక్కడికి వచ్చి ఇరు వర్గాలకు సర్ది చెప్పి శాంతపరిచారు. తీవ్ర మనస్తాపానికి గురైన పలువురు భారత అభిమానులు మ్యాచ్ మధ్యలోనే మైదానాన్ని వీడి వెళ్లిపోయారు.

ప్రపంచ కప్ కోసం అరేబియన్ టోపీ ఆకారంలో స్టేడియం

దోహా : 2022 ఫిఫా ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న ఖతర్ ఇందు కోసం ప్రత్యేకంగా ఓ స్టేడియం నిర్మించాలని యోచిస్తోంది. అధునాతన హంగులతో, సకల సౌకర్యాలతో కూడిన ఈ స్టేడియంను అరేబియన్ టోపీ ఆకారంలో నిర్మించనున్నట్టు ఆదివారం నిర్వాహకులు వెల్లడించారు. ఉగ్రవాదాన్ని ఖతర్ ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలతో సౌదీ అరేబియా, ఈజిప్ట్, బహ్రెయిన్, యూఏఈలు ఖతర్‌తో అన్ని రకాల సంబంధాలను తెంచుకున్నాయి. ఆయా దేశాల నుంచి సహకారం ఆగిపోవడంతో టర్కీ, ఇరాన్ తదితర దేశాల నుంచి ఒమన్ మీదుగా ఓడల్లో పెద్ద మొత్తంలో ఆహారాన్ని దిగుమతి చేసుకుంటోంది. అలాగే వరల్డ్ కప్ ప్రాజెక్టు కోసం నిర్మాణ సామగ్రిని కూడా తెప్పించుకుంటోంది. ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న ఈ స్టేడియంలో 40 వేల మంది ప్రేక్షకులు కూర్చునేలా, అరేబియన్ టోపీ గాఫియా ఆకారంలో నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను ఖతర్‌కే చెందిన ఆర్కిటెక్ట్ సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.



చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌పై విరుచుకుపడ్డ గంభీర్

న్యూఢిల్లీ : టీమిండియా చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌పై టీమిండియా వెటరన్ క్రికెటర్ గౌతమ్ గంభీర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు జట్టును ఎంపిక చేసిన సందర్భంగా యువరాజ్ ను ఎంపిక చేయకపోవడానికి గల కారణాలను వివరిస్తూ ఎమ్మెస్కే చేసిన వ్యాఖ్యలపై గంభీర్ మండిపడ్డాడు. దీనిపై గంభీర్ మాట్లాడుతూ, 'యువీని పక్కకు పెట్టారు. అంత వరకూ ఓకే. మరి యువీకి విశ్రాంతి ఇచ్చామని అనడమేమిటి?' అంటూ గంభీర్ ప్రశ్నించాడు. అంటే యువీ ఏదైనా ఫార్మాట్‌లో భారత క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడా అని అడిగాడు. లేదంటే అసలు యువీని ఎంపిక చేయమని చెబుతున్నారా? ఇంతకీ మీరు 'రెస్ట్' అన్న పద ప్రయోగం చేయడం వెనుక కారణం వివరించాలని డిమాండ్ చేశాడు. యువీని వరల్డ్ కప్‌లో చూడాలనుకుంటే అతనికి మరిన్ని అవకాశాలు ఇచ్చి ఉండేవారని అన్నాడు. యువీ పునరాగమనం కోసం, టీమిండియాకు ఆడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న వేళ అతనికి రెస్ట్ ఇచ్చామని చెప్పడం వెనుక మతలబు ఏమిటని గంభీర్ నిలదీశాడు. పునరాగమనం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న యువీకి టీమిండియాలో స్థానం సంపాదించడం కష్టమేనని గంభీర్ అన్నాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-